www.jagritiweekly.com
సంపుటి: 77 సంచిక: 42 పుటలు: 52

జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు శ్రావణ బహుళ విదియ
11-17 ఆగస్ట్ 2025
వెల: ₹20/-

పే.12 అధఃపాతాళం నుంచి అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా..

పే.15 సాఫ్ట్ పవర్ నుంచి హార్డ్ పవర్ వైపునకు...

పే.20 రక్షణ రంగంలో భారత్ ఆధిపత్యానికి నిదర్శనం.. ఆపరేషన్ సిందూర్

పే.23 తెలుగు రంగస్థలం మీద వెల్లువెత్తిన దేశభక్తి రసం

ఆగస్ట్ 15
ప్రత్యేక సంచిక

యోధులు మగ్గారు.. స్వేచ్ఛ నెగ్గింది!

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

ప్రమీలాతాయి ఇక లేరు

రాష్ట్ర సేవికా సమితి పూర్వ ప్రముఖ సంచాలిక వందనీయ ప్రమీలాతాయి మేధే (తాసీజీ) జూలై 31న నాగపూర్‌లో తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 97 ఏళ్లు. రాష్ట్ర సేవికా సమితి ఆర్ఎస్ఎస్ మహిళా విభాగం. మూడు మాసాలుగా ఆమె అస్వస్థులుగా ఉన్నారు. పదిహేను రోజుల నుంచి ఆమె ఆరోగ్యం విషమంగా మారింది. ప్రమీలాతాయి సమితి నాల్గవ ప్రముఖ సంచాలిక. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, రాష్ట్ర సేవికాసమితి ప్రస్తుత ప్రముఖ సంచాలిక శాంతక్క నాగపూర్‌లోని దేవీ అహల్యాబాయి భవనానికి వెళ్లి ప్రమీలాతాయి భౌతికకాయానికి నివాళి ఘటించారు.

ప్రమీలాతాయి మేధే మరణం తనను కలచి వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ తన ఎక్స్ వేదికలో వ్యాఖ్యానించారు. ఆమె తన జీవితం మొత్తం దేశం కోసం త్యాగం చేశారని ప్రధాని అన్నారు. మహిళా సాధికారత కోసం, సంఘసేవ కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని ప్రధాని చెప్పారు.

ప్రమీలాతాయి మరణంతో గొప్ప ప్రేమమూర్తిని తాము కోల్పోయామని, చాలా క్లిష్టసమయంలో ఆమె ఈశాన్యభారతంలో నిరుపమాన సేవలు అందించారని, ఆమె సేవా దృక్పథం మా అందరికీ ప్రేరణ అని, ఆమె భౌతికంగా మన మధ్య లేకున్నా, ఆమె జీవితం మాకు నిరంతరం ప్రేరణను ఇస్తుందని డాక్టర్ భాగవత్ అన్నారు. దేశం మాతృచ్ఛాయను కోల్పోయిందని, నిస్వార్థ సేవకు ఆమె మార్గదర్శకురాలని ఆయన నివాళి ఘటించారు. అంకితభావానికి ఆమె జీవితం ఒక సజీవ సాక్ష్యమని అన్నారు. ఆమె తన జీవితం మొత్తం సమితి ధ్యేయం కోసం అర్పించారని, ఆఖరికి మరణానంతరం కూడా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, తన భౌతికకాయాన్ని దానం చేయాలని కోరుకున్నారని చెప్పారు. ప్రమీలాతాయి విరామమెరుగక శ్రమించేవారని, అన్ని విషయాలలోను తమను ప్రేరేపించడంలో ఆమె ముందు ఉండేవారని శాంతక్క అన్నారు. ఎంతో క్రమశిక్షణతో సాగిన ఆమె జీవితం, తామందరికీ స్ఫూర్తిదాయకమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రమీలాతాయి జీవితాన్ని దేశానికి అంకితం చేశారని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తన ఎక్స్ వేదిక నుంచి నివాళి ఘటించారు. రాష్ట్ర సేవికా సమితికి ఆమె గొప్ప సేవ చేశారని గడ్కరీ అన్నారు. మహిళా శక్తి ఎంతటిదో తెలియచేయడానికి, దేశం కోసం ఆమె మొత్తం జీవితాన్ని అంకితం చేశారని నివాళి అర్పించారు. తామంతా ఒక మాతృమూర్తిని కోల్పోయామని స్వయంసేవక్ ఒకరు నివాళి అర్పిస్తూ అన్నారు. ప్రమీలాతాయి కోరిక మేరకు ఆమె భౌతికకాయాన్ని నాగపూర్ ఎయిమ్స్‌కు మరునాడు అప్పగించారు. సమితి స్థాపన ఆరంభకాలం నుంచి ప్రమీలాతాయి మహిళలలో సాంస్కృతిక, జాతీయ స్పృహ కల్పించడానికి విశేషమైన సేవలు అందించారు. సంస్థ విస్తరణలో కూడా ఆమె పాత్ర ఘనమైనది.

మొదట సేవికా సమితి కేంద్ర కార్యాలయ ప్రముఖ్‌గా, అఖిల భారతీయ ప్రముఖ కార్యవాహికగా, సమితి తరఫున విశ్వవిభాగ్ ప్రముఖ్‌గా 2003నుండి 2006 వరకు సహ ప్రముఖ సంచాలికగా, ప్రముఖ సంచాలికగా 2006 నుండి 2012 వరకూ వివిధ బాధ్యతలు నిర్వర్తించారు.

భారత్‌లోనే కాక శ్రీలంక, కెన్యా, ఇంగ్లండ్, అమెరికా మొదలైన దేశాల్లో కూడా పర్యటించారు. సమితిలో ఇచ్చే సమ్యక్ ఆజ్ఞకి సాకారరూపం ప్రమీలా తాయీజీ జీవితం. వారి కట్టు, బొట్టూ, మాటతీరు, వ్యవహార సరళి, బైఠక్ తీసుకునే పద్ధతి, చదువుకునేటప్పుడు కానీ, రాసుకునేటప్పుడుకానీ వారు కూర్చునే పద్ధతి కానీ, లేచే పద్ధతి కానీ, బౌద్ధిక్ ఇచ్చేటప్పుడు కానీ ఎదుటివారితో మాట్లాడేటప్పుడు కానీ ప్రతీ విషయంలోనూ వారి సమ్యక్ సరళి అందరం నేర్చుకోవలసిందే. వారికి 75 సంవత్సరాల వయసులో వందనీయ మౌసీజీ జన్మ శతాబ్ది సంవత్సరం 2003లో మౌసీజీ చిత్రప్రదర్శనీ తీసుకుని నేపాల్‌తో సహా సంపూర్ణ భారత పరిక్రమ చేసారు. 108 స్థానాలు, 28వేల కిలోమీటర్లు, 266రోజులు పర్యటించారు. సమితి కార్యవిస్తరణకు ఎంతో తోడ్పడ్డారు. తొమ్మిది గజాల చీరతో, మహారాష్ట్ర కట్టుతో దేశ విదేశాలలో పర్యటిస్తూ, అధికారులతో ఆంగ్ల భాషలో మాట్లాడుతుండే వారి తీరు చూపరులకి అద్భుతంగా ఉండేది.

జాగృతి చేదువుదాం.. చేదివిద్దాం..

ఆసక్తి కలిగించే విశ్లేషణలు..
జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు..
స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ
ముందుకు వస్తున్నది.

రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే
గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను
ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.850/-
http://payit.cc/S18970

ఐదు సంవత్సరాల చందా రూ.4000/-
http://payit.cc/S18973

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1474/-
https://payit.cc/S32796

తక్కువ ఖర్చుతో జాగృతి సంచికను రిజిస్టర్డ్ పార్సిల్
(మ్యాగజైన్ పోస్టు) ద్వారా అందుకోవడానికి
పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను ఉపయోగించాలి.
(సంవత్సర చందా రూ.850/-
+ మ్యాగజైన్ పోస్టు సం॥నికి రూ.624/-)

విడి ప్రతి
రూ.20/-

Jagriti Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

వివరాలకు సంప్రదించండి సర్క్యులేషన్ మేనేజర్ : 040-2756 1453, 99599 97013

jagritiweekly.com facebook.com Jagriti Telugu Weekly youtube.com/@Jagrititv 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి :	అసోసియేట్ ఎడిటర్	-
సబ్ ఎడిటర్ :	-	9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

'మీ'రు నిజమైన భారతీయుడే అయితే, ఇలా మాట్లాడి ఉండేవారా?' ఇది భారత అత్యున్నత న్యాయస్థానం ఆగస్ట్ 4న లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌ని ఉద్దేశించి చేసిన అతి తీవ్రమైన వ్యాఖ్య. నిజమే, సుప్రీంకోర్టు నుంచి ఇలాంటి వ్యాఖ్య రావడం అసాధారణం. సమున్నత న్యాయస్థానం చేత ఇలాంటి వ్యాఖ్యలు చేయక తప్పని పరిస్థితి కల్పించినదీ రాహుల్ గాంధీయే. రాజ్యాంగం చేతబట్టి ఆయన మాట్లాడే ప్రతి మాట ప్రజాస్వామ్యాన్ని అవమానించేదే. ప్రతిపక్ష నేతగా వేసే ప్రతి అడుగు సమాఖ్య వ్యవస్థకు, దేశ సమైక్యతకు భంగకరమైనదే. వేదిక ఏదైనా, ఎక్కడిదైనా ఆయన నోరు విప్పితే దేశం మీద దూషణలే వినిపిస్తాయి. భారత సైన్యాన్ని నీచాతినీచంగా అవమానిస్తాడు. ఎన్నికల కమిషన్‌ను నిరంతరం ఆడిపోసుకుంటాడు. హిందూధర్మం అన్నా, భారత స్వాతంత్ర్య సమరయోధులన్నా మరీ చులకన భావం. ఇవన్నీ ఉన్నాయి కాబట్టే సుప్రీం కోర్టు అంత తీవ్ర వ్యాఖ్య చేయవలసి వచ్చింది. జస్టిస్ దీపంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిలతో కూడిన ధర్మాసనం చేసిన ఈ వ్యాఖ్యలను నిజమైన భారతీయులంతా స్వాగతిస్తారు. రాహుల్ నిజమైన భారతీయుడేనా అన్న ప్రశ్న ఇప్పుడు సమున్నత న్యాయస్థానం వేసి ఉండవచ్చు. కానీ అలాంటి సందేహం ఎందరో భారతీయులను చిరకాలంగా వేధిస్తున్న మాట నిజం.

డిసెంబర్ 16, 2022న భారత్ జోడో యాత్ర సందర్భంగా ఈ గాంధీ-నెహ్రూ వారసుడు సైన్యం మీద కారుకూతలు కూశాడు. గల్వాన్‌లోయలో మన సైనికులు సరిగా వ్యవహరించలేదట. దీని మీద ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. ఆ వ్యాజ్యం అలహాబాద్ హైకోర్టు నుంచి, సుప్రీంకోర్టుకు వచ్చింది. అంతిమంగా సుప్రీంకోర్టు ఆయన భారతీయతనే ప్రశ్నించవలసి వచ్చింది. పలుసార్లు రాహుల్ భారత సైనిక శక్తిని అవమానించాడు. ఎన్నికల కమిషన్ విషయంలోనూ ఇదే తంతు. రాజ్యాంగ వ్యవస్థలను తూలనాడడం అలవాటుగా మార్చుకున్నాడు. పాకిస్తాన్‌ను వెనకేసుకురావడం, చైనాను వేనోళ్ల కీర్తించడం ఆయనకు ప్రీతిపాత్రమైన విషయాలు. ఈ తిక్కను కూడా సుప్రీంకోర్టు కాస్త కుదిర్చింది. గల్వాన్ లోయలో చైనా-భారత్ సేనల మధ్య ఘర్షణ వేళ 2000 చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు శ్రావణ బహుళ విదియ

లోపలి పేజీలలో...

6లో

ముఖపత్ర కథనం

యోధులు మగ్గారు.. స్వేచ్ఛ నెగ్గింది!

అందరికీ
స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలు

ఆధ్యాత్మికం

కృష్ణం వందే జగద్గురుమ్..!

42లో

జాగృతి

సంపాదకీయం

నిజమైన భారతీయుడు కాదనే..!

డ్రాగన్ ఆక్రమించిందని రాహుల్ ఆరోపణ. చైనా ఆక్రమించుకున్నప్పుడు అక్కడ మీరు ఉన్నారా అని సుప్రీంకోర్టు నిలదీసింది. ఆ దురాక్రమణకు సంబంధించిన బలమైన ఆధారాలు మీ దగ్గర ఉన్నాయా అని కూడా నిగ్గదీసింది. ఆధారాలు లేనప్పుడు అలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని తలంటింది. ఈ సందర్భంలోనే మీరు నిజమైన భారతీయుడే అయితే ఇలా మాట్లాడి ఉండేవారు కాదని అక్షరాలా వాత పెట్టింది.ప్రతిపక్ష నేతగా అలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన బాధ్యత అని రాహుల్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదించారు. దీనికి కూడా కోర్టు తీవ్రంగా స్పందించింది. యుద్ధం అంటే రెండు వైపులా నష్టం ఉంటుంది అని గుర్తు చేసింది. ఎంత విపక్ష నేత అయితే మాత్రం ఇలాగా మాట్లాడేది అనీ మొహం వాయగొట్టింది. కానీ రాహుల్ చేస్తున్నదేమిటి? భారత్ యుద్ధ విమానాలు ఎన్ని కూలాయి? మన సైనికులు ఎందరు కన్నుమూశారు? వంటి ప్రశ్నలతో పొరుగుదేశం పట్ల ప్రేమను ఒలకబోయటమే కానీ ఆపరేషన్ సిందూర్‌లో తనకు ఎంత నష్టం జరిగిందో పాకిస్తాన్ తెలియచేసిన సంగతి ఈ బధిరాంధుడికి తెలియదు. దేశభద్రత, సైనికులు వంటి అంశాలను రాహుల్ సామాజిక మాధ్యమాలలో ఎందుకు ప్రస్తావిస్తారని, ఆయన ప్రతిపక్ష నేత అయినా లోక్‌సభలో ఎందుకు లేవనెత్తరని కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

రాహుల్ నాలుక తీట సంగతి దేశానికంతటికీ తెలుసు. ప్రస్తుతం ఈ గాంధీ-నెహ్రూ వారసుడు, అబద్ధాల పుట్ట 20 వరకు పరువు నష్టం కేసులు, మోసం, వంచన వంటి కేసులను ఎదుర్కొంటున్నాడని ఆయన న్యాయవాది అభిషేక్ సింఘ్వియే చెబుతున్నారు. తాను బ్రిటిష్ పౌరుడినని రాహులే ఒక కంపెనీకి ఇచ్చిన పత్రంలో పేర్కొన్నాడు. గాంధీజీని హత్య చేసినది ఆర్ఎస్ఎస్ అని వాగినందుకు ఒక కోర్టులో క్షమాపణ చెప్పాడు. గౌరీ లంకేశ్ హత్యలో ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని ఆరోపించి కేసులో ఇరుక్కున్నాడు. వీర సావర్కర్ మీద అత్యంత హేయమైన ఆరోపణలు చేసినందుకు కేసులు ఉన్నాయి. మోదీ ఇంటిపేరు ఉన్నవాళ్లంతా దొంగలేనంటూ హద్దుల్లేని కుసంస్కారం ప్రదర్శించి కేసును ఎదుర్కొంటున్నాడీ కాంగ్రెస్ కుక్కమూతి పిందె. ఒకసారి జార్ఖండ్‌లో ఈ పుణ్యభూమి 'రేపిస్ట్ నేషన్' అంటూ పీకలదాకా తాగినవాడిలా మాటలు తూలాడు. అదొక కేసు. మీ దగ్గర ఎన్ని లైంగిక అత్యాచారాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయో ఇవ్వాలని పోలీసులు వెంటపడితే తోక ముడిచాడు. పెగసెసె ద్వారా ట్యాపింగ్ జరిగిందని ఆరోపించాడు. దర్యాప్తు చేస్తాం, ఆ ఫోను ఇవ్వండి అంటే వెన్ను చూపిన భీరువు ఇతడు. ఎన్నికల కమిషన్‌ను తాజాగా ఓట్ల దొంగ అని, అణుబాంబు వంటి ఆధారం బయట పెడతానని చెప్పి, మొహం చాటేశాడు. పచ్చి అబద్ధాలు చెప్పడం, పలాయనం చిత్తగించడం- రాహుల్ బతుకంతా ఇంతే. ఇక బీజేపీని, మోదీనీ ఎన్నిసార్లు నిందించాడో!

విదేశీ వనితకు పుట్టినవాడికి దేశభక్తి ఉండదు అంటాడు చాణక్యుడు. అదే నిజమనిపించడం లేదా? మాతృభూమిని అవమానించే రాహుల్‌ను ఎందుకు సమర్థించాలి అని ప్రశ్నించారు అమెరికా గాయని మేరీ బిల్మెన్. కానీ ఆ బుద్ధి ఆ విజ్ఞత కాంగ్రెస్ పార్టీకి లేకపోవడమే పెద్ద విషాదం. లోక్‌సభలో ప్రతిపక్ష నేతను సుప్రీంకోర్టు, 'నిజమైన భారతీయుడవే అయితే...' అని వ్యాఖ్యానించిందంటే, అంతకంటే పెద్ద అభిశంసన ఉంటుందా! ప్రతిపక్ష పాత్రకు, నాయకుడిగా మోస్తున్న కాంగ్రెస్ పార్టీకీ, భారత ప్రజాస్వామ్యానికి రాహుల్ ఒక కళంకం కాదా? రాహుల్‌కి నైతిక విలువలే ఉంటే తక్షణం రాజీనామా చేయాలి. ★

38లో

కథ

ఇరుగు ఇగరరాదు

- పి.వి.ఆర్. శివకుమార్



రుషివాణిని రాజనీతిని మేళవించిన యోగి	-	28
వికసిత ఏపీగా మోదీ కల సాకారం (ఆంధ్రప్రదేశ్)	-	30
అందరూ నిర్దోషులే.. (ధర్మ జయం)	-	32
ఉరికంబం నుంచి ఉత్తరాలు (గళమెత్తిన గతం)	-	34
అన్నాద్భవంతి భూతాని... (శాస్త్రీయం)	-	36
దివ్యాతి 'దివ్యం' భారత మహిళా చదరంగం! (క్రీడ)	-	43
అనితరసాధ్యం.. ఆపరేషన్ మహదేవ్..! (విజయం)	-	44
బాలజాగృతి	-	46
వారఫలాలు	-	48
'మహావతార్ నరసింహా'తో దేవాలయాలుగా థియేటర్లు! (సినిమా)	-	50

జాతి గుండెలలో స్వాతంత్ర్య కాంక్ష పెల్లుబికితే, జైళ్లు నిండిపోక తప్పదు. దేశం ఆత్మ విస్మృతిని వదలించుకోవాలన్న క్షణంలోనే దేహం మీద సంకెళ్లు బిగుసుకుంటాయి. రెండు శతాబ్దాల పాటు విదేశీ పాలన మీద సాగిన భారత స్వాతంత్ర్య సమరంలో అక్షరాలా ఇదే జరిగింది. వలస పాలన నుంచి భారతావని విముక్తమయిందంటే అందుకు చెల్లించిన మూల్యం అనన్య సామాన్యమైనది. కొన్ని వందల జీవితాలు ఆ యజ్ఞంలో ఆహుతయ్యాయి. వందల మంది ఉరికొయ్యలు ఎక్కారు. కొన్ని వేల జీవితాలు ఏళ్ల తరబడి జైలు గోడల మధ్య మగ్గిపోయాయి. కానీ వారి జీవితాలే కాదు, వారి సాహసం, దృఢదీక్ష, స్వాతంత్ర్య పిపాస, దేశభక్తిలోని గాఢత అన్నీ జైలు గోడల మధ్య బందీ అయిపోయాయి. స్వరాజ్య సమరం వేళ విప్లవకారుల, కొందరు యోధుల రెండో నివాసం కారాగారమే అయింది. పరాయి పాలనలో దేశభక్తులను అణచివేయడానికి ప్రత్యేక నిర్బంధ కేంద్రాలే ఏర్పాటయ్యాయి. అలీపూర్ (బెంగాల్), నైని (ప్రయాగ్‌రాజ్), అండమాన్ సెల్యులార్ జైలు (దక్షిణ అండమాన్ జిల్లా), కడలూరు అలాంటివే. ఇవే కాదు, దేశం నలుమూలలా జైళ్లు వెలిశాయి. అక్కడ సమర యోధులను, నేరగాళ్లను ఒకే తీరులో చూశారు. అది మరీ విషాదం. అక్కడ ముగిసిపోయిన ఎన్నో జీవితాలు చరిత్ర పుటలకు చేరలేదు. అంటే వారి త్యాగాలు గాలిలో కలసిపోయాయి. అసలు దేశభక్తి భావననీ, దేశభక్తులనూ కాలగర్భంలోకి నెట్టివేయాలన్న పాశవిక ఆలోచనతో ఇక్కడ కారాగారాలే నిర్మించారు. కానీ వాటి వల్ల స్వాతంత్ర్య కాంక్ష తీవ్రమైంది. ఆగస్ట్ 14 అఖండ భారత దివస్ సందర్భంగా ఆ అమరుల త్యాగాలకు ఒక్క కన్నీటి బొట్టు అయినా రాల్చాలి.



భారత భూభాగం నుంచి నెలల కొద్దీ సముద్రం మీద ఓడలలో ప్రయాణించి అక్కడికి చేరుకునేవారు స్వాతంత్ర్య సమరయోధులు. మెడ నుంచి చేతులూ కాళ్లూ కలిపి బంధించే ఇనుప సంకెళ్లతోనే దిగేవారు–ద్వీపాంతర శిక్ష అనుభవించడానికి. సీలమండల మీద సంకెల చర్మాన్ని చీల్చినా, రక్తమోడుతున్నా అడుగులు వేగంగానే పడాలి. కాస్త సురక్షితంగా ఉండే ఇతర మార్గాలు ఉన్నా, చిత్తడి నేల మీద ఆ భయానక కారాగారం వైపు నడిపించే వారు. అదే అండమాన్ సెల్యులార్ కారాగారం. ఆ దారంతా తేళ్లు, పాములు, జలగలు, విష కీటకాలు. వాటిని తప్పించుకుందామని క్షణం ఆగినా ఒంటి మీద లాఠీలూ, తుపాకీ మడమలూ చెలరేగిపోయేవి. అలా, అండమాన్‌లో అడుగు పెట్టడమంటే నరకంలో ప్రవేశించినట్టేనన్న దృఢాభిప్రాయానికి ఖైదీలను తెచ్చేవారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని గొంతెత్తి, శిక్షకు గురైన ఆనాటి దేశభక్తులు ఆ ద్వీపంలో అడుగు పెట్టిన ఆ తొలి క్షణమే భయానకం. ఆపై ప్రతి నిమిషం ప్రాణాంతకం. ఎక్కడో అండమాన్ దీవులలో ఈ జైలు నిర్మాణం వెనుక ఉద్దేశం– జాతీయ పోరాటాలను మొగ్గలోనే తుంచడం. స్వాతంత్ర్యం కోసం నోరెత్తితే ఆ గొంతు శాశ్వతంగా వినిపించకుండా వందల మైళ్ల అవతల ఆ ద్వీపంలో బంధించడం. కుటుంబాలకు, సంస్కృతికి సుదూరంగా విసిరివేయడం.

అండమాన్ జైలు ప్రతి ఇటుక ఒక విషాదగాథను చెప్పగలదు. మానసిక శారీరక హింసతో కునారిల్లిన జీవితాలను ఆ గోడలు చూశాయి. కడుపు కాలుస్తూ, కాళ్లకు సంకెళ్లతో నడిపించిన బ్రిటిష్ రాక్షస జాతి అమానుషత్వాన్ని దశాబ్దాల పాటు పరికించాయవి. అవమానాలతో ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ల ఆక్రోశాలకే కాదు, తిరుగుబాటు తత్వాన్ని వీడలేక చావును కొని తెచ్చుకున్న వారి వీరత్వానికి కూడా పావురాల గూళ్ల వంటి ఆ జైలు సంకెళ్లలోనే ఉన్నా

యోధులు మగ్గారు.. స్వేచ్ఛ నెగ్గింది!

మాతృభూమి స్వేచ్ఛ కోసం ప్రతి క్షణం తపించిన భారత యోధుల స్థితప్రజ్ఞతకు జైలును చుట్టి ఉన్న ఆ సాగరమే ప్రత్యక్ష సాక్షి.

సెల్యులార్ జైలు ఎందుకు?

భారతదేశంలో శాశ్వతంగా తిష్ట వేయవలసిందే నని 18వ శతాబ్దం చివరికి ఈస్టిండియా కంపెనీ నిర్ధారించుకుంది. ఒక వ్యాపార సంస్థ ప్రభుత్వ అవతారం ఎత్తింది. ఇక్కడి ప్రజలను తమ దేశ శిక్షా స్మృతుల ఆధారంగా విచారించి శిక్షలు విధించింది. అందులో సర్వసామాన్యమైన శిక్ష, కారాగారమే. అలీపూర్, ప్రయాగ్‌రాజ్‌లతో పాటు పట్నా, ఆగ్రాలలో అందుకోసమే ప్రత్యేక కారాగారాలు నిర్మించారు. 1857 నాటికి దేశంలో వలస పాలకులు నిర్మించిన కారాగారాలు దాదాపు వంద. ఎన్ని తిరుగుబాట్లు జరిగి ఉంటాయో మరి! ఏవీ ఆ చరిత్రలు!

1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ఉధృతికి శ్వేతజాతి తల్లడిల్లిన మాట నిజం. ఎందరో విప్లవ కారులను కంపెనీ మూకలూ, కంపెనీ అధికారులను సిపాయీలూ ఊచకోత కోశారు. అయినా భారత్‌నీ, ఇక్కడి సంపదనీ సమూలంగా దోచుకోకుండా వెళ్లిపోవడం ఆ జాతికి సుతరాము ఇష్టం లేదు. అందుకు అది ఆశ్రయించిన మార్గం అణచివేత. దీనికి ఇక్కడి అనైక్యత కూడా ఉపయోగపడింది. ఆత్మ విస్మృతి తోడ్పడింది. ఇంగ్లిష్ వాడి మీద తిరగబడిన ప్రతి భారతీయుడిని ఆ సమాజానికి సుదూరంగా ఉంచడం, దారుణంగా హింసించడం మొదలు పెట్టారు. ఈ దుశ్చర్యలకు ఎంతో అనువైనవిగా వాళ్లకి కనిపించినవే అండమాన్ నికోబార్ దీవులు. ఈ ద్వీప సమూహం బంగాళాఖాతంలోనిది. ఉద్యమకారులను ఏకాకులను చేసి, స్వాతంత్ర్య కాంక్షను అంతం చేయాలన్న ఆలోచన ఈస్టిండియా కంపెనీకి 1789 నుంచే ఉంది. కానీ స్థానిక గిరిజన తెగలతో పొంచి ఉన్న ప్రమాదం కారణంగా ఆ ఆలోచనకు విరామం వచ్చింది. నిధుల లేమీ కారణమే. కానీ 1857 ఉదంతం అలాంటి జైలు నిర్మాణం అవసరాన్ని తీవ్రం చేసింది. ఒక పక్క ప్రథమ స్వాతంత్ర్య సమరజ్వాలలు ఎగసిపడుతూ ఉండగానే, ఒక పటిష్ట, విశాల 'శిక్షా స్థావరం' (పీనల్ సెటిల్‌మెంట్) నిర్మాణం గురించి ఈస్టిండియా కంపెనీ యోజన చేసింది. అందుకు అండమాన్ సరైనదని దాని అభిప్రాయం. అలాంటి స్థావరం ఏర్పాటు ప్రతిపాదనల కోసం ఒక సంఘాన్ని నియమించింది. డాక్టర్ ఫ్రెడ్రిక్ జాన్ మూవాత్ దాని నాయకుడు. సహాయకులుగా లెఫ్టినెంట్ జేఎస్ హీత్కోట్, డాక్టర్ జీఆర్ ప్లేఫెయిర్‌లను నియమించారు. జనవరి 15,1858న ఈ కమిటీ నివేదికను ఇచ్చింది. కంపెనీ ఆలోచనలకు తగినట్టు శిక్షా స్థావరం ఏర్పాటుకు దక్షిణ అండమాన్ సరైనదేనని తేల్చింది. శ్వేతజాతి పాలన మీద, అకృత్యాల మీద ఎవరు నోరెత్తినా, ఎన్ని తిరుగుబాట్లు జరిగినా వారం దరినీ కూడా వారి సమాజం నుంచి వేరు చేసి ఇక్కడ బంధించే సామర్థ్యం ఆ జైలుకి ఉండాలన్నది ప్రధాన ఆశయం. అలాగే అప్పటి బ్రిటిష్ వలసలు సింగపూర్, మారిషస్‌లలో అరెస్టయిన భారతీయులను కూడా ఇక్కడే ఉంచాలన్న ఆలోచన ఉంది.

నాంది పలికిన 'రాస్'

డాక్టర్ ఫ్రెడ్రిక్ ప్రతిపాదనలకు బలమైన నేపథ్యం ఉంది. ఇదంతా రాస్ అనే ద్వీపం కేంద్రంగా మొదలయిందని గుర్తుంచుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధులను ఆ దీవికి తీసుకెళ్లి బందీలుగా ఉంచే ప్రక్రియ సెల్యులార్ జైలు కట్టక ముందే ఉంది. మార్చి 10, 1858న రెండు వందల మందిని జేమ్స్ పట్టిసన్ వాకర్ పర్యవేక్షణలో మొదటిసారి తీసుకుపోయినది అండమాన్ దీవులలోని రాస్‌కే. వీరంతా ఎవరు? కరుడగట్టిన హంతకులో, గజదొంగలో, సముద్రపుదొంగలో కాదు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని ఓడినవారు. అలా వచ్చిన వారి సంఖ్య కేవలం మూడు మాసాలకే 773కు పెరిగింది. ఆ వీరులలో 309 మంది పేరు అక్కడ పెట్టిన శిలాఫలకాల మీద ఉన్నాయి. జూన్ 16,1858న వీరంతా కలసి ఆంగ్లేయుల మీద తిరుగుబాటు చేశారు. సెప్టెంబర్ 28,1858 నాటికి ఇక్కడకు బందీలుగా తరలించుకువచ్చిన వారి సంఖ్య 1,330కి చేరింది. రెండేళ్లలోనే, అంటే 1858, 1860 మధ్య భారతదేశం నలుమూలల నుంచి ఇక్కడకు తీసుకువచ్చిన విప్లవకారుల సంఖ్య రెండు నుంచి నాలుగు వేల మధ్య ఉంటుందని అంచనా. ఇంత చైతన్యాన్ని బంధించే జైలు కోసమే కంపెనీ యోచించింది. ఆ జైలు నిర్మాణానికి 1857 పోరాటయోధులతోనే బాటలు నిర్మింప చేశారు ఆంగ్లేయులు.

సెల్యులార్ జైలు నిర్మాణానికి నాంది పలికినది రాస్. 18వ శతాబ్దంలో ఈస్టిండియా కంపెనీ పాలనలో ఆ ద్వీపానికి రాస్ పేరు పెట్టారు (దీనికే 2018లో ప్రధాని నరేంద్ర మోదీ నేతాజీ సుభాశ్ చంద్ర బోస్ ద్వీప్ అని పేరు మార్చారు). రాస్ అసలు పేరు–చోంగ్ ఎకీ బూద్. డేనియల్ రాస్ అనే సర్వేయర్ ఇక్కడికి వచ్చాక అతడి పేరు వచ్చింది. 1789 తరువాత లెఫ్టినెంట్ ఆర్చిబాల్డ్ బ్లెయిర్ (మరొక సర్వేయర్, బొంబాయి నౌకదళం) వచ్చాడు. ఇతడు రాస్ ద్వీపాన్ని ఆంగ్లేయుల అడ్డాగా మార్చేశాడు. ఓడదొంగలను అదుపు చేయడం, ఓడలు మునిగితే సిబ్బందిని వాళ్లు చంపకుండా కాపాడడం కూడా ఇతని బాధ్యత. ఆ విధంగా రాస్ భౌగోళికంగా, వ్యూహాత్మకంగా కీలకమైనదని వారికి అర్థమైంది. బ్లెయిర్ ఒక ఆనువత్రి, ఒక శానేటోరియం బ్లెయిర్ స్థాపించాడు. అండమాన్ సముద్రం మీద ఆంగ్లేయులకు ఆధిపత్యం వచ్చింది. ఆర్చిబాల్డ్ బ్లెయిర్ పేరుతోనే పోర్ట్‌బ్లెయిర్ పట్టణాన్ని నిర్మించారు. నేటి రాజధాని ఇదే. ఇప్పుడు శ్రీవిజయ పురం అని పిలుస్తున్నారు.

సెల్యులార్ జైలు నిర్మించడానికి ముందు నుంచి, అంటే 1860 నుంచి తెల్లజాతి పాలకులు అండమాన్‌కు పంపించిన తమను వ్యతిరేకులైన భారతీయుల సంఖ్య 80,000. ఖైదీలతో వలసలను విస్తరించడం కంపెనీకి అలవాటే. బెన్‌కూలెన్ పెనాంగ్, మలక్కా, సింగపూర్, టానాస్సెరి, మౌల్‌మీన్ వంటి తీర ప్రాంతాలను కూడా అలాగే అభివృద్ధి చేశారు. వీరిలో అధికారుల జాత్యహం కారానికి బలైనవారు, పారిపోతూ పట్టుబడి చనిపోయినవారు, ఆ అణచివేతను, హింసను, శారీరక శ్రమను, అవమానించే తీరును భరించలేక

బలవన్మరణాలు చేసుకున్నవారు వేలల్లో ఉంటారని అంచనా. ఇంత చేసినా ఎందుకో 1796లో ఈ విస్తరణను నిలిపివేశారు. కానీ 1857 సమరం తిరిగి ఆ ద్వీపాలను శిక్షా స్థావరాలుగా మార్చవలసిన అవసరాన్ని కంపెనీ గుర్తించింది.

పదేళ్లు సాగిన నిర్మాణం

కానీ వేలాదిగా తరలించిన విప్లవకారులు, ఉద్యమకారులను కావలా కాయడం 1860 ప్రాంతానికే భరించలేనంతగా మారింది. దీనితో చాల్స్ జేమ్స్ లేయాల్, ఏఎస్ లెథరిడ్జ్ తయారు చేసి ఇచ్చిన తనిఖీ నివేదిక ప్రాతిపదికగా పోర్ట్‌బ్లెయిర్ పట్టణానికి దగ్గరగా సెల్యులార్ జైలు నిర్మాణానికి పూనుకున్నారు. 1896 నుంచి 1906 వరకు విశాల జైలు నిర్మాణం సాగింది. 19వ శతాబ్దం ఆఖరున భారతీయులలో జ్వలిస్తున్న జాతీయ భావనల ఉధృతిలో 'మహా అత్యవసర పథకం' పేరుతో సెల్యూలార్ జైలు నిర్మాణం చేపట్టారు. నాటి ఖర్చు రూ. 5,17,352. మూడంతస్తుల ఈ జైలు బండిచక్రంలో ఆకుల మాదిరి ఆకృతితో కనిపిస్తుంది. బ్రిటన్ జైళ్ల తరహా నిర్మాణమిది. 696 సెల్స్ (4.5 బై 2.7 మీటర్లు) ఉన్నాయి. నేల నుంచి మూడు మీటర్ల ఎత్తులో కిటికీ ఉంటుంది. ఇంత చిన్న చిన్న సెల్స్ ఉంటాయి కాబట్టే దీనికి సెల్యులార్ జైలు అన్న పేరు వచ్చింది. ఇంత పెద్ద కారాగారం చుట్టూ ఉండే గోడ ఏ కోట గోడనో మరిపిస్తుందనుకుంటే పొరపాటు. తక్కువ ఎత్తులోనే ఉంటుంది. కానీ గోడ దాటినా అవతల ఉన్న భారత భూభాగంలోకి వెళ్లలేరు. జైలుకీ, భారత భూమికీ నడుమ బంగాళాఖాతం. దూరం వేయి మైళ్లు. కొంత భాగం అడవి. దాని నిండా అడవి పందులు, పులులు. వీటి నుంచి తప్పించుకున్నా జారవాస్ అనే స్థానిక గిరిజనుల బారి నుంచి తప్పించుకోలేరు. ఆగంతకుడు కనిపిస్తే శరసంధానం జరిగిపోతుంది. దీనికి తోడు విపరీతమైన వర్షాలు.

అండమాన్ ఆంగ్లేయుల శిక్షా స్థావరంగా మారిన 80 ఏళ్లకు జనావాస కేంద్రం మారింది. బ్రిటిష్ పట్టణాన్ని మరిపించింది. అధికారుల ఆవాసాలు, బేకరీలు, క్లబ్ హౌస్‌లు, చర్చ్, స్మశాన వాటిక వంటివన్నీ అమరాయి. ఒక బహిరంగ వేదిక, అందులో బాల్‌రూమ్ నృత్యాలు వగైరా కూడా వచ్చాయి. టెన్నిస్, క్రికెట్, కొలనులలో ఈత వంటి క్రీడలు కూడా మొదలయినాయి. పారిస్ ఆఫ్ ది ఈస్ట్ అన్న పేరు వచ్చింది. అయితే 1941లో వచ్చిన భూకంపం ఈ వైభవాన్ని తుడిచిపెట్టేసింది. ఆ మరుసటి సంవత్సరమే 1942లో నేతాజీ సుభాశ్ చంద్ర బోస్ రాస్ ద్వీపానికి వచ్చారు. త్రివర్ణ పతాకం ఎగురవేశారు. అప్పుడే అండమాన్‌ను జపాన్ ఆక్రమించి, 1945 వరకు తన అధీనంలో ఉంచుకుంది. ఆ సమయంలో జపాన్ తవ్విన కందకాలు ఇప్పటికీ ఉన్నాయి. తరువాత ఈ కారాగారాన్ని మ్యూజియంలు, పురావస్తు కట్టడాల రక్షణ చట్టం 1958 పరిధిలోకి తీసుకువచ్చారు. కానీ జపాన్ ఇక్కడి ఖైదీలను తన పరమ శత్రువైన బ్రిటిష్ ఖైదీలుగా చూసి, హింసించింది. 44 మంది పౌరులను కాల్చి చంపింది.

నేల మీద నరకలోకాలు

రాస్ శిక్షా స్థావరం మొదలు, అప్పటికే ఉన్న కారాగారాల వల్ల ఆంగ్లేయుల ఆధిపత్యానికి రక్షణ ఏర్పడింది. కానీ అవన్నీ మొదటి నుంచి అమానుషత్వానికీ, అకృత్యాలకు ఆలవాలంగానే ఉన్నాయి. 1815లో అలీపూర్ జైలులో ఖైదీలు పని చేయడానికి నిరాకరిస్తూ సమ్మె చేశారు. కారణం, కింది కారాగారాల కంటే ఇందులో ఇచ్చే కూలీ తక్కువ. 1834లో అదే జైలులో ఖైదీలు తిరుగుబాటు చేసి జైలర్‌నీ, సూపరింటెండెంట్‌నీ చంపేశారు. 1840 ప్రాంతంలో నిరాహార దీక్షలు చాలా జైళ్లలో సర్వసాధారణం. ఈ కేంద్రాలకు ఖైదీలను తీసుకు రావడం వెనుక వారి కుటుంబాలకే కాదు, వారి సంస్కృతీ సంప్రదాయాలకు సుదూరంగా ఉంచడం ఉద్దేశం. అందుకే స్థానిక ప్రజలకు వీరంటే సానుభూతి ఉండేది. 1845–46లలో అర్రా న్యాయస్థానం మీద సాధారణ పౌరులు జరిపిన దాడి ఇలాంటి నేపథ్యం ఉన్నదే.

సిపాయిలకు బాసటగా

కారాగారాలతో జాతీయ భావాన్ని బంధించాలని చూసినా చాలా సందర్భాలలో అవే తిరుగుబాటుకు ఆసరాగా నిలిచాయి. 1857లో మీరట్ పట్టణంలో పోరాటం జరిగిందంటే అందుకు వెనుక ఉన్నది అక్కడి కారాగారమే. కంపెనీ అధికారుల ఆదేశాలు ధిక్కరించారన్న అభియోగంతో 85 మంది సిపాయిలను సంకెళ్లతో ఈ జైలులోనే బంధించారు. ఆవు కొవ్వు, పంది కొవ్వు తూటాలకు ఉపయోగిస్తున్నారన్న మాట బయటకు రావడంతో అటు హిందువులు, ఇటు ముస్లింలు కూడా తిరగబడిన సంగతి తెలిసిందే. సిపాయిలను అంత అవమానకరంగా చూడడం పట్ల సాటి సిపాయిలే కాకుండా. మీరట్ పట్టణ వాసులు కూడా ఆగ్రహించారు. తరువాత ప్రజలు, సిపాయిలు కలసి తిరుగుబాటు చేసి, ఆ జైలును దగ్ధం చేశారు. ఈ కారాగారంలో ఉన్న దాదాపు 700 మంది సిపాయిలు ఆఖరి మొగల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్‌ను కలుసుకోవడానికి ఢిల్లీ బాట పట్టారు. ఉత్తర భారతదేశంలో ఇలాంటి కొన్ని సంఘటనలు జరిగాయి. తిరగబడ్డ సిపాయిలకు స్థానికులు తోడుగా వచ్చి బందీలందరినీ విడుదల చేసేశారు. ఇలాంటి సన్నివేశం ఘైజాబాద్‌లోనూ జరిగింది. సంకెళ్లలో ఉన్న సిపాయిలను కమ్మరులు విముక్తం చేసేవారు. కానీ అందరికీ ఇలాంటి అవకాశం రాలేదు. కొందరిని అండమాన్, మాండలే వంటి జైళ్లకు తరలించారు.

పదునెక్కిన జాతీయ భావాలు

1857 తరువాత వందేమాతరం ఉద్యమం, లేదా స్వదేశీ లేదా బెంగాల్ విభజన వ్యతిరేకోద్య మంతో భారతీయుల స్వేచ్ఛా కాంక్ష కొత్త రెక్కలు ధరించింది. సామాన్యుల నేతృత్వంలో సాయుధ సమరం తెరమీదకు

బిహుశా చాలామందికి తెలియని విషయం– బలవన్మరణాలకు అతి సులభంగా ప్రేరేపించే బీభత్స వాతావరణం కలిగిన, కఠిన శిక్షలకు ఆలవాలమైన అండమాన్ జైలులో మహిళలను ఉంచడానికి కూడా ఆంగ్లేయులు వెనుకాడ లేదు. బీణాదాస్ (భౌమిక), కల్యాణి దాస్ (భట్టాచార్జీ) అనే ఇద్దరు ఇక్కడ శిక్ష అనుభవించారు. ఈ ఇద్దరు విప్లవోద్యమంలో పనిచేసిన వారే. వందేమాతరం పిలుపు ఎందరో మహిళలను కూడా కదిలించింది. బెంగాల్‌లో అరెస్టు చేసి, అండమాన్‌కు తీసుకు పోయారు. బ్రహ్మ సమాజ ప్రముఖుడు, సంఘ సంస్కర్త, జాతీయవాది బేణీ మాధాబ్ దాస్, సరళాదేవి కుమార్తెలే ఆ ఇద్దరు. హింసాయుత పంథాలో పోరాడుతూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని

వచ్చింది. ఢిల్లీ, బెంగాల్, రాజస్తాన్ వంటి ప్రదేశాలలో యువతరం ప్రాణాలకు తెగించి తుపాకీ పట్టింది. ఇందులో ముఖ్యుడు బరీంద్రకుమార్ ఘోష్ (అరవింద ఘోష్ తమ్ముడు). ఈయనను ఆలీపూర్ బాంబు కుట్రకేసులో అరెస్టు చేసి 1909లో అండమాన్ జైలుకు పంపారు. ఆయన అక్కడ 11 ఏళ్లు ఘోర శిక్షను అనుభవించారు. తన జ్ఞాపకాలను 'ది టేల్ ఆఫ్ మై ఎక్సైల్' పేరుతో అక్షరబద్ధం చేశారు కూడా. మనుషులతో కలవ కుండా చేసి మానసికంగా హింసించడం, క్షణం కూడా విరామం ఇవ్వకుండా దారుణమైన శ్రమ చేయించడం ఎంత బీభత్సమో ఆయన రాశారు.

ఘోష్ సన్నిహితుడు ఉపేంద్రనాథ్ బెనర్జీని కూడా అక్కడే బంధించారు. ఈయన రాసిన 'నిర్భాసితర్ ఆత్మకథ'లో తన అనుభవాలను నిక్షిప్తం చేశారు. అలీపూర్ కారాగారంలో శిక్ష అనుభవించిన అరవిందులవారు 'కారా కహానీ' పేరుతో అక్కడ తను అనుభవించిన శిక్ష ఎంత ఘోరమో వర్ణించారు. ఆనాటికి ఉన్న అంతర్జాతీయ జైలు నిబంధనలను

సెల్యులార్ జైలు

బట్టి ఖైదీలను అంత దారుణంగా హింసించరాదు. కానీ బ్రిటిష్ జాతి ఆ నిబంధనలు లేనట్టే ప్రవర్తించింది. అయినా పలు పంథాలలో ఖైదీలు తమ హక్కుల రక్షణకు సాహసోపేతంగా ప్రయత్నించేవారు. 1929లో మియాన్‌వాలి, లాహోర్ జైళ్లలో భగత్‌సింగ్, బటుకేశ్వర్‌దత్ చేసిన నిరాహార దీక్షలు ఇలాంటివే. వీరి సమ్మె దాదాపు మూడు మాసాలు సాగింది. దేశమంతటా ఆ వార్త వ్యాపించింది. కేవలం నిబంధనల మేరకు తిండి, బట్ట ఇవ్వాలని, ఖైదీలపై హింస తగ్గాలని, పుస్తకాలు, వార్తాపత్రికలు అందుబాటులో ఉంచాలని మాత్రమే వారు కోరారు.

వీర్ సావార్కర్



బరీంద్రనాథ్

ప్రభుత్వం క్రూరమైనది. దిగి రాలేదు. అంత తీవ్ర నిరసన చేపట్టక తప్పలేదు. తూర్పు భారతంలో జాతీయవాదాన్ని అణచివేయడానికి అలీపూర్ జైలు నుంచి దాదాపు 100 మంది విప్లవకారులను 1933లో అండమాన్ జైలుకు తరలించారు. వీరూ పాత ఖైదీలు కలసి అండమాన్‌లో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షతో కొంత మార్పు వచ్చింది.

కాలాపానీ... త్యాగమూర్తుల నిలయం

అండమాన్ సెల్యులార్ జైలు లేదా కాలాపానీ పేరు చెప్పగానే వెంటనే ఒక పేరు గుర్తుకు వస్తుంది. అదే వినాయక్ దామోదర్ సావర్కర్. ఆయన అన్నగారు బాబూరావ్ సావర్కర్ కూడా ఇదే జైలులో కఠిన శిక్ష అనుభవించారు (మరొక సోదరుడు నారాయణరావ్ సావర్కర్, స్వాతంత్ర్య సమర యోధుడు. వైద్యుడు. ఈయనను గాంధీజీ హత్య నేపథ్యంలో అహింసా వాద కాంగ్రెస్ వాదులు రోడ్డు మీదకు లాక్కొచ్చి కొట్టి చంపారు).

ఇంకా భాయి పరమానంద్, బటుకేశ్వర దత్, త్రైలోక్యనాథ్ చక్రవర్తి, సోహన్‌సింగ్, బరీంద్రకుమార్ ఘోష్, ఉల్లాస్కర్ దత్, సచీంద్రనాథ్ సన్యాల్, హరేకృష్ణ కోనార్, సుబోధ్ రాయ్, లాధారామ్, ఇందుభూషణ్ రాయ్, పృథ్వీసింగ్ ఆజాద్, పులీన్‌దాస్, గుర్ముఖ్‌సింగ్, మోతీలాల్ వర్మ, బాబూ రామ్‌హరి, పండిత్ ప్రేమానంద్, ఫజల్ ఏ హక్ ఖైరాబాదీ, యోగేంద్ర శుక్లా ఇక్కడ శిక్ష అనుభవించారు. బరీంద్రనాథ్ ఘోష్ ఇంతటి పటిష్టమైన జైలు గోడల నుంచి 1915లో తప్పించు కున్నారు. తప్పించుకుని బయటపడే అదృష్టం దక్కిన ఏకైక స్వాతంత్ర్య సమరయోధుడు బరీన్. ఉల్లాస్కర్ దత్‌కు బ్యాటరీ సాయంతో (ఆ జైలులో రాత్రి దీపాలు ఉండేవి కావు. విద్యుత్ ఎలాగూ లేదు) విద్యుదాఘా తాలు ఇచ్చేవారు. అవి ప్రత్యేకంగా బెంగాల్ నుంచే తెప్పించిన బ్యాటరీలు కావడం విశేషం.

ఆ అక్క చెల్లెలు...

కూల్చడానికి ప్రయత్నించారన్న అభియోగంతో వీరికి శిక్ష పడింది. కల్యాణి దాస్ 'జీబన్ అధ్యయన' అన్న రచనలో తన అనుభవాలు ప్రచురించారు. ఫిబ్రవరి 6,1932వ తేదీన బీణాదాస్ నాటి బెంగాల్ గవర్నర్ సర్ స్టేన్లీ జాక్సన్‌ను కాల్చి చంపడానికి ప్రయత్నించారు. కలకత్తా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ భవన్‌లో గవర్నర్ మీద బీణాదాస్ ఐదుసార్లు కాల్చారు. చిట్టగాంగ్ వీరుల బృందానికి చెందిన ఆ అక్కాచెల్లెళ్లు తమ నాయకుడు సూర్యసేన్‌ను నిర్బంధంలోకి తీసుకున్నందుకు ఈ ప్రతిచర్యకు ఉపక్రమించారు. ఆమెకు తొమ్మిదేళ్లు కఠిన కారాగార శిక్ష పడింది. ఇదే కేసులో ఆమె అక్కగారు కల్యాణీ దాస్‌కు జీవిత ఖైదు విధించారు. కలకత్తాలోనే ప్రెసిడెన్సీ జైలులో ఆమెను ఏకాంత వాసంలో ఉంచారు. కల్యాణి తన రచనలో శోభారాణి అనే ఆమె పేరు ప్రస్తావించారు. పోలీసుల హింసతో ఆమెకు పక్షవాతం వచ్చింది. చివరి జీవితం దయనీయంగా గడిచింది. ఈమె పుస్తకాన్ని ఏ స్టడీ ఆఫ్ లైఫ్ పేరుతో ఆంగ్లానువాదాన్ని కుమారుడు జయభారత భట్టాచార్జీ ముద్రించారు. ప్రెసిడెన్సీ జైలులో కూడా నిర్బంధం పరమ ఘోరంగా ఉండేదని ఆమె స్వీయానుభవాలను అందించారు. కురచగా

కల్యాణి దాస్

బీణాదాస్

ఉండే జైలు యూనిఫారాలను ధరించడానికి స్త్రీలు నిరాకరిస్తే ఎంత యుద్ధం జరిగిందో ఆమె రాశారు. అమ్మమ్మ వయసు వారిని కూడా ఆ దుస్తులు వేసుకోవాలని బాధించారు.

బెంగాల్ వీరులే ఎక్కువ

అండమాన్ సెల్యులార్ కారాగారంలో 1909 నుంచి 1938 వరకు శిక్ష అనుభవించినవారిలో 68 శాతం విప్లవకారులు ఉమ్మడి బెంగాల్ ప్రాంతం వారే. ఈ విషయం కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ప్రకటించింది (ఫిబ్రవరి 13, 2025). పైన పేర్కొన్న ఆ రెండు సంవత్సరాల నడుమ ఆ కారాగారానికి 585 మందిని తరలించారు. అందులో బెంగాలీలు 398 మంది. తరువాత స్థానం పంజాబీలది. 95 మంది పంజాబీలు అదే సమయంలో అక్కడ ఉన్నారు. అయితే ఈ అంకెలతో విభేదించేవారు ఉన్నారు. ఆ సంఖ్య ఇంకా ఎక్కువేనని చెప్పడం వాస్తవం.. 1909–1931 మధ్య ఆ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన వాడే డేవిడ్ బేరీ. బేరీ బుచర్ అని పిలిచే వారు. నీవు ఇక్కడ ఉన్నంత కాలం నేనే నీకు దేవుడిని అని చెప్పేవాడు, ఖైదీలకు.

సార్వభౌమాధికారాన్ని సవాలు చేస్తే...

బ్రిటిష్ సార్వభౌమాధికారాన్ని సవాలు చేసినట్టు కనిపించిన ఏ విప్లవకారుడినైనా ఆంగ్ల ప్రభుత్వం అండమాన్ తరలించేదన్నది నిజం. అలీపూర్ బాంబు కేసు, నాసిక్ కుట్ర కేసు, గదర్ పార్టీ లాహోర్ కుట్ర కేసు, బెనారస్ కుట్ర కేసు, ఇంటర్ ప్రోవెన్షియల్ కేసు, చిట్టగాంగ్ ఆయుధాగారం కుట్ర కేసు, గయా కుట్ర కేసు వంటి వాటిలో పట్టుబడిన వారందరినీ ఇక్కడికే తరలించారు.

వీరిని అరాచకవాదులు, ఉగ్రవాదులు, దేశద్రోహులు పేరుతో విభజించేవారు. 'ఎస్' అన్న అక్షరం చొక్కా మీద ఉంటే వాళ్లు సెడిషనిస్టులు. అంటే దేశద్రోహులు. 'సి' అని ఉంటే కాన్స్పిరసీ (కుట్ర) కేసు వారు. ప్రమాదకరమైన వారు అన్న బ్యాడ్జిలు రాజకీయ ఖైదీలకు పెట్టేవారు. అంటే 'డి' అక్షరం ఉండేది. సావార్కర్ చొక్కా మీద ఇదే ఉండేది. సావార్కర్, ఉల్లాస్కర్, బరీంద్రనాథ్ భాయి పరమానంద్ వంటివారు ఈ విభజనను నిలిపి వేయించేందుకు పోరాడారు.

గొడ్డు చాకిరితో చంపేవారు

సెల్యులార్ జైలుకు వచ్చిన ఖైదీలతో పని చేయించేవారు. అక్షరాలా గొడ్డు చాకిరి. అంతటి దేశభక్తులను పశువుల్లా చూసేవారు. అడవులు కొట్టడం, గానుగ ఆడించి కొబ్బరి నూనె తీయడం, కొబ్బరి పీచును వినియోగంలోకి తేవడం వంటి పనులే కావచ్చు. కానీ నిర్దేశించిన రీతిలో ఉత్పత్తి జరగకపోతే మళ్లీ ఉప శిక్షలు పడిపోయేవి. నిరంతరం నీటి ఎద్దడి ఉండేది. 'మా ఊరిలో ఎద్దులు

అండమాన్‌లో మన్యం వీరులు, తెలుగువారు

విశాఖ మన్య విప్లవంలో పాల్గొన్న ఎనిమిది మంది కూడా ఇందులో శిక్ష అనుభవించారు. అల్లూరి శ్రీరామరాజుతో పనిచేసిన అగ్గిదొర (వేగిరాజు సత్యనారాయణరాజు), మరొక పన్నెండు మంది కూడా ఇక్కడ శిక్ష అనుభవించారు. తగ్గి వీ(బీ)రయ్యదొర, లచ్చమయ్య, బోనంగి పండు పడాలు, బోనంగి పాండు పడాలు, పుట్టయ్య పేరుతో ఇద్దరు, పోతయ్య కొరబు, కోటయ్య కొరబు, కుంచెట్టి సన్యాసి, గులివేల సన్యాసి, చిన్నయ్య, లింగయ్య పేర్లు అక్కడ కనిపిస్తాయి. ఇక్కడ శిక్ష అనుభవించి, అనుభవాలు కూడా రాసిన ప్రతివాద భయంకరాచారి కూడా తెలుగువారే. ముస్తఫా అలీ అనే పోలీసు అధికారిని చంపడానికి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన భయంకరాచారి, ఆయన అనుచరులు ఏప్రిల్, 1933లో ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. అమర్చిన బాంబులు మాత్రం పేలి కుట్ర బయటపడింది. ఏడేళ్ల ద్వీపాంతర శిక్ష విధిస్తూ సెప్టెంబర్ 26,1935న మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అక్కడికి పంపారు. కానీ 1931లో ప్రాంతీయ ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచినప్పుడు భయంకరాచారి విడుదలై వచ్చారు.

మాత్రమే గానుగ లాగుతాయి. ఎంతో అలవాటు ఉన్న ఆ పశువులతోనే రోజుకు 16 పౌనుల ఆవనూనె ఉత్పత్తి అవుతుంది. కానీ ఈ సెల్యులార్ జైలులో మరో ఇద్దరు తోటి ఖైదీలతో కలసి నేను గానుగ తిప్పేవాడిని. నిత్యం సాయంత్రానికల్లా 80 పౌనుల కొబ్బరినూనె ఉత్పత్తి చేయవలసి వచ్చేది. అంత ఉత్పత్తి సమయానికి పూర్తి కావడానికి జమాదారులు మమ్మల్ని పరుగెత్తించేవారు. వేగం తగ్గినప్పుడల్లా దారుణంగా కొట్టేవారు. కింది పడిపోయినా కొడుతూనే ఉండేవారు. ఇది నిత్యం జరుగుతూనే ఉండేది'. ఇది అలీపూర్ కుట్ర కేసులో శిక్షపడి వచ్చిన ఉల్లాస్కర్ దత్ చెప్పిన ఒక అనుభవం మాత్రమే. గానుగ తిప్పించడం పరమ కఠోరమైన శిక్ష. ఈ శిక్ష అనుభవిస్తూనే చాలామంది చనిపోయారు. బేరీ బుచర్ సిబ్బంది తీవ్రంగా కొట్టడం వల్ల గదర్ వీరుడు బాబా భాన్‌సింగ్ చనిపోయాడు. ఇందు భూషణ్ రాయ్, నరీంగున్ సింగ్ ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో ఉన్నారు. వీరు టోర్న్ కుర్తా పేరుతో పిలిచే ఒక శిక్షను భరించలేక ఉరి వేసుకుని చనిపోయారు. నిజానికి ఈ జైలులో శిక్ష అనుభవించడం కంటే, చచ్చిపోవడమే మేలన్న అభిప్రాయానికి వచ్చేవారు. పంజాబ్ నుంచి వచ్చిన రామ్ రఖా అనే దేశభక్తుడు ఉపవాసాలతో చనిపోయాడు. ఇతడు ఆమరణ నిరశన పాటించాడు. తన యజ్ఞోపవీతాన్ని అవమానించినందుకు ఆయన ఆత్మహత్యను ఆశ్రయించాడు. నిరాహారదీక్ష కొనసాగినా చావు తప్పేది కాదు. ఆ దీక్షను భగ్నం చేయాలని అధికారులు భావించినా చావు తప్పేది కాదు. దీక్షను భగ్నం చేయడానికి బలవంతంగా పాలు తాగించేవారు. అవి ఊపిరి తిత్తులలోకి వెళ్లి ఖైదీ కన్ను మూసేవాడు. ఇలా చనిపోయిన వారు మహావీర్ సింగ్, మోహన్ కిశోర్ నామ్‌దాస్, మొహిత్ మొయిత్రా (వీరు భగత్‌సింగ్ అనుచరులు). వీరికి పాలు ఊపిరితిత్తులలోకి వెళ్లి న్యుమోనియా వచ్చింది. పూర్తిగా ఏకాంతంలో ఖైదీలను ఉంచే గదులలో ఏమీ సౌకర్యాలు ఉండేవి కావు. ఆఖరికి కాలకృత్యాలకు కూడా. రాత్రి కూడా ఇదే పరిస్థితి. ఖైదీలకు రెండు మట్టి కుండలు ఇచ్చేవారు. ఒకటి నీరు తాగడానికి, ఆహారం కోసం. రెండోది మలమూత్రాల కోసం. అది ఆ గదిలో ఒక మూల ఉంచేవారు. అది నిండిపోయినా, ఆ దుర్గంధాన్ని భరిస్తూ వేకువ వరకు వేచి ఉండాల్సిందే. 'కొందరు ఖైదీలు మలమూత్రాలను ఆపుకోలేక సెల్‌లోనే విసర్జించేవారు. వాటిని విసర్జించిన వైపే తలపెట్టి పడుకోవలసిన పరిస్థితి ఉండేది' అని వినాయక్ దామోదర్ సావార్కర్ తన 'ది స్టోరీ ఆఫ్ మై ట్రాన్స్‌పోర్టేషన్ ఫర్ లైఫ్'లో రాసుకున్నారు.

ఇందుభూషణ్ రాయ్, ఉల్లాస్కర్ దత్‌ల ఆత్మహత్యలతో ఆ జైలులో ఏం జరుగుతున్నదో, అదెంత దారుణమో భారతదేశానికి తెలిసింది.

ఆ ఆరుగురు...

ఆరుగురు ఖైదీల గురించి భారత జాతి ప్రత్యేకంగా స్మరించుకోవలసి ఉంటుంది. ఫిబ్రవరి 17,1934న బీర్భూమ్ కుట్ర కేసులో అరెస్టయిన హరిపాద భట్టాచార్జీని కూడా ఇక్కడే ఉంచారు. అప్పటికి ఆయన వయసు 15 సంవత్సరాలు. ఈ జైలుకు వచ్చిన పిన్నవయస్కుడు. ఇంకా ఆనందప్రసాద్ గుప్తా , సాహేరామ్ దాస్ ఫకీర్ చంద్రసేన్ (చిట్టగాంగ్ ఆయుధాగారం మీద దాడి కేసు, 1930) సుధేందు బికాశ్ దాస్తిదార్, హరిమోహన్ చటర్జీలను కూడా అండమాన్ జైలులో ఉంచారు. వీరంతా 18 సంవత్సరాలలోపు వారు.

నిరాహార దీక్ష చేస్తున్న యోధుల నోటిలో ఆహారం కుక్కే తీరు దారుణం. ఖైదీలను ఇనుప కడ్డీలతో బాదేవారు. 1937లో రెండు వందల మంది యోధులు నిరాహార దీక్ష చేయడం, అది 36 రోజులు సాగడంతో దేశం కదిలింది, రవీంద్రనాథ్ టాగూర్, గాంధీజీ, కాంగ్రెస్ కమిటీ కదిలింది. అప్పుడు కొంతమందిని విడుదల చేశారు కూడా. కొంత కారిన్యం కూడా తగ్గింది.

మనుషులు ముట్టలేని తిండి

దేశభక్తులను పశువుల కంటే హీనంగా చూసేవారు. అది ఆహారం దగ్గర కనిపించేది. అది ఏమాత్రం పరిశుభ్రంగా ఉండేది కాదు. మనుషులు ముట్టలేని తిండి. అది కూడా చాలినంత ఉండేది కాదు. 'ది టేల్ ఆఫ్ మై ఎక్సైల్'లో బరీంద్రనాథ్ ఆ దారుణ అనుభవాన్ని నివేదించారు. తుప్పు స్పష్టంగా కనిపించే ఒక ఇనుప కంచంలో, ఇనుప పాత్రలో వాళ్లకి గంజి వంటివి ఇచ్చేవారు. ఒక నిక్కరు, ఒక చొక్కా మాత్రమే ఇచ్చేవారు. లోపల లంగోటి ఉండేది. సిగ్గుతో చచ్చిపోతూ కళ్లు మూసుకుని స్నానాలు చేసేవారు. అంతా పురుషులే అయినా కౌరవ సభలో ద్రౌపది అనుభవించిన పరిస్థితి గుర్తుకు వచ్చేదని ఆయన రాశారు. ఇలాంటి అనుభవాలు, వేలాదిగా అక్కడ శిక్ష అనుభవించిన ఖైదీల జీవితంలో లక్షలలో ఉంటాయి.

త్యాగధనులను మరచిపోయిన జాతిగా ప్రపంచం భారతదేశాన్ని వేలెత్తి చూపించే కొన్ని రాజకీయ పార్టీలు వ్యవహరించడం క్షంతవ్యం కాదు. ఇప్పటికే జరగవలసిన నష్టం జరిగింది. వారంతా చనిపోయి ఉండవచ్చు. కానీ వారి సేవలు గుర్తుంచుకోవలసిన బాధ్యత దేశానికి ఉంది. స్వతంత్ర భారత ప్రథమ ప్రధాని నెహ్రూ సైతం వీరి త్యాగాలను స్మరించకపోవడం గొప్ప విషాదమని పెద్ద విమర్శే ఉంది. ఈ విమర్శను కాదనలేం. సావర్కర్ వంటి ధన్యజీవిని విమర్శించడానికి అజ్ఞానం లేదు. ఇన్నివేల మంది స్వాతంత్ర్య పోరాటయోధులను, హుతాత్మలను కనీసం ఆగస్ట్ 15న గుర్తుకు తెచ్చుకోవాలన్న ఇంగిత జ్ఞానం కూడా జాతిలో నాశనం చేసే ప్రయత్నం జరుగుతున్నది. ఏ పంథాలో దేశం కోసం పోరాడినా వారంతా మహనీయులే. మన తరం సంకెళ్ల మధ్య జన్మించకుండా చేసిన వారందరికీ మనం ఎప్పటికీ కృతజ్ఞత చూపాలి. వారి ఏ ఒక్కరూ ఏనాడూ స్వతంత్ర భారతాన్ని ఏలాలన్న కోర్కెను ప్రకటించ లేదు. వందల ఏళ్ల బానిసత్వం నుంచి, విదేశీ పాలన నుంచి భారతావనిని విముక్తం చేయాలని మాత్రమే వారు కోరుకున్నారు. అలాంటి అమరవీరులందరికీ, త్యాగధనులందరికీ ఇదే మా నివాళి.

– జాగృతి డెస్క్



అధఃపాతాళం నుంచి అ

వర్తమాన భారతంలోని ప్రజలలో అత్యధికులు స్వాతంత్ర్యానంతరం జన్మించినవారే. ముఖ్యంగా నేటితరం యువత ఆర్థిక సంస్కరణలు అమలు జరిపిన అనంతరం పుట్టినవారే. కాబట్టి వాళ్లలో చాలామందికి మనం స్వాతంత్ర్యానంతరం సాధించిన విజయాలేంటి? స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ తదుపరి ప్రపంచంలో అత్యంత అధిక జనాభాగల దేశంగా పూర్తిగా ఆహార భద్రత సాధించటంతోపాటు, ప్రపంచంలో ప్రభావవంతమైన దేశాలలో ఒకటిగా ఎదిగిన మన విజయపరంపరను, అధిగమించిన సమస్యలను గుర్తు చేసుకోవటం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా అవసరం.

అనేక సంవత్సరాల విదేశీ పాలనవల్ల మన ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోయింది. 1900 సంవత్సరంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన దేశం వాటా 20 శాతంగా నిలిచింది. అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మనం దాదాపు వాటిలో నాలుగో వంతు వాటా కలిగి ఉండేవాళ్లము. అటువంటిది పరపాలనలో మన ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటూ 1947 నాటికి మన వాటా 3.5 శాతానికి తగ్గిపోయింది. 1950-51లో మన దేశ స్థూల జాతీయ ఉత్పత్తి రూ.4,96,848 కోట్లుగా ఉండేది. అది క్రమంగా పెరుగుతూ వచ్చి 2023-24 నాటికి రూ.1,71,25,892 కోట్లుగా నమోదైంది. ఈ గణంకాలను కాన్స్టంట్ ప్రైసెస్ - స్థిర ధరలు ప్రకారం చేపట్టినట్టుగా గుర్తించాలి. 1950-51లో మన తలసరి ఆదాయం అప్పటి ధరల ప్రకారం రూ.265 (స్థిర ధరలు ప్రకారం రూ.12,443). అదే 2023-24 నాటికి రూ.1,06,744గా, ఇప్పటి ధరల ప్రకారం రూ.1,84,208 గా నమోదైంది.

స్వాతంత్ర్యానంతరం మన ఆర్థిక వ్యవస్థ స్థిరధరల ప్రకారం 35 రెట్లకు పైగా పెరిగింది. కేవలం 77 సంవత్సరాల్లో మన ఆర్థిక వ్యవస్థ 35 రెట్లు పెరిగిందంటే మనం సాధించిన విజయం సాధారణమైనది కాదని గుర్తించాలి. ప్రపంచంలో ఇంత వేగంగా వృద్ధిని సాధించిన దేశాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. మన కన్నా వేగంగా వృద్ధిని సాధించిన దేశాలూ ఉన్నాయి. అంత మాత్రం చేత మనం తక్కువ అని, నిరాశ చెందాల్సిన అవసరం లేదు. స్వాతంత్ర్యం వచ్చే నాటికి మన ఖజానా ఖాళీగా మిగిలింది. దేశం పేదరికంతోపాటు, అనేక సమస్యలతో సతమతమవుతున్నది. ఆ పరిస్థితుల్లో స్వతంత్ర భారతదేశ తొలి ఆర్థికమంత్రి ఆర్.కె. షణ్ముగం చెట్టి నవంబర్ 26, 1947న రూ.24.59 కోట్ల ద్రవ్యలోటుతో తొలి బడ్జెట్ను ప్రవేశపెట్టారు. అప్పట్లో మన కేంద్ర ప్రభుత్వం మొత్తం ఆదాయం రూ.171.15 కోట్లుగా అంచనావేసి, రూ.197.29 కోట్లు ఖర్చు చేయటానికి ప్రతిపాదించేది. అందులో రూ.93 కోట్లు రక్షణ రంగానికి కేటాయించారు. అంటే ఆదాయంలో 50 శాతానికి మించి రక్షణ రంగానికి కేటాయించారు. మనం చేసుకునే దిగుమతులకు దేశీయ ప్రత్యామ్నాయాలను గుర్తించేవారు. వాటి వృద్ధి చేసేవారు. తద్వారా దిగుమతులను నిలువరించి దేశీయ ఉత్పత్తిని పెంచడంతోపాటు, వాణిజ్యలోటు తగ్గించే లక్ష్యంతో బడ్జెట్ను ప్రవేశపెట్టారు. భారత రాజ్యాంగాన్ని అమలుపరిచిన అనంతరం భారత రిపబ్లిక్కు తొలి ఆర్థిక మంత్రిగా జాన్ మతాయ్ ఫిబ్రవరి 28,1950న బడ్జెట్ను ప్రవేశపెట్టారు. అందులో కేంద్ర ప్రభుత్వ ఆదాయం రూ.347.50 కోట్లుగా అంచనావేసారు. అందులో రూ.168 కోట్ల రూపాయలను రక్షణ రంగానికి కేటాయించారు.ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచటం, దిగుమతులను తగ్గించటం వంటి లక్ష్యాలను నిర్దేశించారు. అదే బడ్జెట్లో ప్రణాళికా సంఘం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించటానికి ప్రైవేటు రంగ సంస్థలు అంతగా లేవు. ఆ కారణంగా ప్రభుత్వ రంగంలోనే ఉపాధి కల్పించటానికి ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించటం, అనేక రంగాలలో ప్రభుత్వం నేరుగా ప్రజా సంక్షేమ కార్యాలు చేపట్టటం వంటి చాలా కారణాలవల్ల ప్రభుత్వ వ్యయం బాగా పెరిగింది.

ఖర్చు పెరుగుతోంది కాబట్టి ఆదాయపు వనరులు పెంచుకోవటానికి క్రొత్త మార్గాలు అన్వేషించసాగారు. అందులో భాగంగా 1957-58లో అప్పటి ఆర్థికమంత్రి టి.టి.కృష్ణమాచారి సంపద పన్నును ప్రవేశపెట్టారు. అప్పట్లో సోషలిస్టు విధానాల వ్యామోహంలో పన్ను రేట్లు పెంచటం, పారిశ్రామిక అభివృద్ధి పేరుతో అనేక ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పటం ఆర్థిక వ్యత్యాసాలను నవరించే ప్రయత్నంలో భాగంగా ప్రైవేటు పెట్టుబడులను నిర్లక్ష్యం చేయటం, ప్రైవేటు వ్యాపారాలకు అడ్డంకులు కల్పించటం మొదలుపెట్టారు. దాని ప్రభావంవల్ల 1960-1970 మధ్య కాలంలో మన స్థూల జాతీయ ఉత్పత్తి కేవలం 40 శాతం పెరిగింది. ఆ వేగం మరింత తగ్గి 1980-1990 మధ్య కాలంలో మనం కేవలం 34 శాతం వృద్ధితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ప్రగతికి అవరోధంగా మారుతున్న విధానాలను గుర్తించి, దిద్దుబాటు చర్యలను చేబట్టలేదని అపోహపడవలసిన అవసరం లేదు. ఆర్థిక ప్రగతిని మెరుగుపరచడానికి ముఖ్యంగా పారిశ్రామిక ఉత్పత్తిని పెంచటానికి విధానపరమైన సవరణలు చేసే ప్రయత్నాలు కొనసాగాయి. అందులో భాగంగా 1968లో అప్పటి ఆర్థికమంత్రి మొరార్జీ దేశాయిగారు ఎక్సైజ్ సుంకాల విషయంలో సంస్కరణలు ప్రవేశపెట్టారు. తద్వారా ఫ్యాక్టరీ గేట్ల

తి పెద్ద ఆర్థిక వ్యవస్థగా..

వద్ద ఎక్సైజ్ సుంకాలను మదింపు చేసి, స్టాంపింగ్ వేసే అధికారుల పర్యవేక్షణ విధానాన్ని రద్దు చేశారు. పారిశ్రామిక సంస్థలకు అవి చెల్లించవలసిన సుంకాలు, పన్నులపై స్వీయ మదింపు చేసే బాధ్యతను అప్పగించారు. తద్వారా దేశంలో స్వీయ మదింపు విధానానికి శ్రీకారం చుట్టారు. అదే విధానం కొన్ని మార్పులతో ఈనాటికీ కొనసాగటం గమనార్హం.

మనకు స్వాతంత్ర్యం వచ్చే నాటికి మన పరిస్థితులు అంత గొప్పగా లేవు. మన దేశంలో మూడొంతుల జనాభా వ్యవసాయంపై ఆధారపడినప్పటికి మన రైతులు అత్యంత పేదరికంలో మగ్గేవారు. చాలామందికి సొంత వ్యవసాయ భూమి ఉండేది కాదు. ఆధునిక వ్యవసాయ పనిముట్లు ఉండేవికావు. ఎక్కువ మంది వ్యవసాయ కూలీలుగా మనుగడ సాగించేవారు. అక్షరాస్యత మన దేశంలో కేవలం 15శాతంగా ఉండేది. ప్రజల సగటు జీవనశైలి దుర్భరంగా ఉండేది. సగటు జీవితకాలం 32 సంవత్సరాలు. సరైన విద్యా, వైద్య రవాణా సౌకర్యాలు ఉండేవి కావు. పరిశ్రమలు పరిమితంగా ఉండేవి. వ్యవసాయ దిగుబడి అల్పంగా ఉండేది. అందుకే మన ప్రాధాన్యతలు వేరుగా ఉండేవి. అప్పట్లో మన జనాభా 36 కోట్లు. ఇది ప్రపంచ జనాభాలో ఏడవ భాగంగా ఉండేది. మన సగటు తలసరి ఆదాయం తక్కువగా ఉండేది. మన ప్రజలు సగటు ఆదాయం ఆ రోజులలో అమెరికా ప్రజల సగటు ఆదాయంలో 15వ వంతుగా ఉండేది. ఇటువంటి పరిస్థితులలో దేశ ప్రజల సంక్షేమం కోసం, వరుసగా అనేక ప్రయత్నాలు చేశారు. అందుకే తొలి రోజులలో రక్షణ వ్యయానికి కేటాయింపులు అధికంగా చేసినా, వ్యవసాయ పారిశ్రామిక ఉత్పాదకత పెంచటానికి ప్రాధాన్యత ఇచ్చారు. 1952-53లో ఆహార ఉత్పత్తి పెరిగి, ధరలు తగ్గినప్పటికి మనం ఆహార వస్తువుల దిగుమతి కొనసాగించాల్సి వచ్చింది. 1955-57 మధ్యకాలంలో పారిశ్రామిక రంగం వృద్ధికి ప్రాధాన్యతనివ్వటంవల్ల 5 శాతం వార్షిక వృద్ధిరేటును సాధించగలిగాము. అప్పుడే రసాయన పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు, వినిమయ వస్తువుల పరిశ్రమలలో పెట్టుబడులు పెరిగాయి. ప్రభుత్వం విద్యారంగానికి కేటాయింపులు పెంచింది. ముఖ్యంగా మాధ్యమిక విద్య, ఆపైన విశ్వవిద్యాలయ విద్య వరకు, సాంకేతిక విద్యకు కేటాయింపులు పెంచారు. ఎస్సి, ఎస్టి, ఓబిసిల విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వటానికి రాష్ట్రాలకు నిధులు సమకూర్చారు. పేదరికం తగ్గించటానికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచటానికి ప్రాధాన్యత ఇచ్చారు. అందువల్ల ప్రభుత్వ వ్యయం, అప్పులు పెరిగాయి. ప్రభుత్వం ప్రజలపై కొత్త పన్నులు విధించింది వ్యయపన్ను, ప్రయాణికులపై పన్ను వంటి పన్నులను ప్రవేశపెట్టారు. ఎక్సైజ్ సుంకాలను 400 శాతానికి పెంచారు. ఆదాయపు పన్ను చట్టంలో మార్పులు చేశారు. జీతాల ద్వారా, వ్యాపారం ద్వారా, వడ్డీల ద్వారా, అద్దెల ద్వారా వచ్చే ఆదాయాలను విడిగా గుర్తించి మదింపు చేసే ప్రక్రియను ప్రవేశపెట్టారు. 1958-60 మధ్యలో పారిశ్రామిక ఉత్పత్తి మందకొడిగా పెరిగినప్పటికీ ఇనుము, ఉక్కు, అల్యూమినియం వంటి ఉత్పత్తులు బాగా పెరిగాయి. అలాగే వాతావరణ పరిస్థితులు అనుకూలించటంవల్ల వ్యవసాయ ఉత్పత్తి పెరిగింది. దిగుమతులు తగ్గాయి. ఎగుమతులు పెరిగాయి. అయితే 1960-1965 మధ్యకాలంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంవల్ల మన వ్యవసాయ రంగంలో పెట్టుబడులకు తగినంత దిగుబడులు రాలేదు. అందువల్ల అప్పటి ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచేవి. పెట్టుబడులు పెంచేవి. ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చేవి. 1947-1968 మధ్యకాలంలో మన దేశంలో ఆహార కొరత ఉండేది. ఆహారధాన్యాలకు విదేశాలపై ఆధారపడవలసి వచ్చేది. అందుకే అప్పటి ప్రధానమంత్రి లాల్ బహదూర్‌శాస్త్రి ప్రజలను వారానికి ఒకపూట భోజనం మానేయమని దేశప్రజలకు పిలుపు ఇచ్చారు. హరిత విప్లవానికి నాంది పలికారు. ఫలితంగా మనం ఆహార స్వావలంబన సాధించగలిగాము. 1950-51లో 135 మెట్రిక్ టన్నులుగా ఉన్న మన వ్యవసాయ ఉత్పత్తులు ప్రస్తుతం 1300 మెట్రిక్ టన్నులకు మించిపోయాయి. ఇది స్వతంత్ర భారతదేశంలో మనం సాధించిన విజయం. దేశంలో వ్యవసాయ పంటల భూమి విస్తీర్ణం స్వల్పంగా తగ్గినప్పటికీ ఉత్పత్తి పెరగటం సాధ్యపడిందంటే అందులో సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తలు, విధానకర్తలు వంటి అనేక వర్గాల కృషి ఇమిడి ఉంది. 1970-75 మధ్యకాలంలో మన బడ్జెట్లు మెట్ట ప్రాంతాల వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాయి. అలాగే ఆహార పంటల విషయంలో స్వయంసమృద్ధికి ప్రాధాన్యత ఇచ్చాయి.

మన ఆదాయపు పన్నుల రేట్ల ప్రస్థానం

* 1949-50లో జాన్‌ముత్తాయ్ ఆదాయపు పన్ను రేట్లను రూ.10వేల వరకు ఉన్న ఆదాయంపై రెండు శ్లాబ్‌లలో తగ్గించారు. మొదటి శ్లాబ్‌లో ఒక అణా నుంచి 9 పైసలకు, రెండవ శ్లాబ్‌కు రెండు అణాల నుంచి ఒక అణా 9 పైసలకు తగ్గించారు
* 1971-72లో ఆదాయపుపన్ను 93.05 శాతానికి పెంచారు. అది మరింతగా పెరిగి 1975 నాటికి 97.75 శాతానికి చేరుకుంది. భారతదేశ చరిత్రలో ఇదే అత్యంత అధిక ఆదాయపు పన్ను.
* 1974-75లో వై.బి.చవాన్ ఆదాయపు పన్నును 97.75 శాతం నుండి 75శాతానికి తగ్గించారు. రూ.70వేల ఆదాయం కలిగినవారు 70 శాతం పన్ను 10 శాతం సర్‌చార్జ్, వెరసి 77 శాతం కట్టాల్సి వచ్చేది.
* 1985-86లో వి.పి.సింగ్ ఆదాయపు పన్నును 8 శ్లాబుల నుంచి 4 శ్లాబులకు కుదించారు. పన్ను రేటును 50 శాతానికి తగ్గించారు.
* 1992-93లో మన్మోహన్‌సింగ్ ఆదాయపు పన్నును 40 శాతానికి తగ్గించారు.
* 1997-98 చిదంబరం ఆదాయపు పన్ను శ్లాబులను 10, 20, 30 శాతానికి మార్చారు. అంటే అత్యధిక పన్ను రేటు 30శాతం మాత్రమే. ఆ తదుపరి ప్రణబ్‌ముఖర్జీ కూడా కొన్ని సవరణలతో అవే శ్లాబ్‌లు కొనసాగించారు.
* 2014-15లో అరుణ్‌జైట్లీ సంపద పన్ను రద్దు చేశారు. అలాగే ఆదాయపు పన్ను శ్లాబ్‌లో తక్కువ రేటైన 10 శాతాన్ని 5 శాతానికి తగ్గించారు.
* 2022-21లో నిర్మలాసీతారామన్ పన్ను రేటు తగ్గించనప్పటికి మదింపు విధానంలో సమూలమైన మార్పులు చేశారు

1970లో ఆపరేషన్ ఫ్లడ్ – శ్వేత విప్లవం పేరుతో పాల ఉత్పత్తికి కూడా అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. 1950 నుంచి 1970వరకు దేశంలో పాల కొరత ఉండడంవల్ల మనం పాలను, పాల పొడిని విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అప్పటి నుంచి జనాభా పెరిగినా సరే పాల ఉత్పత్తిని అంత కంటే వేగంగా పెంచగలిగాము. పాల ఉత్పత్తిలో 1970 అనంతరం మన వార్షిక వృద్ధిరేటు 6.4 శాతం వరకు పెరిగింది. అదే సమయంలో ప్రపంచ పాల ఉత్పత్తి సగటున 2.2 శాతం మాత్రమే ఉండేది. ఫలితంగా ప్రస్తుతం మన దేశంలో తలసరి పాల లభ్యత సగటున రోజుకు 400 గ్రాములు కాగా ప్రపంచ సగటు 300 గ్రాములు మాత్రమే. దేశంలో హరిత విప్లవానికి శ్రీకారం చుట్టడంతోపాటు 1966లోనే రైతుల కోసం ఎంఎస్పీ విధానాన్ని ప్రవేశ పెట్టారు. రైతులకు వారి పంటలపై కనీస మద్దతు ధర లభించే విధంగా చర్యలు చేపట్టారు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో దాదాపు 6 వేల రకాల అధిక ఉత్పాదక వంగడాలను అభివృద్ధి చేశారు. 1970–75 మధ్యకాలంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి, పాలు తదితర నిత్యావసర వస్తువుల ఉత్పత్తి పెంచటానికి ప్రాధాన్యత ఇచ్చారు. అదేసమయంలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు పెట్టుబడులు సమకూర్చే దిశగా వ్యవస్థీకృత పరపతి అందుబాటులో ఉంచటానికి ప్రయత్నాలు చేశారు. సంక్షేమ రంగానికి కూడా తగు ప్రాధాన్యతను ఇచ్చారు. ప్రజలకు త్రాగునీటి సదుపాయం కల్పించారు. బీమా సౌకర్యాలను మెరుగుపరచటానికి జనరల్ ఇన్సూరెన్స్‌ను జాతీయం చేశారు. బొగ్గు, రాగి గనులను జాతీయం చేశారు. పౌరులకు పింఛను పథకాన్ని ప్రవేశపెట్టారు. 1975–80 మధ్య కాలంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లు సైతం వ్యవసాయ రంగానికే ప్రాధాన్యతను ఇచ్చాయి. అందులో భాగంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించటం, ఎరువుల వినిమయాన్ని నియంత్రిస్తూనే రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడటం, భూగర్భ జలాల సమర్థ వినియోగాన్ని ప్రోత్సహించటం, రైతు సేవా సంఘాలను ప్రారంభించటం వంటి విధానాలను అమలుజరిపారు. ఆహార సబ్సిడీకి కేటాయింపులు కూడా గణనీయంగా పెంచారు. కేటాయింపును రూ.295 కోట్లకు చేర్చారు. ప్రజారోగ్యానికి తగిన ప్రాధాన్యతను ఇచ్చారు. విదేశీమారక ద్రవ్యాన్ని నియంత్రించడానికి 1973లో విదేశీమారక ద్రవ్య నియంత్రణ యాక్టు – ఫెరాను అమలు చేశారు. అదే సమయంలో ఉద్యోగభద్రత, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని నష్టాలలో నడిచే అనేక కంపెనీలను ముఖ్యంగా వస్త్ర తయారీ మిల్లులను ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ సంస్థలను మూతపడకుండా కాపాడింది.

1969లో 14 ప్రధాన బ్యాంకుల జాతీయ కరణలో మొదలైన ప్రభుత్వ జాతీయకరణ విధానం 1980వరకు కొనసాగుతూనే ఉన్నది. 1979లో పారిశ్రామిక విధానాన్ని సమీక్షించి చిన్న మరియు సూక్ష్మ సంస్థల వృద్ధికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో చిన్న, కుటీర పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత కల్పించటం జరిగింది. అప్పటికే అమలులో ఉన్న ఎంఏటీపీసీ చట్టాన్ని ఉపయోగించి పెద్ద వ్యాపార సంస్థలు చిన్నతరహా, కుటీర, సూక్ష్మ పరిశ్రమల ప్రయోజనాలు దెబ్బతీయకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టారు. 1980–85 మధ్య కాలంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లలో ఎస్సి, ఎస్టి వర్గాలు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చారు. అదే కాలంలో పేదరిక నిర్మూలనకు 20 అంశాల కార్యక్రమాన్ని అమలు చేశారు. లైసెన్సు విధానాలలో సంస్కరణలు ప్రవేశపెట్టారు. దిగుమతులను తగ్గించటానికి ప్రయత్నాలు చేశారు. మన భాగ్యనగరంలో వరి పరిశోధన డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. అలా అనేక చర్యల ద్వారా ఆర్థిక వృద్ధికి కృషిచేశారు. 1985–90 కాలంలో సంస్కరణలకు మరింత ప్రాధాన్యతను ఇచ్చారు. లైసెన్సు విధానాన్ని రద్దు చేశారు. మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ –ఎంటీఎన్ఎల్ వంటి సంస్థలను స్థాపించారు. సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. గతంలో అమలు జరిపిన సోషలిస్టు విధానాల వల్ల మన ఆర్థిక వ్యవస్థ అనుకున్నంత వేగంగా వృద్ధి చెందలేదు. దిగుమతులు పెరిగాయి. ఎగుమతులు తగ్గాయి. ప్రభుత్వం స్వల్పకాలిక ఋణాలపై ఆధార పడవలసి వచ్చింది. ఆదాయాన్ని పెంచుకోవటానికి మినిమమ్ ఆల్టర్‌నేట్ ట్యాక్స్–కనీస ప్రత్యామ్నాయ పన్ను విధానాన్ని అమలు జరిపారు. అయినా ద్రవ్యలోటు గణనీయంగా పెరిగింది.

1990 నాటికి మన ఆర్థిక పరిస్థితి సంక్షోభం అంచులకు చేరింది. అందువల్ల 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలు చేయవలసి వచ్చింది. మన స్వాతంత్ర్యానంతరం ఆర్థిక ప్రస్థానంలో 1991కి ముందు, ఆ తరువాత అనే విధంగా విశ్లేషించవలసి వచ్చింది. ఆర్థిక సంస్కరణలు.. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు ప్రధాన అంశాల ద్వారా అమలులోకి వచ్చాయి. పన్నుల చట్టాలలో మార్పులు చేసి పన్ను రేట్లు తగ్గించారు. దిగుమతి సుంకాలు తగ్గించారు. 1994లో సేవల పన్నును ప్రవేశపెట్టారు. నల్లధనాన్ని వెలికి తీయటానికి స్వచ్ఛంద ఆదాయ బహిర్గతం పథకాన్ని అమలుచేశారు. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించారు. ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించారు. ప్రపంచంలో అప్పుడే ఊపందుకుంటున్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ – ఐసీటీ విప్లవంలో భారత్ ప్రముఖ పాత్ర పోషించేలా విధానపరమైన మార్పులను తీసుకొని వచ్చారు. పరిశ్రమలకు అనుకూలమైన పద్ధతులను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వరంగ సంస్థలను క్రమంగా ప్రైవేటీక

	1950-51	2023-24
భారత్ జీడీపీ.. ప్రస్తుత ధరలలో (స్థూలజాతీయ ఉత్పత్తి)	రూ.1018.1 కోట్లు	రూ.330.68 లక్షల కోట్లు
జనాభా (కోట్లలో)	36.11	145
తలసరి ఆదాయం	రూ.265	రూ.1,84,205
కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పన్నుల ఆదాయం	రూ.237 కోట్లు	రూ.19.58 లక్షల కోట్లు
కేంద్ర ప్రభుత్వ పరోక్ష పన్నుల ఆదాయం	రూ.396 కోట్లు	రూ.15.37 లక్షల కోట్లు
స్థూల జాతీయ ఉత్పత్తిలో పన్నుల శాతం	3.59	12
రెవెన్యూలోటు (కోట్లలో)	రూ.0.24	రూ.7,65,216
ద్రవ్యలోటు (కోట్లలో)	రూ.134	రూ.16,54,643
ప్రభుత్వ అప్పులు (కోట్లలో)	రూ.2865.40	రూ.200.16 లక్షలు

రించటం మొదలుపెట్టారు.

అంతర్జాతీయ వాణిజ్యంలో అడ్డంకులను గుర్తించారు. వాటిని సవరించటం మొదలుపెట్టారు. ఫలితంగా మన అభివృద్ధి వేగాన్ని పుంజుకుంది. నేడు ప్రపంచంలో నాల్గవ ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. అయితే ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టిన అనంతరం 2014 నాటికి, మౌలికమైన కొన్ని అంశాలతో మన ఆర్థిక వ్యవస్థ మళ్లీ సమస్యాత్మకంగా మారింది. ముఖ్యంగా 2009–2014 మధ్య కాలంలో ద్రవ్యలోటు, రెవెన్యూలోటు భారీగా పెరిగాయి. దీనికితోడు ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. ఒక దశలో 12.3 శాతానికి చేరింది. అలాగే జాతీయ బ్యాంకులలో నిరర్థక ఆస్తులు అంటే మొండి బకాయిలు భారీగా పెరిగాయి. ఆర్థిక సంస్కరణల అనంతరం ప్రభుత్వరంగ బ్యాంకులలో నిరర్థక ఆస్తులు 1999 నాటికి 16 శాతానికి చేరాయి. ప్రభుత్వం బ్యాంకులకు మూలధనాన్ని సమకూర్చటం, బ్యాంకింగ్ రంగంలో మార్పులు చేయటం, ఇతర ప్రయత్నాలవల్ల 2004 నాటికి 7.8 శాతానికి తగ్గాయి. కాని మళ్లీ ఈ మొండి బకాయిలు భారీగా పెరిగి సెప్టెంబర్ 2013 నాటికి 12.3 శాతానికి చేరాయి. దానికి తోడు కొన్ని మొండి బకాయిలను దాచిపెట్టటం కూడా జరిగింది. రెవెన్యూ లోటు పెరిగింది. ఒక దశలో అది మన స్థూల జాతీయ ఉత్పత్తిలో 5.3 శాతానికి చేరింది. 2009–13 మధ్య కాలంలో రెవెన్యూ లోటు మదింపులో కూడా ఆక్షేపణకరమైన పద్ధతులు అవలంభించారు. ఉదాహరణకు సబ్సిడీలకు బదులుగా ప్రభుత్వరంగ చమురు సంస్థలు, భారత ఆహార సంస్థలు వంటి

మన ఉత్పాదకత నాడు - నేడు

	1950–51	2024–25
ఆహార ధాన్యాలు (మెట్రిక్ టన్నుల్లో)	51	353.96
కూరగాయలు, పళ్లు (మెట్రిక్ టన్నుల్లో)	25	334.19
పాలు (మెట్రిక్ టన్నుల్లో)	17	239.30
కోడిగుడ్లు (వందకోట్లలో)	1.8	142.77
చేపలు (మెట్రిక్ టన్నుల్లో)	0.3	19.5
చెరకు (పంచదార) (మెట్రిక్ టన్నుల్లో)	57.05	439.9
పప్పులు (మెట్రిక్ టన్నుల్లో)	8.41	24.5
నూనెగింజలు (మెట్రిక్ టన్నుల్లో)	5.16	44.7

వాటికి ఇచ్చిన రూ. 1.9 లక్షల కోట్లను రెవెన్యూ లోటు మదింపులో పరిగణనలోకి తీసుకోలేదు.

ఒకవైపు ప్రభుత్వం భారీగా అప్పులు చేసినప్పటికి ప్రభుత్వ పెట్టుబడి వ్యయం బాగా తగ్గి ఆ మొత్తం ప్రభుత్వ వ్యయంలో 16 శాతానికి చేరింది. 2014 తర్వాత కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవటం, చట్టాలను సవరించటం, విధానపరమైన మార్పులు చేయటం వంటి అనేక సంస్కరణలతో ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరు మెరుగుపడింది. మొండి బకాయిలు తగ్గాయి, ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు తగ్గుముఖం పట్టింది. పెట్టుబడి వ్యయం పెరిగింది, పేదరికం తగ్గింది. అంతేకాకుండా మన మౌలిక సదుపాయాల రంగం ముఖ్యంగా జాతీయ రహదారులు, ఓడరేవులు మెరుగు పడ్డాయి. విద్యుత్ ఉత్పత్తి పెరిగింది. దేశంలో అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. సగటు జీవితకాలం కూడా స్వాతంత్ర్యానంతరం బాగా పెరిగి ఇప్పుడు 70 ఏళ్లకు మించింది. భారత్ దశాబ్దాల తరబడి చేసిన సుదీర్ఘ ప్రస్థానంలో ప్రకృతి విపత్తులు, దాడులు, యుద్ధాలు, అంతర్జాతీయ సంక్షోభం ఎదుర్కొంది. ప్రపంచంలో నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది.

– సాయి, ఆర్థిక నిపుణులు

సాఫ్ట్ పవర్ నుంచి హార్డ్ పవర్ వైపునకు...

భారత విదేశాంగ విధాన ప్రస్థానం

భారత విదేశాంగ విధానం భారత జాతీయ కాంగ్రెస్ ఉద్యమంతోనే రూపురేఖలను సంతరించుకుంటూ వచ్చింది. కాంగ్రెస్ 1925లో మొట్టమొదటిసారి విదేశాంగశాఖను ఏర్పాటు చేసింది. స్వాతంత్ర్యోద్యమం గురించి, భారతీయుల సహజ హక్కు గురించి విదేశాలకు వెల్లడించడం దీని ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయ వ్యవహారాలపై ఆసక్తి కలిగిన జవాహర్‌లాల్ నెహ్రూ మన విదేశాంగ విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. లీగ్ ఆఫ్ నేషన్స్, యునైటెడ్ నేషన్స్‌కు మనదేశం వ్యవస్థాపక సభ్యురాలు కూడా! స్వాతంత్ర్యానంతరం కామన్‌వెల్త్ దేశాల్లో సభ్యురాలిగా చేరిన భారత్, ఇండొనేషియన్ నేషనల్ రివల్యూషన్ వంటి ఉద్యమాలకు మద్దతు ప్రకటించింది. 1950 దశకంలో నైతికంగా మనదేశ ప్రతిష్ట అత్యున్నతస్థాయిలో ఉండటంతో, తూర్పు, పశ్చిమ దేశాల నుంచి మంచి సహకారం అందింది. ముఖ్యంగా అలీనవిధానాన్ని అనుసరిస్తూ, ప్రపంచంలోని ఇతరదేశాల మధ్య నెలకొన్న వివాదాల్లో, అప్పటి మన దౌత్యవేత్తలు జాగ్రత్తగా మన విదేశాంగ విధానాన్ని నడిపినప్పటికీ, ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాలను నిలువరించ లేకపోయారు. ముఖ్యంగా దక్షిణాసియా కూడా ఈ ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల్లో భాగం కావడం ఇందుకు ప్రధాన కారణం. నెహ్రూ కశ్మీర్ సమస్యను ఐక్యరాజ్య సమితికి నివేదించడం ద్వారా చేసిన తప్పిదానికి ఇప్పటికీ భారత్ మూల్యం చెల్లిస్తూనే ఉంది.

అలీనోద్యమం, ప్రచ్ఛన్నయుద్ధం మన విదేశ వ్యవహారాలను బాగా ప్రభావితం చేశాయి. మన విదేశాంగ మంత్రులంతా నెహ్రూ, స్వరణ్‌సింగ్, వైబీ చవాన్, ఏబీ వాజపేయి, పీవీ నరసింహారావు, ఐకే గుజ్రాల్, నట్వర్‌సింగ్, ప్రణబ్ ముఖర్జీ, జస్వంత్‌సింగ్, సుష్మ స్వరాజ్ వంటి వారంతా కొద్ది మార్పులతో సంప్రదాయకమైన పద్ధతిలోనే వెళ్లారు. ప్రస్తుతం ఎస్ జైశంకర్ ఆ శాఖను సమర్థంగా నిర్వహిస్తున్నారు. దేశంలో శశి థరూర్ వంటి నిపుణులు ఉన్నారు.

1960–70 మధ్యకాలంలో పాకిస్తాన్, చైనాలతో యుద్ధాలు, దక్షిణాసియా దేశాలతో నెలకొన్న వివాదాలు మన విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఈ సమయంలో పాకిస్తాన్‌కు మద్దతుగా అమెరికా, చైనాలు నిలవడంతో, ఇందుకు ప్రతిక్రియగా నాటి యు.ఎస్.ఎస్.ఆర్‌తో "ఇండో సోవియట్ ట్రీటీ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ అండ్ కోఆపరేషన్" పేరుతో 1971 ఆగస్టు నెలలో ఒక ఒప్పందంపై మనదేశం సంతకాలు చేసింది. తర్వాత యుఎస్ఎస్ఆర్ అందించిన ఆర్థిక, సైనిక సహకారంతో మనదేశం క్రమంగా పటిష్టమైన స్థితికి చేరుకున్న నేపథ్యంలో, అఫ్ఘానిస్తాన్‌లో రష్యా సైనికుల ప్రవేశాన్ని మనదేశం ఖండించలేని స్థితిలో మౌనం వహించడం పశ్చిమదేశాలకు ఆగ్రహం కలిగించింది. 1980 చివరి ప్రాంతంలో మనదేశం అమెరికా సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో మన సంబంధాలు క్రమంగా మెరుగుపడటం మొదలైంది. ఇదే సమయంలో యు.ఎస్.ఎస్.ఆర్, చైనాలతో కూడా మన స్నేహం కొనసాగింది. ఇక దక్షిణాసియా

దేశాలైన పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్ దేశాలతో వ్యవహరించడంలోనే మన విదేశాంగశాఖ అత్యధిక దృష్టిని కేంద్రీకరించాల్సి వచ్చింది.

ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత

1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రచ్ఛన్నయుద్ధం ముగిసి, ఏకధ్రువ ప్రపంచం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మన విధానంలో మార్పులు తప్పలేదు. ముఖ్యంగా అమెరికాతో ఆర్థిక, దౌత్య సంబంధాల బలోపేతానికి కృషి జరిగింది. అంతమాత్రాన ఇది అమెరికా వైపు మొగ్గు కాదు. ఇదే సమయంలో యూరోపియన్ యూనియన్ వాణిజ్య విభాగం, జపాన్, ఇజ్రాయెల్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలతో స్నేహసంబంధాలను ప్రారంభించింది. ఆగ్నేయాసియా దేశాల సంఘం, ఆఫ్రికన్ యూనియన్, అరబ్ లీగ్, ఇరాన్ దేశాలతో కూడా తన స్నేహాన్ని క్రమంగా విస్తరించింది. విచిత్రంగా రష్యాతో

నెహ్రూ

వైబీ చవాన్

పీవీ

మొదట్నుంచీ మనకు సైనికపరంగా ఎంతో సన్నిహిత సంబంధాలున్నప్పటికీ, ఇజ్రాయెల్ మనకు రెండో అతిపెద్ద సైనిక భాగస్వామిగా మారడం విశేషం. ఇక అమెరికాతో మన వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే కాకుండా, నరేంద్ర మోదీ హయాంలో ఆసియన్ ప్రాంతాలపై వాణిజ్యపరంగా దృష్టిని కేంద్రీకరించడం కీలకం.

తొలి ప్రధానిగా, విదేశాంగశాఖను కూడా నెహ్రూయే నిర్వహించారు. పంచశీల సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. నెహ్రూ తర్వాతికాలంలో వచ్చిన ప్రధానులు కూడా, విదేశాంగ శాఖ మంత్రి ఉన్నప్పటికీ అంతర్జాతీయ వ్యవహారాల్లో వారే కీలక నిర్ణయాలు తీసుకునేవారు. భారత రెండో ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధాని సెక్రటేరియట్‌ను మరింత విస్తరించారు. క్రమంగా 1970 నాటికి ప్రధాని కార్యాలయం 'సూపర్-మినిస్ట్రీ'గా వ్యవహరించడం మొదలైంది. విదేశాంగశాఖ అధికార్లతో పాటు, ప్రధాని కార్యాలయ అధికార్లు కూడా తాము సేకరించిన సమాచారం ఆధారంగా ప్రధానమంత్రికి సలహాలిచ్చేవారు. రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) కూడా విదేశాల్లో నిర్వహించే తమ కార్యకలాపాలపై నేరుగా ప్రధానికే నివేదించడం మొదలైంది. విదేశాంగ విధానంపై గట్టి నియంత్రణ, సలహాదారులపై పూర్తిగా ఆధార పడటం ఇందిరాగాంధీ హయాంలో (1966-77, 1980-84) చాలా అధికంగా ఉండేది. తర్వాత అధికారంలో కి వచ్చిన ఆమె తనయుడు రాజీవ్ గాంధీ (1984-89) కాలంలో కూడా ఇదే పద్ధతి కొనసాగింది. తర్వాత వచ్చిన సంకీర్ణ ప్రభుత్వాల హయాంలో ప్రధాని నియంత్రణ కొంత బలహీన పడిందనే చెప్పాలి. అయితే విదేశీ వ్యవహారాలపై నిర్ణయాలను ప్రధాని లేదా ప్రధాని కార్యాలయం లేదా మంత్రిమండలి, ఎవరు తీసుకునేవారనేది చెప్పడం కష్టం. 2005లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ అప్పటికి రాబోయే పదేళ్ల కాలంలో చోటుచేసుకునే 'గ్లోబల్ స్ట్రాటిజిక్ డెవలప్‌మెంట్స్'ను అంచనా వేసేందుకు ఒక టాస్క్ ఫోర్స్‌ను నియమించడం ఇందుకు ఉదాహరణ. దీనికి కె. సుబ్రహ్మణ్యం నేతృత్వం వహించారు. దీని నివేదికను ఇప్పటివరకు బయటపెట్టకపోవడం గమనార్హం. ఇక నరేంద్ర మోదీ 2014లో ప్రధాని అయ్యాక మనదేశం దాదాపుగా అలీనవిధానానికి దూరం జరిగిందనే చెప్పాలి.

గణతంత్ర భారత్‌కు ఇప్పటివరకు ప్రపంచంలోని 201 దేశాలతో సంబంధాలు కొనసాగుతున్నాయి. వీటిల్లో పాలస్తీనా, హోలీ సీ (దీన్నే సీ ఆఫ్ రోమ్, పెట్రైన్ సీ, అపోస్టోలిక్ సీ అని కూడా అంటారు. ఇది కేథలిక్ చర్చి, వాటికన్ సిటీ కేంద్ర పాలనా సంస్థ), నియు (దక్షిణ పసిఫిక్ సముద్రంలో ఉన్న స్వయం పాలిత ద్వీప దేశం, న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా సంబంధాలను కలిగి ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కోరల్ ద్వీపం)లతో కూడా మనదేశం సంబంధాలను నెరపుతోంది. ప్రపంచంలో అత్యధిక సైనికవ్యయం చేసే దేశాల్లో మూడోస్థానం, సైనిక దళాల పరంగా రెండోస్థానం, జీడీపీ పరంగా నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, కొనుగోలు శక్తిపరంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతు న్న భారత్, ప్రాంతీయంగా బలీయ శక్తిమాత్రమే కాదు, సంభావ్య సూపర్ పవర్ కూడా! ఇంతటి బలీయమైన భారత్ తన విదేశాంగ విధానాన్ని అత్యంత వ్యూహాత్మకంగా, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ కొనసాగించడం సహజమే. పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యతనివ్వడం, సార్క్, యాక్ట్ ఈస్ట్ విధానం (దీన్ని పి.వి. నరసింహారావు లుక్ ఈస్ట్ పాలసీ పేరుతో తొలిసారి అమలు చేశారు) ద్వారా ఆగ్నేయాసియా, ఆసియన్ దేశాలతో సంబంధాలను కొనసాగించడానికి మన విదేశాంగ విధానం వ్యూహాత్మక రీతిలో కొనసాగుతోంది.

అయితే మన విధానంలో కొంత అస్పష్టత లేకపోలేదు. మొదటిసారి అణ్వస్త్ర ప్రయోగం చేయకపోవడం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో అనుసరిస్తున్న తటస్థ వైఖరి విషయాల్లో ఈ అస్పష్టత కనిపిస్తుంది. ప్రస్తుతం భారత్ ఐక్యరాజ్య సమితి, బ్రిక్స్, క్వాడ్, జి20, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి సంస్థల్లో సభ్యురాలు. అలీనోద్యమానికి వ్యవస్థాపక సభ్యురాలిగా మనదేశం ఇప్పటికీ అలీనదేశాల గ్రూపుపై నిశ్శబ్దంగా తన పలుకుబడిని కొనసాగిస్తోంది. తూర్పు ఆసియా సదస్సు, ప్రపంచ వాణిజ్య సంస్థ, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, జి8+5, ఐబీఎస్ఏ డైలాగ్ ఫోరం వంటి అంతర్జాతీయ సంస్థలపై కూడా భారత్ పలుకుబడి కొనసాగుతోంది. ఆసియా మౌలిక సదుపాయాల బ్యాంక్, షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్‌లలో భారత్ సభ్యురాలు. కామన్‌వెల్త్ దేశాల సభ్యురాలిగా ఆయా దేశాలతో తన సంబంధాలను కొనసాగిస్తోంది.

మోదీ సిద్ధాంతం

నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనునరించిన విదేశాంగ విధానాన్ని 'మోదీ సిద్ధాంతం'గా వ్యవహరిస్తున్నారు. ఆయన మే 26, 2014న ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. మొత్తంమీద మోదీ విదేశాంగ విధానం ఐదు మూల స్తంభాలపై ఆధారపడి కొనసాగుతోంది. అవి- సంవత్, సంస్కృతి ఏవం సభ్యత్, సురక్ష, సమ్మాన్, సమృద్ధి. పొరుగు దేశాలకే తొలి ప్రాధాన్యత అనేది మోదీ విధానంలో కీలకం. ఆగ్నేయాసియా, మధ్యప్రాచ్యం, అగ్రరాజ్యాలతో ఆయన వ్యూహాత్మక సంబంధాలను కొనసాగించారు. అంతేకాదు 'పారాడిప్లొమెసీ' భావనను ఆయన ప్రవేశపెట్టారు. దీని ప్రకారం దేశంలోని రాష్ట్రాలు, నగరాలు ఇతర దేశాలతో లేదా నగరాలతో సంబంధాలను కొనసాగించవచ్చు. వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగిన కొన్ని దేశాలను మినహాయించి మిగిలిన దేశాలతో ద్వైపాక్షిక వాణిజ్యానికి ఆయన ప్రాధాన్యతనిచ్చారు. అధికారంలోకి రాగానే యు.ఎన్.లోని ఐదు శాశ్వత సభ్య దేశాలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించేందుకు మోదీ కృషి చేశారు. దేశ పగ్గాలు చేపట్టిన తొలి వందరోజుల్లోనే యు.ఎన్.లో శాశ్వత సభ్యత్వం కోసం మోదీ ప్రభుత్వం బిడ్డింగ్ దాఖలు చేసింది. ఇదే సమయంలో హిందూ మహాసముద్రంలో చైనా విస్తరణను అడ్డుకునేందుకు పదునైన వ్యూహాలను



రచించి అమలు చేస్తున్నారు. సముద్రమార్గ సిల్క్‌రోడ్ ప్రాజెక్టును అడ్డుకోవడానికి "ప్రాజెక్ట్ మౌసమ్"ను రూపొందించగా ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రారంభ దశలోనే ఉంది. ఫిజీలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోదీ 2015లో ఆ దేశంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన 14 పసిఫిక్ దేశాల అధినేతలతో సమావేశం కావడం విశేషం. ఈ సందర్భంగా ఫోరం ఫర్ పసిఫిక్ ఐలాండ్స్ కొఆపరేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ దేశాలతో డిజిటల్ కనెక్టివిటీ పెంచడానికి 'పాన్ పసిఫిక్ ఐలాండ్స్ ఈ-నెట్‌వర్క్'ను ఏర్పాటు చేశారు. అంతేకాదు ఈ 14 దేశాలకు ఆన్ ఎరైవల్ వీసా సదుపాయాన్ని కల్పించడం విశేషం. ఆసియన్, తూర్పు ఆసియా దేశాలతో 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'ని అమలుచేస్తున్నారు. దక్షిణ చైనా సముద్రం మనదేశ ఎకనామిక్ జోన్ పరిధిలో లేనప్పటికీ, భౌగోళికంగా ఈ ప్రాంతం మన దేశానికి చాలా కీలకం. ఎందుకంటే అధికమొత్తంలో వాణిజ్య నౌకలు ఈ ప్రాంతం గుండా వెళుతుంటాయి. ఇదే విధానం కింద ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తటస్థ శక్తిగా భారత్‌ను నిలిపేందుకు యత్నిస్తున్నారు. మధ్య ప్రాచ్యాన్ని మన దేశ విదేశాంగ శాఖ పశ్చిమాసియాగా వ్యవహరిస్తుంది. ఈ ప్రాంతం గుండా జరిగే వాణిజ్యం మన దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. అదీకాకుండా గల్ఫ్ దేశాల్లో మనదేశానికి చెందిన ఎంతోమంది కార్మికులు పనిచేస్తున్న నేపథ్యంలో ఈ దేశాలతో సంబంధాలకు అత్యంత ప్రాధాన్యత ఉన్నది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా దేశాలతో స్నేహ సంబంధాలను పెంపొందించేందుకు మోదీ ప్రభుత్వం "లింక్ వెస్ట్" పాలసీని అమలు చేస్తోంది.

అమెరికాతో సంబంధాల విషయానికి వస్తే మన్మోహన్ సింగ్ హయాంలో పెరిగిన సాన్నిహిత్యాన్ని మోదీ ప్రభుత్వం కొనసాగిస్తోంది. డోనాల్డ్ ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు మోదీతో మంచి స్నేహసంబంధాలను కొనసాగించారు. గత ఫిబ్రవరిలో నరేంద్ర మోదీ అమెరికా సందర్శించి ట్రంప్‌తో జరిపిన చర్చల్లో ఇరుదేశాల వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు వృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాకు 66 బిలియన్ డాలర్ల విలువైన వస్తువుల ఎగుమతులు జరుగుతున్నాయి. అయితే అమెరికా దిగుమతులపై భారత్ విధించే టారిఫ్‌లు సగటున 12% ఉండగా, అమెరికా విధించే సుంకాలు సగటున 2.2శాతం ఉండటంతో ట్రంప్ టారిఫ్‌లు పెంచుతామంటూ హెచ్చరికలు మొదలు పెట్టారు. ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్యలోటును తగ్గించాలన్న పట్టుదలతో, భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఆగస్టు 1వ తేదీనుంచి 25% టారిఫ్ విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు రష్యాతో సైనిక పరికరాలు, ఇంధనం కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా పెనాల్టీ విధిస్తామని కూడా హెచ్చరించారు. వీటిపై భారత్ పైకి స్పందించనప్పటికీ, అమెరికానుంచి ఎఫ్-35 యుద్ధ విమానాల కొనుగోలును నిలిపివేస్తూ నిర్ణయించింది. దీంతో అమెరికాకు ఒక్కసారిగా రూ.లక్షకోట్ల నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో ట్రంప్ విధానాలపై దేశీయంగా తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ విధంగా అమెరికా ఆయువుపట్టును కొట్టడంలో భారత్ విజయం సాధించింది. ఇది మరే ఇతర దేశానికి సాధ్యంకానిది! ఇక రష్యా. ఇరుదేశాల మధ్య సన్నిహిత సంబంధాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఈ స్నేహ బంధాన్ని తెంచడానికి అమెరికా, యూరప్ దేశాలు చేసిన యత్నాలు ఫలించలేదు. నిజానికి మరింత బలపడ్డాయి. అమెరికా ఎఫ్-35 యుద్ధ విమానాల డీల్ నిలిచిపోవడంతో, రష్యా మనకు సుఖోయ్-57 యుద్ధ విమానాలను ఇవ్వడానికి ముందు కొచ్చింది. టెక్నాలజీ బదలా యింపు, సోర్స్‌కోడ్ ఇవ్వడంతో పాటు, మనదేశంలోనే తయారుచేసేందుకు రష్యా ఆఫర్ ఇచ్చింది. ఇప్పటికే ఎస్-400 (సుదర్శనచక్ర) రక్షణ వ్యవస్థను మనకు ఇవ్వడమే కాకుండా, ఎస్-500 కూడా ఇవ్వడానికి ముందు కొచ్చింది. ఇది అన్నికాలాల్లో నిలిచే స్నేహం!

వాజపేయి

సుష్మాస్వరాజ్

ఎస్. జైశంకర్

పాకిస్తాన్‌తో...

ప్రధానిగా నరేంద్రమోదీ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాక్‌పై మనం అప్పటివరకు అనుసరించిన విధానంలో సమూల మార్పులు వచ్చాయి. పాక్ ఉగ్రవాదంపై కఠిన వైఖరి అవలంబించడం మొదలైంది. 2016లో యూరీ ఉగ్రసంఘటన తర్వాత తీవ్రవాదాన్ని సహించేది లేదన్న విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. పాక్ ఆక్రమిత భూభాగంలోని ఉగ్రస్థావరాలపై సర్జికల్ దాడులు నిర్వహించి, ఉగ్రవాదంపై కఠిన వైఖరి అనుసరిస్తామని స్పష్టం చేసింది. ఇమ్రాన్‌ఖాన్ పాక్ ప్రధానిగా రెండోసారి ఎన్నికైన తర్వాత ఇరు దేశాల సంబంధాలు ఎన్నడూలేని స్థాయికి దిగజారి పోయాయి. ఇదే సమయంలో మోదీ ప్రభుత్వం అనుసరించిన పటిష్టమైన దౌత్యవిధానాల వల్ల పాశ్చాత్య దేశాలు కశ్మీర్ విషయంలో పట్టించుకోవడం మానేసాయి. టర్కీ, చైనా, మలేసియా తప్ప మరే ఇతర దేశం పాక్‌కు మద్దతుగా నిలవడం లేదు. 2019లో పుల్వామా దాడి తర్వాత భారత్ నిర్వహించిన బాలాకోట్ దాడులు ఉగ్రవాదులపై మనదేశం అనుసరించే కఠిన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

వాస్తవానికి పాక్ పట్ల మనదేశం "కుక్కకాటుకు చెప్పుదెబ్బ" అనే రీతిలో వ్యవహరిస్తోంది. ఉగ్రవాదులకు ఆర్థిక సహాయాన్ని శిక్షణా సదుపాయాలను కల్పిస్తున్న పాకిస్తాన్‌ను ఫైనాన్సియల్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) బ్లాక్ లిస్టులో పెట్టాలని మనదేశం గట్టిగా కోరింది. నరేంద్రమోదీ ప్రభుత్వ హయాంలో సంభవించిన ఒక సానుకూల పరిణామం కర్తార్‌పూర్ కారిడార్‌లోకి ఎటువంటి వీసాలు లేకుండా సిక్కులు ప్రయాణించడానికి వీలుకల్పించే ఒప్పందం కుదరడం. పాకిస్తాన్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో వున్న దేరా బాబా నానక్ గురుద్వారా దర్శనానికి మనదేశ సిక్కులకు ఎటువంటి వీసా లేకుండానే అనుమతిస్తున్నారు. తాజాగా ఏప్రిల్ 22న పెహల్గామ్‌లో 26 మంది అమాయక టూరిస్టులను పాక్ ఉగ్రవాదులు పొట్టన పెట్టుకోవడంతో, ఆగ్రహించిన భారత్ ఇందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మే నెలలో పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించింది. కేవలం 23 నిముషాల్లో పాక్ ఉగ్రవాద వ్యవస్థను మట్టి కరిపించిన మనదేశం, సాంకేతికంగా, ఆధునిక యుద్ధరీతుల్లో తన సత్తా ప్రపంచానికి చూపింది. ఎంచుకున్న అన్ని లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరచింది. ఈ దాడుల్లో పాకిస్తాన్ కేవలం ప్రయోగశాలగా మాత్రమే మిగిలింది. పాకిస్తాన్‌కు చైనా సరఫరా చేసిన హెచ్‌క్యు-9, ఎల్‌వై-80 రక్షణ వ్యవస్థలు పూర్తిగా విఫలం కావడమే కాదు, మనదేశ దాడుల్లో పూర్తిగా ధ్వంసమయ్యాయి. అంతేకాదు, అమెరికాకు చెందిన

ఎఫ్-16 యుద్ధ విమానాలు కూడా ధ్వంసమైనట్టు వార్తలు వచ్చాయి. ఈ దాడులతో చైనా, అమెరికాల ఆయుధ మార్కెట్లు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. చైనా రక్షణ పరికరాల డొల్లతనం ప్రపంచానికి వెల్లడైంది. టర్కీ అందజేసిన డైరెక్టర్ డ్రోన్లు కూడా విఫలం కావడంతో అవాక్కవడం ఆ దేశం వంతైంది. పాకిస్తాన్ రక్షణ వ్యవస్థలోని బలహీనతలను ఈ దాడులు బహిర్గతం చేశాయి. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వీటన్నింటికి తోడు సింధూ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం ద్వారా పాకిస్తాన్‌పై మరింత ఒత్తిడిని మనదేశం పెంచింది. ఈవిధంగా సైనికేతర అంశాలను కూడా పాక్‌పై ప్రయోగించడం మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న సరికొత్త విధానం. బాలాకోట్, ఆపరేషన్ సిందూర్‌లు పరిమిత లక్ష్యాలపైనే దృష్టి పెట్టినప్పటికీ, అణ్వస్త్ర ప్రయోగం చేస్తామని బెదిరిస్తున్న పాకిస్తాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. గతంలో మాదిరిగా ఇప్పుడు తానొక అణ్వస్త్రదేశంగా పాకిస్తాన్ చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. భారత్ దాడులు పాక్ అణ్వస్త్రాలను ప్రయోగించలేని స్థితికి తీసుకురావడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ దాడులతో పాకిస్తాన్ రాడికలైజేషన్ విధానాలనుంచి వెనక్కి మరలితేనే శాంతి సాధ్యమన్నది మరోమారు స్పష్టమైంది.

చైనాతో సంబంధాలు

1962 నాటి యుద్ధం నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు పరస్పర అనుమానాలతోనే కొనసాగుతున్నాయి. 1967లో జరిగిన నాథూలా, ఛో లా సంఘటనలు, ఆక్సాయ్‌చిన్, అరుణాచల్ ప్రదేశ్‌ల విషయంలో కొనసాగుతున్న వివాదాలు ఇరుదేశాల సంబంధాలకు అడ్డంకిగా మారాయి. 1996లో చైనా అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ తన దక్షిణాసియా పర్యటనలో భాగంగా భారత్‌ను కూడా సందర్శించారు. 1998లో భారత్ అణుపరీక్షలు నిర్వహించి నప్పుడు, అప్పటి రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్ మాట్లాడుతూ, ఈ పరీక్షలు చైనా నుంచి ఎదురయ్యే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహించామని ప్రకటించడంతో మళ్లీ సంబంధాలు దెబ్బతిన్నాయి. టిబెట్ చైనాలో అంతర్భాగమని భారత్ లాంఛనంగా 2003లో గుర్తించగా, సిక్కిం మనదేశంలో అంతర్భాగ మని చైనా గుర్తించింది. తర్వాతి కాలంలో చైనా మనకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి స్థాయికి ఎదిగింది. వాణిజ్య సంబంధాలు బలోపేతమైన నేపథ్యంలో సరిహద్దు సమస్య పరిష్కారానికి చైనా ఉత్సాహం చూపడం మొదలు పెట్టింది. 2008లో డబ్ల్యూటీఓ దోహా చర్చల సందర్భంగా అనేక అంశాల్లో పరస్పర సహకారానికి అంగీకరించడమే కాదు, అమెరికా తరహాలో పౌర అణు ఒప్పందం కుదుర్చు కోవడానికి కూడా రెండుదేశాలు ముందుకు వచ్చాయి. అయితే ఆఫ్రికాలో ఆర్థికపరంగా పెట్టుబడుల విషయంలో ఇరు దేశాల మధ్య విభేదాలు చోటు చేసుకోవడం, డోక్లామ్ ప్రతిష్టంభన, భూటాన్ సమస్య మళ్లీ ఉభయ దేశాల మధ్య నమస్యకు దారితీసినా ఇవి వేగంగా పరిష్కారానికి నోచుకున్నాయి. 2020లో గల్వాన్ సైనిక సంఘర్షణ తర్వాత ఇరుదేశాల సంబంధాలు మళ్లీ అట్టడుగుకు చేరుకున్నాయి. మనదేశంలో వివిధ రంగాల్లో చైనా కంపెనీల కాంట్రాక్ట్‌ను ప్రభుత్వం రద్దుచేసింది. తర్వాత ఊహాన్ నుంచి విస్తరించిన కరోనా వైరస్‌కూడా ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీసింది. అనంతరం వాస్తవాధీన రేఖ వద్ద పర్వత శిఖరాలను ఆక్రమించుకోవాలని చైనా ప్రయత్నాలకు ముందే, మన సైన్యాలు వాటిపైకి చేరుకోవడంతో, చైనా బిత్తరపోయింది. ఆ తర్వాత మనదేశంలో 250 చైనా యాప్‌లను ప్రభుత్వం నిషేధించింది. ఎ.సి.లు, రిఫ్రిజిరేటర్లు, కూలర్ల దిగుమతులను కూడా మనదేశం ఆపేసింది. భారత్-చైనాల మధ్య సయోధ్యకు రష్యా విశ్వ ప్రయత్నం చేస్తోంది. కానీ చైనా వైఖరి ఇందుకు సానుకూల వాతావరణాన్ని కల్పించడంలేదు.

యాక్ట్ ఈస్ట్ పాలసీ

ప్రచ్ఛన్న యుద్ధం తర్వాత భారత విదేశాంగ విధానంలో వచ్చిన కీలక మార్పు 'లుక్ ఈస్ట్' పాలసీ. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో భారత్‌కు ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాలు బలహీనంగా ఉండేవి. ఈ అసమతుల్యతను సరిదిద్దడంతో పాటు, ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్యం మనదేశానికి ఎంతో లాభదాయక మన్న విషయాన్ని గుర్తించిన పి.వి. ప్రభుత్వం 1990లో లుక్ ఈస్ట్ పాలసీని ప్రవేశపెట్టింది. బర్మా (మయన్మార్) వంటి దేశాల్లో ఇంధన వనరులున్న నేపథ్యంలో ఈ మార్కెట్‌ను ఉపయోగించుకోవాలన్న లక్ష్యంతో భారత్ ముందుకు సాగింది. భారత ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఒక కీలక నిర్ణయం తీసుకొని 'సరళీకృత ఆర్థిక విధానాన్ని' అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగానే పి.వి.నరసింహారావు చైనా, జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, సింగపూర్ దేశాల్లో పర్యటించారు. 1992 ఆసియన్ సమావేశాల్లో భారత్ చర్చల భాగస్వామిగా పాల్గొనడం విశేషం. తర్వాత 2002 నుంచి భారత్ ఆసియన్ దేశాలకు సదస్సు స్థాయి భాగస్వామిగా కొనసాగుతూ వస్తోంది. ఆవిధంగా 'బిమ్‌స్టిక్', 'గంగా-మెకాంగ్ కోఆపరేషన్' వంటి ప్రాంతీయ గ్రూపుల్లో భాగస్వామి కావడమే కాదు, 2005 డిసెంబర్‌లో జరిగిన తూర్పు ఆసియా సదస్సులో సభ్యురాలైంది. సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికా, కెనడా, ఫ్రాన్స్, జపాన్, జర్మనీ వంటి పశ్చిమ దేశాలతో సంబంధాలను పెంపొందించుకోవడం మొదలుపెట్టింది.

ఉగ్రవాదంపై పోరు

కశ్మీర్‌లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ప్రపంచం దృష్టికి తీసుకురావడంలో 1990 దశకం మధ్య కాలంలో భారత్ విజయం సాధించింది. కార్గిల్ యుద్ధం, భారత్ సాధించిన గొప్ప దౌత్య విజయానికి చిహ్నం. పాకిస్తాన్‌లో పనిచేస్తున్న వివిధ ఉగ్రవాద గ్రూపులను అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలుగా అమెరికా, ఈయూ దేశాలు గుర్తించాయి. 1998లో భారత్ రెండోసారి అణుపరీక్షలు నిర్వహించడంతో, అమెరికా, జపాన్, ఈయూ దేశాలు మనదేశంపై ఆంక్షలు విధించాయి. అయితే 2001 నాటికి ఈ ఆంక్షల్లో చాలావాటిని ఆయా దేశాలు తొలగించాయి. 2001 సెప్టెంబర్ ఉగ్రదాడుల తర్వాత భారత్, అల్-కాయిదా ఉగ్రవాదుల గురించిన విస్తృత సమాచారాన్ని అమెరికాకు అందించింది. భారత్ ప్రకటించిన 'ఉగ్రవాదంపై పోరు' విధానంతో పాటు, ఆర్థికంగా క్రమంగా బలోపేతం కావడంతో వివిధ దేశాలతో దౌత్య సంబంధాలు దృఢతరం కావడం మొదలైంది.

ఇదే సమయంలో ఐక్యరాజ్యసమితి-యు.ఎన్., ప్రపంచ వాణిజ్య సంస్థల్లో సంస్కరణల కోసం భారత్ చేసిన యత్నాలు మిశ్రమ ఫలితాలనిచ్చాయనే చెప్పాలి. యు.ఎన్. భద్రతా మండలిలో మనదేశానికి శాశ్వత సభ్యత్వం ఇచ్చేందుకు అన్ని దేశాలు మద్దతిస్తున్నప్పటికీ, చైనా మోకాలడ్డుతోంది. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయకపోయినా, భారత్‌తో అమెరికా పౌర అణు ఒప్పందాన్ని కుదుర్చుకోవడం విశేషం. అణ్వస్త్రవ్యాప్తిని నిరోధించే విషయంలో భారత్ విశ్వసనీయ చరిత్ర నేపథ్యంలో తానీ ఒప్పం దాన్ని కుదుర్చుకున్నానని అమెరికా సమర్థించుకున్నా, మిగిలిన అణు సరఫరా దేశాలు సమ్మతించలేదు. 2010లో బరాక్ ఒబామా మనదేశంలో పర్యటించి నప్పుడు యు.ఎన్. భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి మద్దతునిస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాదు అణుసరఫరా గ్రూపు, వాసెనార్ అరేంజ్‌మెంట్, ఆస్ట్రేలియా గ్రూపు, మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రీజైమ్‌లో చేరడానికి కూడా అమెరికా సమ్మతించింది. 2018 జనవరి నాటికి భారత్ వాసెనార్ అరేంజ్‌మెంట్, ఆస్ట్రేలియా గ్రూప్, మిస్సైల్ టెక్నాలజీ కంట్రోల్ రిజైమ్‌ల్లో సభ్యత్వాన్ని పొందింది. అణు సరఫరా గ్రూపులో ఇప్పటికీ మనదేశానికి సభ్యత్వం లభించలేదు.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

Hearty Congratulations to

Sri Ashok Gajapathi Raju garu

On his Appointment as Governor of GOA State



Honour **Shri Pusapati Ashok Gajapathi Raju** garu and **Smt. Pusapati Adithi** MLA garu have visited Asvins Specialty Hospitals, Hyderabad and blessed our Specialists and Staff.

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort

Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road,
Somajiguda, Hyderabad, Telangana - 500082.

Ph: +91 94404 45775 **www.asvinshospitals.com**

రక్షణ రంగంలో భారత్ ఆధిపత్యం ఆపరేషన్ సిందూర్

స్వతంత్ర భారతదేశం మొదటిసారి దిగుమతి చేసుకున్న ఆయుధాలతో పాటు స్వదేశీ రక్షణ వ్యవస్థలూ, ఆయుధాల ఆధారంగా యుద్ధం చేసింది. దాని పేరే ఆపరేషన్ సిందూర్.

స్వాతంత్ర్య దినోత్సవం, ఇతర ఉత్సవ సందర్భాలలో భారత ప్రధానికి సాంప్రదాయకంగా సమర్పించే 21-గన్ సెల్యూట్ కార్యక్రమాన్ని మొదటిసారిగా, 2022లో దేశీయంగా అభివృద్ధి చేసిన 155 mm హోవిట్జర్, ATAGS (అడ్వాన్స్‌డ్ టోవ్డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్) ఉపయోగించి నిర్వహించారు. ఇది 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో సాధ్యమైన ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. ఇంకా, రక్షణ తయారీలో పెరుగుతున్న దేశం స్వావలంబనను ఆవిష్కరిస్తున్నది.

అంతకు ముందు ఆ 21-గన్ సెల్యూట్ కార్యక్రమంలో బ్రిటిష్ మూలాలు ఉన్న 25-పౌండర్ తుపాకులను ఉపయోగించేవారు.

తేజస్ యుద్ధ విమానాలు

ఆపరేషన్ సిందూర్‌లో ఆకాశ్ ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణి, ధనుష్ హోవిట్జర్ వంటి అనేక స్వదేశీ భారతీయ ఆయుధ వ్యవస్థలను మోహరించారు. ఈ వ్యవస్థలు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇతర సాంకేతిక పరిజ్ఞానాలతో పాటు, పాకిస్తాన్ దాడులకు వ్యతిరేకంగా దేశ రక్షణలో కీలక పాత్ర పోషించాయి.

ఉపయోగించిన స్వదేశీ ఆయుధాలు

ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, బ్రహ్మోస్, సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి, ధనుష్ హోవిట్జర్, ATAGS, నాగాస్త్ర-1 లోటరింగ్ మునిషన్ (డ్రోన్ ఆధారిత మందుగుండు సామగ్రిని సరిహద్దు వెంబడి ఉన్న ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకోవడానికి), D4 యాంటీ-డ్రోన్ వ్యవస్థ (డ్రోన్ డిటెక్ట్, డిటర్ట్, అండ్ డిస్ట్రాయ్ సిస్టమ్) ఉపయోగించారు.

ఇక లక్ష్య హై-స్పీడ్ టార్గెట్ డ్రోన్ నేత్రా అంటే వైమానిక ముందస్తు హెచ్చరిక వ్యవస్థ.

ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక విజయం కాదు. వ్యూహాత్మక దృష్టి, శాస్త్రీయ ఆవిష్కరణల మార్గనిర్దేశం కలిగిన భారత రక్షణ వ్యవస్థ. ఇది ఏదైనా సవాలును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటుందని ప్రకటించింది. ఇది ఆత్మనిర్భర్ భారత్ విజయం. ఈ ఆయుధాలు కేవలం దేశరక్షణ కాదు- పునరుజ్జీవం పొందిన, స్వావలంబన కలిగిన భారత్‌కు చిహ్నాలు.

ఆపరేషన్ సిందూర్ అంటే-భారతదేశం కేవలం దిగుమతి చేసుకున్న ఆయుధాలపై ఆధారపడటం నుంచి స్వదేశీ రక్షణ వ్యవస్థలు, ఆధిపత్యం స్థాయికి చేరిందని ఎలుగెత్తి చాటడం. భారతీయ నిర్మిత ఆయుధాలు, వ్యవస్థలు, వ్యూహాలు నిలబెట్టడమే కాకుండా; కచ్చితత్వం, శక్తితో శత్రువు వ్యూహాలను తిప్పికొట్టాయి.

మన దేశ రక్షణ సామర్థ్యం, ఆయుధ వ్యవస్థలు ఇంతకాలం పాటు, ముఖ్యంగా స్వాతంత్ర్యం తర్వాత ఎలా అభివృద్ధి చెందాయో ఒకసారి వీక్షిద్దాం.

భారత్ ఆయుధాల చరిత్ర సుదీర్ఘమైనది. పురాతన కాలం నుండి ఆధునిక యుగం వరకు ఆ పరిణామం కనిపిస్తుంది. వివిధ రాజ్యాలు, సామ్రాజ్యాలు అభివృద్ధి చేసి, ఉపయోగించిన వివిధ రకాల ఆయుధాల చరిత్ర అందులో ఉంటుంది. ప్రారంభంలో విల్లంబులు, కత్తులు, ఈటెలు, కవచాలు వంటి ఆయుధాలు యుద్ధాలలో ప్రముఖంగా ఉండేవి. తరువాత, ముఖ్యంగా మొగలులు తుపాకీలను ప్రవేశపెట్టడంతో యుద్ధం, సైనిక వ్యూహాలను గణనీయంగా ప్రభావితం చేసింది. భారతీయ రాజ్యాలు రాకెట్లు, వినూత్న కత్తి ఆకృతులతో సహా స్వంతంగా ప్రత్యేకమైన ఆయుధాలను కూడా అభివృద్ధి చేశాయి.

ప్రాచీన కాలం (మొగలులకు పూర్వం)

విల్లంబులు: పదాతిదళం, రథాలు, గజబలం, విల్లంబులు ప్రాథమిక ఆయుధాలుగా ఉండేవి.

కత్తులు: యుద్ధంలో డబుల్ హ్యాండ్ బ్రాడ్‌స్వర్డ్‌లతో సహా వివిధ ఆకృతుల కత్తులను ఉపయోగించారు.

ఈటెలు, జావెలిన్లు: పదాతిదళం, అశ్వికదళం రెండింటికీ ఈటెలు, జావెలిన్లు కూడా ముఖ్యమైన ఆయుధాలు.

కవచాలు: రక్షణ కోసం తరచుగా చర్మాలతో తయారు చేసిన కోడిగుడ్డు ఆకృతి, దీర్ఘచతురస్రాకార లేదా గంట ఆకారపు కవచాలను ఉపయోగించారు.

మేక్స్, క్లబ్బులు: గదలను పోరాట ఆయుధాలుగా ఉపయోగించారు.

ఉరుమి, కొరడా కత్తి, కేరళ నుండి వచ్చిన పురాతన ఆయుధం అని చెబుతారు. ఇది ప్రత్యేకమైన ఆకృతితో, ఉపయోగంతో ఉంటుంది.

తొలినాటి తుపాకీలు: ప్రాచీన భారతదేశంలో తొలినాళ్లలో తుపాకులు, గ్రెనేడ్లు వాడినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. చేతి గ్రెనేడ్లను పోలిన గోళాకార వస్తువులను పట్టుకున్న శిల్పాలు ఇందుకు సాక్ష్యం పలుకుతాయి.

గన్‌పౌడర్: భారతీయులు గన్‌పౌడర్ (తుపాకీ మందు) ను తయారు చేసేవారని పురాతన గ్రంథాలు సూచిస్తున్నాయి.

బాబర్ ఆధ్వర్యంలో మొగల్ సామ్రాజ్యం, మస్కెట్లు, ఫిరంగులు వంటి తుపాకీలను ప్రవేశపెట్టింది. ఇది భారతదేశ యుద్ధరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది.

మైసూర్ సుల్తాన్‌లు మునుపటి చైనా రాకెట్ల కంటే ఎక్కువ దూరం, ఎక్కువ పేలుడు శక్తి కలిగిన ఇనుప రాకెట్లను అభివృద్ధి చేశారు.

మరాఠాలు, మైసూర్ సుల్తాన్‌లు ఆయుధ కర్మాగారాలను స్థాపించి, వాటి ద్వారా అధునాతన తుపాకీలను ఉత్పత్తి చేయడానికి యూరోపియన్ నిపుణులను నియమించారు.

భారతదేశానికి తుపాకీల పరిచయం సైనిక వ్యూహాలను, శక్తి గతిశీలతను గణనీయంగా మార్చివేసింది.

విల్లంబులు ముఖ్యమైనవిగా ఉన్నప్పటికీ, మొగల్ సైనిక ఆధిపత్యానికి తుపాకీలు కీలకమైనవిగా మారాయి.

తుపాకీల వాడకం రైతు తిరుగుబాట్లకు, ప్రాంతీయ శక్తులకు కూడా అధికారం ఇచ్చింది.

ATAGS 155mm ఫిరంగి

పత్యానికి నిదర్శనం సిందూర్

13వ శతాబ్దం మధ్యకాలంలో భారతదేశంలో గన్‌పౌడర్, తుపాకులు మొదట కనిపించాయి. బహుశా చైనా నుండి వచ్చి ఉండవచ్చు.

14వ శతాబ్దం మధ్య నాటికి, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే గన్‌పౌడర్ కర్మాగారాలు (బారుద్ కారానాలు) భారత పాలనలలో ఒక సాధారణ లక్షణంగా మారాయి.

విజయనగర రాజ్యం, దక్కన్ సుల్తానుల పాలన, ఢిల్లీ సుల్తానేట్‌తో జరిగిన యుద్ధాలలో ఫిరంగులు, అగ్గిపెట్టెలు అమర్చిన మస్కెట్‌లతో సహా తుపాకీలను ప్రారంభంలోనే వినియోగించారని తెలుస్తున్నది.

మొగలులు ఫిరంగి దళాలకు ప్రసిద్ధి చెందిన ప్పటికీ, రాజపుత్రులు వంటి ఇతర దేశీయశక్తులు ప్రారంభంలో తుపాకీలను ఉపయోగించడాన్ని వ్యతిరేకించాయి. సాంప్రదాయ యుద్ధానికే ప్రాధాన్యమిచ్చాయి.

కాలికట్ జామోరిన్, మరాఠాలు వంటి పాలకులు, టిప్పు సుల్తాన్, హైదరాబాద్ నిజాం కూడా తమ పాలనలో తుపాకీలు, ఫిరంగులను ఉపయోగించారు. అభివృద్ధి చేసుకున్నారు కూడా.

1368లో అదోని యుద్ధంలో బహమనీ సుల్తాన్ దళం ఫిరంగిని ప్రయోగించింది.

1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొంది నప్పటి నుండి, మన సైన్యం దిగుమతి చేసుకున్న, దేశీయంగా అభివృద్ధి చేసిన ఆయుధాల మిశ్రమాన్ని ఉపయోగించింది. ముఖ్యమైన రంగాలలో చిన్న ఆయుధాలు, ఫిరంగిదళాలు, ట్యాంకులు, విమానాలు, క్షిపణులు ఉన్నాయి. ఇదంతా స్వదేశీ అభివృద్ధిపై పెరుగుతున్న ప్రాధాన్యతతోనే జరిగింది.

చిన్న ఆయుధాల కోసం: ఇందుకు బ్రిటిష్ పరికరాలపై ఆధారపడటం ప్రారంభమైంది.

ప్రారంభంలో, భారత సైన్యం లీ ఎన్‌ఫీల్డ్ రైఫిల్ (.303 బ్రిటిష్), తరువాత L1A1 సెల్ఫ్-లోడింగ్ రైఫిల్ వంటి ఆయుధాలను ఉపయోగించింది.

INSAS (ఇండియన్ స్మాల్ ఆర్మ్స్ సిస్టమ్) కుటుంబం, అసాల్ట్ రైఫిల్, లైట్ మెషిన్ గన్ సహా, భారతదేశంలోనే అభివృద్ధి చేసి, పెద్ద ఎత్తున ఉత్పత్తి కూడా జరిగింది.

భారత సైన్యం వివిధ కార్యాచరణ అవసరాలను తీర్చడానికి రైఫిల్స్, పిస్టల్స్ నుండి మెషిన్ గన్స్, స్నిపర్ రైఫిల్స్ వరకు విభిన్న శ్రేణి తుపాకీలను ఉపయోగిస్తుంది. కొన్ని కీలక ఆయుధాలలో INSAS రైఫిల్, AK-203 ముఖ్యమైనవి.

ఏకే-203: INSAS స్థానంలోకి రష్యా రూపొందించిన, భారతదేశంలో తయారుచేసినదే అస్సాల్ట్ రైఫిల్.

పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ : ఇది రాకెట్లను ప్రయోగించే ఒక స్వదేశీ వ్యవస్థ. వీటిని ఎగుమతి కూడా చేస్తున్నారు.

బ్రహ్మోస్ క్షిపణి : రష్యాతో కలిసి అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి.

ధనుష్ ఆర్టిలరీ గన్ : ఒక స్వదేశీ 155mm హోవిట్జర్.

అర్జున్ యుద్ధ ట్యాంక్

స్వదేశీ ట్యాంకుల అభివృద్ధి

విజయంత: విక్కర్స్ డిజైన్ ఆధారంగా, సెంచూరియన్ నుండి ప్రేరణ పొంది భారతదేశంలో రూపొందించిన, ఉత్పత్తి చేసిన మొట్టమొదటి ప్రధాన యుద్ధ ట్యాంక్ ఇదే. దీనిని 1980 దశకం మధ్యకాలం వరకు ఉపయోగించారు.

అర్జున్: భారతదేశం అభివృద్ధి చేసిన ప్రధాన యుద్ధ ట్యాంక్. ప్రారంభ రూపకల్పనకు తరువాత నవీకరణలు తోడైనాయి.

జోరావర్: ప్రస్తుతం ఆర్డర్‌లో ఉన్న తేలికపాటి ట్యాంక్. ఎత్తయిన హిమాలయ శ్రేణులలో ఉపయోగించుకోవడానికి రూపొందించారు.

భారత సైన్యం యుద్ధ, నిఘా, లాజిస్టిక్స్ వంటి వివిధ ప్రయోజనాల కోసం హెలికాప్టర్లు, రవాణా విమానాలతో సహా వివిధ రకాల విమానాలను నడుపుతున్నది.

HAL ధ్రువ్: రవాణా, నిఘాతో సహా వివిధ కార్యకలాపాలకు ఉపయోగించే దేశీయంగా రూపొందించి, నిర్మించిన బహుళ-ప్రయోజనాల హెలికాప్టర్ ఇది.

HAL రుద్ర: ధ్రువ్‌కు సాయుధ స్వరూపం. సాయుధ నిఘా, దగ్గరి వైమానిక మద్దతు కోసం అమర్చిన వ్యవస్థ ఇది.

HAL చిరుత/చీతల్: నిఘా, ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించే తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లు.

పాత విమానాల స్థానంలో కొత్త వ్యూహాత్మక రవాణా విమానం ఎయిర్‌బస్ సి-295 ఉపయోగంలోనికి రాబోతున్నది.

HAL తేజస్: స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన తేలికపాటి యుద్ధ విమానం. చురుకుదనం, బహుళ ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందింది.

భారత సైన్యం తన మానవ సహిత విమానాల సామర్థ్యాలకు తోడుగా, నిఘా కోసం UAV లను

(మానవరహిత వైమానిక వాహనాలు) కూడా ఉపయోగిస్తున్నది.

క్షిపణులు:

ఐజీఎండీపీలో సాధంగా, పృథ్వి, అగ్ని, ఆకాశ్, నాగ్ క్షిపణులను అభివృద్ధి చేశారు. దీనికి కొనసాగింపుగా అనేక ఇతర క్షిపణుల అభివృద్ధి కార్యక్రమం కూడా జరుగుతున్నది.

బ్రహ్మోస్: రష్యాతో కలసి సంయుక్తంగా

అరిహంత్ SSBN అణు జలాంతర్గామి

ధ్రువ్ ALH అణు హెలికాప్టర్

హైపర్ సోనిక్ క్షిపణి

ఆకాశ్ క్షిపణి

అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి ఇది.

బాలిస్టిక్ క్షిపణి రక్షణ (BMD) వ్యవస్థ: భారతదేశం తన సొంత క్షిపణి రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది.

స్వదేశీ అభివృద్ధి ప్రయత్నాలు: DRDO (రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ) విస్తృత శ్రేణి స్వదేశీ ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం హైపర్ సోనిక్ క్షిపణుల అభివృద్ధి ఊవందు కుంటున్నది.

అణ్వాయుధ కార్యక్రమం:

భారతదేశం వార్‌హెడ్‌ల నిల్వతో అణ్వాయుధ కార్యక్రమాన్ని కలిగి ఉంది.

స్వాతంత్ర్యానంతర IAF: ప్రారంభంలో ఉన్న అనేక బ్రిటిష్ విమానాలను నిలుపుకుంది. వాటిని వినియోగంలో కూడా ఉంచింది. పేరు నుండి 'రాయల్' అనే ఉపసర్గను తొలగించారు (రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అయింది).

IAF ఫ్రాన్స్, సోవియట్ యూనియన్‌లతో సహా ఇతర దేశాల నుండి విమానాలతో తన విమానాలను వైవిధ్య పరచడం ప్రారంభించింది.తేజస్, ఎంకే 1, ఏఎంసీఏ, వంటివి ప్రస్తుతం అభివృద్ధి బాటలో ఉన్నాయి.

ఇంజన్ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ కోసం విదేశీ భాగస్వాములు, ప్రైవేట్ రక్షణ సంస్థలతో సహకారాన్ని చురుకుగా కొనసాగిస్తోంది మన దేశం.

నౌకాదళంతో భారత సముద్ర సామర్థ్యాలు మరింత పెరుగుతాయని, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ప్రధాన నావికా శక్తిగా దాని స్థానాన్ని పటిష్టం చేసుకుంటుందని భావిస్తున్నారు.

భారత నావికాదళ జలాంతర్గామి నౌకాదళానికి ప్రధానమైన డీజిల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాముల తరగతి. ఈ జలాంతర్గాములను క్రూయిజ్ క్షిపణులను మోసుకెళ్లే విధంగా ఆధునీకరిస్తున్నారు.

ప్రాజెక్ట్ 75(I) : ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ (AIP) టెక్నాలజీతో ఆరు అధునాతన జలాంతర్గాములను నిర్మించే ప్రాజెక్ట్ ఇది.

బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములు (SSBNలు), దాడి జలాంతర్గాములు (SSNలు) రెండింటిపై దృష్టి సారించిన అణు జలాంతర్గామి కార్యక్రమం కూడా దేశంలో ఉంది. INS అరిహంత్ సేవలో ఉన్న ప్రాథమిక SSBN, INS అరిఘాట్, INS అరిధమాన్ వంటి ఇతరాలు అభివృద్ధి దశలో ఉన్నాయి. భారతదేశం అకులా-తరగతి దాడి జలాంతర్గామిని కూడా నిర్వహిస్తున్నది. రష్యా నుండి లీజుకు తీసుకున్నది INS చక్ర.

భారతదేశ అణు జలాంతర్గామి కార్యక్రమంలోని ముఖ్య అంశాలు:

అరిహంత్-తరగతి : ఇవి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెస్సెల్ (ATV) ప్రాజెక్ట్ కింద రూపొందించిన భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములు.

INS అరిహంత్: భారతదేశపు మొట్టమొదటి కార్యాచరణ SSBN, 2016లో ప్రారంభించారు.

INS అరిఘాత్: అరిహంత్ తరగతిలో రెండవది, ప్రస్తుతం ప్రయోగదశలో ఉంది.

INSAS రైఫిల్

INS అరిధమాన్: అరిహంత్ తరగతిలో మూడవది, SSBNగా నియమించారు.

బాలిస్టిక్ క్షిపణులు:

అరిహంత్-తరగతి జలాంతర్గాములు జలాంతర్గామి-ప్రయోగించగల బాలిస్టిక్ క్షిపణులతో (SLBMలు) వీటిని అమర్చుతారు. వీటిలో K-15 సాగరిక (750 కి.మీ పరిధి), K-4 (3,500 కి.మీ పరిధి) ఉన్నాయి.

భారతదేశం తన సొంత అణు జలాంతర్గాములను రూపొందించడంలో, నిర్మించడంలో పురోగతి సాధిస్తోంది. ATV ప్రాజెక్ట్ ఎక్కువ స్వావలంబన లక్ష్యంగా పెట్టుకుంది.

భారతదేశ అణు నిరోధక విధానంలో అణు జలాంతర్గాములు కీలక పాత్ర పోషిస్తాయి. విశ్వసనీయమైన రెండవ-దాడి సామర్థ్యాన్ని అందిస్తాయి.

భారతదేశం ప్రస్తుతం రెండు విమాన వాహక నౌకలను నడుపుతోంది.అవి INS విక్రమాదిత్య, స్వదేశీ తయారీ INS విక్రాంత్. 2022లో ప్రారంభమైన INS విక్రాంత్, పూర్తిగా భారతదేశంలో రూపొందించిన, నిర్మించిన మొదటి విమాన వాహక నౌక. మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చిన కీవ్-క్లాస్ క్యారియర్ INS విక్రమాదిత్యను రష్యా నుండి కొనుగోలు చేశారు.

రక్షణ పాటవంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నదనడానికి ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణ. భారతదేశ రక్షణ పరిణామం ఇకపై రియాక్టివ్‌గా లేదు. ఇది దృఢమైనది, స్వదేశీ క్రియాశీలకంగా ఉంది. డిఆర్‌డిఓ, ప్రైవేట్ రక్షణ పరిశ్రమలు, సాయుధ దళాల మధ్య సినర్జీ, కీలకమైన నిరంతర రక్షణ పర్యావరణ వ్యవస్థను సృష్టించింది. ఉపఖండంలో ఉద్రిక్తతలు ఎప్పుడూ కొనసాగుతూనే ఉన్నందున, భారతదేశం ఇప్పుడు నిరోధకంగా మాత్రమే కాకుండా, తన నేలలోని ప్రతి అంగుళాన్ని దేశీయంగా తయారు చేసిన ఆయుధాలతో రక్షించుకోగల ఆధిపత్య శక్తిగా నిలుస్తోంది.

డా.గోపరాజు నరసింహారావు
సీనియర్ సైంటిస్ట్, డీఆర్‌డీఎల్

జాతీయోద్యమంలో రచయితలు దేశభక్తి తత్పరతతో, స్వాతంత్ర్య సాధనా లక్ష్యంతో అన్ని ప్రక్రియల్లో విరివిగా రచనలు చేశారు. ప్రత్యేకించి నాటక ప్రక్రియ ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించటం సులువని గ్రహించారు.అలా వచ్చిన పౌరాణిక, చారిత్రక, రాజకీయ నాటకాలున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

తెలుగు రంగస్థలం మీద వెల్లువెత్తిన దేశభక్తి రసం

తెలుగు ప్రజలకు 'పురాణాల పట్ల, పౌరాణిక పాత్రల పట్ల గౌరవాభిమానాలు అధికం. అందువల్ల కొందరు నాటక రచయితలు పౌరాణిక పాత్రల ఆధారంగా భంగ్యంతరంగా జాతీయ భావాలను ప్రబోధించారు. ప్రత్యేకించి 1900 నుంచి 1928 మధ్య కాలంలో పౌరాణిక పద్య నాటకాలు విరివిగా వచ్చాయి.



ధర్మవరం రామకృష్ణమాచార్యులు

కోలాచలం శ్రీనివాసరావు,

మంచికీ, ధర్మానికీ విజయం సిద్ధించినట్లు ఉండే సుఖాంత నాటకాలు, భారతీయ సంప్రదాయం ప్రకారం ధర్మానికే జయం కలుగుతుందనే భావాన్ని వ్యక్తపరిచే మహాభారత ఇతివృత్తాలతో నాటకాలు జాతీయోద్యమ కాలంలో విరివిగా వచ్చాయి. అధర్మవర్తనులైన ఆంగ్లేయుల పాలన అంతరించి ధర్మవర్తనులైన భారతీయులకు విజయం కలుగు తుందనే భావం మహాభారత ఇతివృత్తాలతో వచ్చిన నాటకాల్లో ధ్వనిస్తుంది. అందుకే గయోపాఖ్యానం, పాండవోద్యోగం, ద్రౌపదీ వస్త్రాపహరణం, పద్మ వ్యూహం వంటి నాటకాలు బహుళ ప్రజాదరణ పొందాయి. మహాభారత సంబంధమైన పౌరాణిక నాటకాల తీరు గమనార్హం.

భారత జాతీయోద్యమానికి ప్రభావితులైన ప్రప్రథమ తెలుగునాటక రచయిత ధర్మవరం రామకృష్ణమాచార్యులు. ఆయన రచించిన 'చంద్రహాస' (1916), పాంచాలీ స్వయంవరం (1918); ప్రమీలార్జునీయం (1920) నాటకాల్లో జాతీయ భావాలు పాఠకులకు స్పష్టంగా కనిపిస్తాయి.

జాతీయోద్యమంలో 'ఉప్పు' ప్రముఖ స్థానం వహించింది. గాంధీజీ ఉప్పును ఆధారంగా చేసుకొని 1930లో దండి సత్యాగ్రహాన్ని నిర్వహించారు. అంతకన్నా ముందే ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1916లో 'చంద్రహాస' నాటకంలో ఉప్పు పన్నును నిరసించారు. చంద్రహాస నాటకానికి ఉప్పుకు సంబంధం లేకున్నా సమకాలీన ప్రభావంవల్ల ఉప్పు అందులో భాగమైంది.

ఆయన రాసిన 'పాంచాలీ స్వయంవరం' నాటకానికి విదేశీ వస్తు బహిష్కరణకు సంబంధం లేకున్నా నాటి జాతీయ భావాల ప్రేరణతో ప్రవేశపెట్టి నిరసించారు. ఆయన 1905లో రాసిన 'ప్రమీలార్జు నీయం' నాటకంలో స్త్రీ విద్య ప్రాధాన్యాన్ని వివరించారు.

బుద్ధవరపు పట్టాభిరామయ్య 1924లో రాసిన 'మాతృదాస్య విమోచన నాటకం' పరోక్షంగా భారతదాస్య విమోచనాన్ని సూచిస్తుంది. ఇవేకాక అప్పటి కొన్ని పౌరాణిక నాటకాల్లో రచయితలు కుల, మత, వర్ణ వ్యవస్థ నిరసన, మహిళల ప్రగతి, మద్య పాన నిరసన, దాస్య విమోచన వంటి జాతీయోద్యమ దోహదాలైన భావాలు ప్రవేశపెట్టారు.

జాతీయోద్యమం - చారిత్రక నాటకాలు

భారతదేశాన్ని ఆంగ్లేయుల కంటే ముందు మహమ్మదీయులు పాలించారు. ఆంగ్లేయుల దుష్పరిపాలనను నేరుగా నిరసించకుండా మహమ్మ దీయ ప్రభువుల పేరుతో పరాయి పాలనను నిరసించి భారతీయుల్లో నూతనోత్తేజాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. ప్రజలు జాతీయోద్యమంలో పాల్గొనేట్లు చేయటంలో చారిత్రక నాటకాలు ఎంతగానో దోహదం చేశాయి. భారత జాతీయోద్యమంలో మహాత్ముడు అడుగుపెట్టగానే, ఆయన ప్రభావంతో ఎన్నో చారిత్రక నాటకాలు వచ్చాయి.

చారిత్రక నాటక రచనా పితామహుడిగా ప్రసిద్ధు డైన కోలాచలం శ్రీనివాసరావు రాసిన 'రామరాజు చరిత్రము' చారిత్రక నాటకాల్లో ప్రసిద్ధమైంది. అందులో జాతీయ భావాలు ప్రేక్షకులను ఆకర్షించాయి. 1919-21 మధ్య కాలంలో వచ్చిన 'రోషనార'; 'రసపుత్ర విజయం' వంటి నాటకాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. 'కొండలమెండనుద్ధం డులై చెందాడు దండిమరాటే దండాలుండా... భరతఖండంబు నీకెంత పాటు కలిగే' వంటి పద్యాలు ప్రసిద్ధమైనవి. ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణ రాసిన దేశభక్తి ప్రేరకమైన 'రసపుత్ర విజయం' (1920) నాటకం ఆంగ్లేయుల నిషేధానికి గురి అయింది.

కొప్పరపు సుబ్బారావు రచించిన రోషనార (1921) 'వర స్వరాజ్యమును సుస్థిరముగా మీరలు, ధరపైన నెలకొల్పదలతురేని' మొదలైన పద్యాల్లో జాతీయత, దేశభక్తి భావాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి.

జాతీయోద్యమం- రాజకీయ నాటకాలు

దేశభక్తి తత్పరులైన కవులు 1920 తర్వాత భారతదేశంలో జరుగుతున్న స్వాతంత్ర్య సమరాన్ని ప్రత్యక్షంగా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలిపి వారిలో స్వాతంత్ర్య దీప్తిని, స్ఫూర్తినీ కలిగించేందుకు తమ కలాలను ఝళిపించారు. ప్రభుత్వం వారి కుటిల

రాజకీయ కుతంత్రాలను ప్రజలకు ప్రత్యక్షంగా చూపడమే లక్ష్యంగా నాటకాలు వచ్చాయి. అటువంటి నాటకాలు రాసిన వారిలో దామరాజు పుండరీకాక్షుడు అగ్రగణ్యుడు. దామరాజువారు గొప్ప గాంధేయవాది. తన కలం బలంతో తెలుగు రాజకీయ నాటకాలకు శ్రీకారం చుట్టి తెలుగు ప్రజల మన్ననలు పొందారు. జాతీయ నాటక చక్రవర్తిగా ప్రసిద్ధి చెందిన దామరాజువారు జాతీయోద్యమ ప్రచారంలో భాగంగా 'స్వరాజ్యసోపానము'– అనే నాటకం రచించారు. తిలక్ నిర్యాణానంతరం గాంధీజీ రాజకీయ రంగంలో ప్రవేశించటంతో ప్రారంభమైంది. 1919–20 సంవత్సరాల్లో జరిగిన రాజకీయాలు ఇందులో ప్రతిబింబించాయి.

బహుళ ప్రజాదరణ పొందిన ఈ నాటకాలు నిషేధానికి గురైనాయి. అందువల్ల రచయిత ఈ నాటకాన్ని మూడు భాగాలుగా విభజించారు. మొదటిది 'నవయుగారంభము' లేదా 'గాంధీ మహోదయం', రెండోది నవయుగం లేక పాంచాలీ పరాభవం, మూడోది గాంధీ విజయం. ఈ నాటకాల్లో రచయిత బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ, స్వాతంత్ర్య భావోద్దీపకమైన పద్యాలు రాశారు. ఉదా॥ "రండి స్వరాజ్యరథములాగానవశ్యము రండటంచు" అంటూ స్వాతంత్ర్యోద్యమంలోకి ఆహ్వానించారు. ప్రజలను పరాభవము పంజాబు దురంతాలను యథాతథంగా చిత్రీకరించిన క్రియాత్మక నాటకం. ఈ నాటకంలో పాటలు, పద్యాలు, సంభాషణలు దేశభక్తి ప్రబోధాలు. 'గాంధీ నామం మరవరం – మరవం– సిద్ధం– జైలుకు వెళుదాం' అనే పాట వీరసైనిక గీతాలను తలపింపజేస్తుంది. అలాగే రాట్నంమీద పద్యం అద్భుతమైంది.

''ఈ రాట్నపున్ చక్రమా రామచక్రమై
సీమయంత్రాసురు చెండివైచు
ఈ రాట్నపున్ కీ చునా రామ బాణమై 'పరదేశ
వర్తకాసురుని జంపు....''

దామరాజు పుండరీకాక్షుడు రచించిన అఖండ భారత్ విజయ విహారంలో

"భరతఖండంబు చక్కని పాడియావు
అక్షయంబుగా క్షీరంబు లందరికిడు
పొట్ట చీల్చిననొక పాలబొట్టనేని
పితకగలమే అఖండ భారతం మనది"

పై పద్యంలో 'భరతఖండంబు చక్కని పాడియావు' ప్రసిద్ధమైన చిలకమర్తి వారి పద్య పాదాల్ని రచయిత యథాతథంగా అనుసరించాడు.

దామరాజు పుండరీకాక్షుడు 1921లో రచించిన 'నవయుగారంభము' అను గాంధీ మహోదయము' బహుళప్రచారం పొందిన రాకీయ నాటకం. ఈ నాటకంలో దేశభక్తుడు, దేశసేవకుల ప్రస్తావన ఆసక్తికరంగా సాగింది. దేశభక్తుడు హిందూ దేశం పేర్కొన్నారు. పాంచాలిని పరాభవం నుంచి వస్త్రాలు ఇచ్చి కాపాడిన కృష్ణుడిగా గాంధీజీని పోల్చిచెప్పారు. ఈ విధంగా ప్రజల్లో జాతీయోద్యమస్ఫూర్తిని రగిలించారు.

దామరాజు పుండరీకాక్షుడు రచించిన 'గాంధీ విజయం' నాటకంలో భరతమాత దేవ దేవ దనుజహర దీననైతి బ్రోవుమా! అని తన చింతదీర్చ శ్రీ మహా విష్ణువుని ప్రార్థించింది. భారతీయుల దైన్యస్థితిని తలపోసుకున్నది. తిలక్, గాంధీ, లాలా లజపతిరాయ్, షౌకతాలి, మహమ్మదాలి మొదలైన వాళ్లు పడుతున్న కష్టాలను స్మరించుకొని తనను రక్షించమని దైవాన్ని ప్రార్థించింది.

శ్రీ కృష్ణుడు ధర్మరక్షణార్థం శిష్టరక్షణకు, దుష్టశిక్షణకు తాను అవతరిస్తానని తన అవతార తత్వాన్ని వివరించాడు. కలియుగంలో ధర్మరక్షణార్థం తిలక్‌నై, తరువాత గాంధీగా అవతరిస్తానని చెప్పాడు. అంతేకాక ధర్మరక్షణార్థం రామకృష్ణులుగా, అహింసాతత్వానికై బుద్ధునిగా, సౌభ్రాతృత్వవార్థం ఏసుక్రీస్తుగా, దేవుడొక్కడే అనే భావం కోసం మహమ్మద్‌నై అవతరించిన నేను కలియుగంలో ధర్మరక్షణార్థం తిలక్‌నై, తర్వాత గాంధీగా అవతరిస్తానని చెపుతాడు. శాంతిమూర్తినై అహింసామార్గాన లోకాలను ఉద్ధరిస్తానని పలికాడు. భరతమాత కళ్లుమూసి తెరవగానే గాంధీ ప్రవేశించటంతో గాంధీకి విజయం కలగాలని ఆశీర్వదిస్తుంది.

'స్వరాజ్య రథమహోత్సవానికి ముందు జవహర్ దేశసేవకులు జండాలతో నడువగా రథముపై గాంధీ, చిత్తరంజన్‌దాస్, మదనమోహన మాలవ్య, సరోజినీ దేవి, మహమ్మదాలీ సోదరులు మొదలైనవారు రథం వెనుక కదిలారు.

"కదిలింది కదిలింది కాంగ్రెస్ రథమండి
చేయెత్తి యొకసారి జోహార్ చేయండి"

అని జవహరు పాడుతుంటే దేశసేవకులంతా



కందుకూరి వీరేశలింగం, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కాళ్లకూరి నారాయణరావు, కొప్పరపు సుబ్బారావు

వంతపాడారు. రథముపై త్రివర్ణ పతాకం ఎగురు తుండగా భరతమాతకు జేజేలు కొడుతూ జనవాహిని కదిలింది. ఈ విధంగా గాంధీ విజయం నాటకంలో జాతీయోద్యమ స్ఫూర్తిని, చైతన్యాన్ని ప్రజల్లో కలిగించారు.

విదేశీ వస్తువులు బహిష్కరించి స్వదేశీ వస్తువులను ఆదరించారు. నీచవృత్తులు మాని నాగలి పట్టి పొలాలనుదున్నారు. సురాపానం పాపమని భావించి త్యజించారు. మంచి పాఠశాలలు స్థాపించి లలిత కళలు అభివృద్ధి చేశారు. స్వరాజ్య రథయాత్ర ఈ విధంగా ఆదర్శంగా సాగింది. ఆ సమయంలో చాలామంది రచయితలు జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించే నాటకాలు రాశారు.

శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి కూడా సమకాలిక రాజకీయాంశాలను నాటకీకరించారు. ఆయన 'గాంధీ



చిలకమర్తి లక్ష్మీనర్సింహం, పానుగంటి లక్ష్మీనర్సింహారావు

విజయధ్వజ నాటకం (1924), 'తిలక్ మహారాజు' నాటకం (1929) వంటి నాటకాలు ఆంధ్రదేశ మంతటా ప్రదర్శనలకు నోచుకున్నాయి. ప్రజలను జాతీయోద్యమంవైపు నడిపించాయి. అదే సమయంలో డి.సీతారామయ్యగారి స్వరాజ్యము (1921) జంధ్యాల అయ్యవారి శాస్త్రి, మహమ్మదాలీ ప్రభృతుల నిర్బంధము (1921) పేర్కొనదగిన రాజకీయ నాటకాలు.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం ఆంగ్లేయుల దమననీతి 1919 జలియన్‌వాలా బాగ్ వృత్తాంతంతో భారతీయులకు ఆంగ్లేయుల పట్ల ఏహ్యభావం, నిరసనలు కలిగాయి. సామాజిక చైతన్యం వెల్లి విరిసింది. ఈ ప్రభావంతో తెలుగులో జాతీయోద్యమాన్ని ప్రబోధించే ప్రత్యేక నాటకాలు, రాజకీయ నాటకాలు పుంఖానుపుంఖంగా వచ్చాయి. ఈ నాటకాల్లో ఇతివృత్తాలు 1. సంఘ సంస్కరణ, 2. దేశభక్తి, 3. సమగ్ర జాతీయభావం, 4. మద్యపాన నిషేధం, 5. త్రివిధ బహిష్కరణ (విదేశీ వస్తు బహిష్కరణ, శాసనోల్లంఘన, ఖద్దరు శాస్త్రి), 6. గాంధీజీ సూక్తులు, 7. సత్యాగ్రహం, 8. శాంతి, 9. సౌహార్ద్ర భావం, 10. అస్పృశ్యతానివారణ మొదలైనవి.

జాతీయోద్యమం - సాంఘిక నాటకాలు

సంఘ జీవిత చిత్రణలో సంఘర్షణను సృష్టించ గలిగిన సమస్యలను, సాంఘిక జీవితాన్ని ప్రతిబిం బించే నాటకం సాంఘిక నాటకం. జాతీయోద్యమ ప్రభావంతో అనేక సాంఘిక నాటకాలు వెలువడ్డాయి. జాతీయోద్యమ స్ఫూర్తితో సమకాలీన సమాజంలో ఎప్పుడూ రచయితకు ప్రగతిని దర్శించాలనే ప్రగాఢమైన కాంక్ష ఉంటుంది. ఆనాటి జాతీయోద్యమ భావాలు నాటక రంగం మీద ప్రతీకాత్మక పాత్రల ద్వారా ప్రస్ఫుటమయ్యాయి.

భారతీయులంతా స్వాతంత్ర్య సాధనలో ఉరకలు వేసి ఉత్సాహంతో కొందరు భోగలాలసులై మద్యపానం, వేశ్యా సంపర్కం వంటి వ్యసనాల్లో చిక్కి పతనమవుతుంటే వాటిని నిరోధించి సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించడానికి కొంతమంది నాటక రచయితలు సంఘ సంస్కరణ దృక్పథంతో నాటకాలు రాశారు.

కందుకూరి వీరేశలింగంగారు రచించిన 'బ్రహ్మ వివాహం'లో బాల్య వివాహాలు, వృద్ధ వివాహాలు, నిరసించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, కోలాచలం శ్రీనివాసరావు మొదలైనవారు 'సంఘంలో దురాచారాలను తూర్పారబట్టారు. గురజాడ అప్పారావు అమేయ శిల్ప 'కళానైపుణ్యంతో కన్యాశుల్కం' నాటకం రాసి, 'కన్యాశు ల్కం' దురాచారంతో ముడివడ్డ బాల్య వివాహాలు, వృద్ధ వివాహాలు వంటి సంఘ దురాచారాలను నిరసించారు. తర్వాత కాలంలో సంఘంలో నెలకొన్న వేశ్యా లంపటత్వం, వరకట్నం, మద్యపానం అనే మూడు దురాచారాలను ఖండిస్తూ మూడు ప్రసిద్ధమైన సాంఘిక నాటకాలు రాసిన ప్రతిభాశాలి కాళ్లకూరి నారాయణరావు. ఆయన రాసిన చింతామణి (1921); వరవిక్రయం, మధుసేవ (1925) ప్రజల్లో సామాజిక స్పృహను పెంపొందించాయి. సంపూర్ణ స్వాతంత్ర్య సిద్ధికి 1947వరకు ఎన్నో నాటకాలు సమాజంలో చైతన్యాన్ని కలిగించాయి. నాటకాల ద్వారా దేశభక్తిని పురికొల్పి జాతీయోద్యమానికి దోహదంచేసిన మహానుభావులు ఎందరో ఉన్నారు.

వీటి మధ్య చెప్పుకోవలసిన నాటిక చిచ్చుర పిడుగు. దీనిని మద్దూరి అన్నపూర్ణయ్య నడిపిన 'కాంగ్రెస్' పత్రికలో ప్రచురించారు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో తొలి తూటా పేల్చిన మంగళ్ పాండే పాత్ర కేంద్రంగా నడిచే నాటిక ఇది. అరెరే ఫిరంగీ అంటూ మొత్తం ఇంగ్లీష్ జాతిని తిట్టడానికే దీనిని హనుమంతుని వెంకటప్పయ్య దీనిని రాశారు. కానీ అచ్చులో రచయితగా ఆయన పేరు

వేయలేదు. యథా విధిగా ప్రభుత్వం కేసు పెట్టింది. అన్నపూర్ణయ్య ప్రచురణకర్తగా బాధ్యత వహించి జైలుకు వెళ్లారు.

జాతీయోద్యమానికి సమాంతరంగా ఆంధ్రోద్యమం సాగింది. ఆంధ్రోద్యమ సమస్యపై వెలువడిన మొదటి నాటకం గ్రంధి వెంకటసుబ్బారావు రాసిన 'ఆంధ్రమాత'. ఇది ఆంధ్రమహాసభ ప్రారంభంలో వచ్చిన నాటకం. ఇందులో రాజకీయ సంబంధిత 'ఖిలాఫత్' ఉద్యమాలే కాక వివిధ కేశి ఖండనాది సాంఘిక సమస్యలు కూడా ఇందులో చర్చించ బడ్డాయి. కొర్రపాటి గంగాధరరావు రచించిన 'కన్నెగంటి హనుమంతు'; గుళ్లపల్లి నారాయణరావు రచించిన 'ఆంధ్ర జ్యోతి' వంటి నాటకాలు జాతీయోద్యమంలో భాగమైన ఆంధ్రోద్యమాన్ని గూర్చి స్పష్టంగా తెలిపాయి.

సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు రచించిన ముందడుగు నాటకం (1945) అభ్యుదయ దృక్పథంతో సాగింది. జమీందార్లు రైతులను, కూలీలను అణగద్రొక్క బాధపెడుతుంటే వారందరు ఏకమై జమీందారును ప్రతిఘటించటం ఇందులో ఇతివృత్తం. "రైతులు, కూలీలు తమ హక్కుల కోసం ఉద్యమిస్తూ కలిసిమెలిసి నీ హక్కుల కొరకై – కదనముచేయరా!" అని ప్రజల్లో జాతీయోద్యమం చైతన్యాన్ని కలిగించారు.

గత భారత చరిత్రలో పురుషుల ఉదాత్త వైఖరులను, దేశభక్తిని కవులు తమ నాటకాల్లో చిత్రించి భారతీయుల్లో నిద్రాణమైన దేశభక్తిని, జాతీయ భావాలను పేరేపించి జాతీయోద్యమానికి తోడ్పడ్డారు. పండిత పామరరంజకమైన నాటక కళ ఉత్తమోత్తమమైంది. నాటక రచయితలు నాటక ప్రదర్శనలతో, తమ కలంబలంతో ప్రజలను చైతన్యవంతులుగా చేశారు. స్వాతంత్ర్య సాధనలో రచయితలు తమవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారు.

డా॥పి.వి.సుబ్బారావు
9849177594
విశ్రాంత అధ్యాపకుడు

ఇక్కడ కలల రెక్కలు

కఠిన కారాగార శిక్ష అనుభవిస్తున్నా స్వాతంత్ర్య కాంక్ష వీడని దేశభక్తుల ఆకాంక్ష నుంచి మనకు స్వాతంత్ర్యం వచ్చింది. అండమాన్‌లోని సెల్యులార్ జైలుతో పాటు ఇంకొన్ని కూడా మన యోధులను హింసించాయి. భారత స్వరాజ్య సమరానికీ, జైళ్లకీ అవినాభావ సంబంధం ఉంది. వాటి గురించి తెలుసుకుందాం.



మాండలే జైలు

ఇది నేటి మైన్మార్ (పాత బర్మా)లో ఉంది. అటు అండమాన్‌కు, ఇటు మాండలేకు ఉద్యమ కారులను పంపించడంలో ఉద్దేశం, వారిని ప్రధాన గడ్డకు దూరంగా ఉంచడమే.ఇది కూడా కేంద్ర కారాగారమే. 4,833 మంది ఖైదీలను ఇక్కడ నిర్బంధించవచ్చు. మాండలే పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే పేరు బాలగంగాధర తిలక్. ఆయన ఇక్కడ ఆరేళ్లు శిక్ష అనుభవించారు. భగవద్గీతకు ఆయన వ్యాఖ్యానం గీతా రహస్యం ఇక్కడే అవతరించింది. కలకత్తా జైలు నుంచి సుభాశ్‌చంద్ర బోస్‌ను ఈ జైలుకు తరలించిన తరువాత ఆయనకు క్షయ వ్యాధి సోకింది. అందుకు లోపల ఉన్న వాతావరణమే కారణం. అయినా తిలక్, లాలా లాజ్‌పతిరాయ్ వంటివారిని బంధించిన జైలులోనే తనను ఉంచడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పేవారాయన. జనవరి 25, 1925 అర్ధరాత్రి బోస్‌ను ఇక్కడకు తీసుకు వచ్చారు. మూడేళ్లు ఉంచారు.

వైపర్ చైన్ గ్యాంగ్ జైలు



ఇది కూడా అండమాన్ నికోబార్ దీవులలోనిదే. దక్షిణ అండమాన్‌లో ఉంది. 1789లో అండమాన్ దీవులకు లెఫ్టినెంట్ ఆర్చిబాల్డ్ హెచ్ఎంఎస్ వైపర్ అనే నౌక మీద వచ్చాడు. ఆ నౌక పేరు ఈ దీవికి పెట్టారు. నిజానికి ఆ నౌక ప్రమాదానికి గురై, ఈ దీవికి చేరిందని కూడా అంటారు. ఇక్కడ 1864-67 మధ్య లెఫ్టినెంట్ బార్నెట్ నాయకత్వంలో జైలును (శిక్షా స్థావరం) నిర్మించారు. దీనికే వైపర్ చైన్ గ్యాంగ్ జైలు అన్న పేరు వచ్చింది. ఇక్కడకు తీసుకువచ్చిన ఖైదీలను రాత్రి వేళ గొలుసులతో కలిపి కట్టివేసేవారు. అందుకే ఆ పేరు వచ్చింది. అండమాన్ జైలుకు వచ్చిన కాఠిన్యానికి ఇదే ప్రేరణ అయి ఉండాలి. ఇక్కడ స్త్రీలను కూడా శిక్ష కోసం తీసుకువచ్చారని తెలుస్తున్నది. ఈ జైలుకు రెండు మూడు రకాలుగా కీర్తి ఉంది. పూరి మహారాజు కిశోర్‌సింగ్ దేవ్‌ను ఇక్కడే బంధించారు. ఆయన ఇక్కడే 1879లో చనిపోయారు. వైస్రాయ్ లార్డ్ మేయోను హత్య చేసిన పెషావర్ వీరుడు షేర్ అలీ అఫ్రీదిని ఫిబ్రవరి 8, 1872న సమీపంలోని ఛాథమ్ దీవిలో ఉరి తీశారు. 1906లో సెల్యులార్ జైలు ఉపయోగంలోకి వచ్చిన తరువాత ఇది ప్రాధాన్యం కోల్పోయింది.

ఆగాఖాన్ భవనం



ఇది పూనా (నేటి పుణే)లో ఉంది. సుల్తాన్ మహమ్మద్ షా మూడో ఆగాఖాన్ దీనిని 1892లో నిర్మించాడు. దుర్భిక్షం వచ్చినప్పుడు ఆ చుట్టుపక్కల గ్రామాలు తల్లడిల్లిపోతున్న సమయంలో ఆగాఖాన్ వారి ఉపాధి కల్పన కోసం ఈ భవనం నిర్మించాడు. దీనిని బ్రిటిష్ ప్రభుత్వం స్వరాజ్య సమరయోధులను నిర్బంధించడానికి ఉపయోగించుకుంది. ఇప్పుడు దీనిని కస్తూర్బా గాంధీకి అంకితం చేశారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో అరెస్టయిన గాంధీజీ, కస్తూర్బా, మహదేవ దేశాయ్, సరోజినీ నాయుడు వంటి వారందరినీ ఇక్కడే నిర్బంధంలో ఉంచారు. కస్తూర్బా ఇక్కడే కన్నుమూశారు. ఈ భవనం జాతీయ ప్రాధాన్యం కలిగినదిగా 2003లో పురావస్తు సర్వే శాఖ ప్రకటించింది.

తెగిపడ్డాయి..

సబర్మతి కేంద్ర కారాగారం

1891 నుంచి 1894 మధ్య నిర్మించిన సబర్మతి కేంద్ర కారాగారం అహ్మదాబాద్‌లో ఉంది. 114 ఏళ్లుగా ఉపయోగంలోనే ఉంది. మార్చి 7,1930న గాంధీజీ దండి సత్యాగ్రహం ప్రారంభించిన తరువాత సర్దార్ వల్లభ్ భాయి పటేల్‌ను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసి ఈ జైలులోనే ఉంచారు. సమీపంలోని రస్ అనే గ్రామంలో ప్రసంగిస్తుండగా అరెస్టయ్యారు. పటేల్ అరెస్టుతోనే ఆ ఉద్యమం నిలిచిపోతుందని ప్రభుత్వం భావించినా అలా జరగలేదు.

అహమ్మద్‌నగర్ కోట



ఇది నిజాం షాహి సుల్తాన్ రాజధానిగా ఉండేది. 15వ శతాబ్దంలో మాలిక్ అహ్మద్ నిజాం షాహీ నిర్మించాడు. తరువాత మరాఠాల చేతికి వెళ్లిన ఈ కోటను 1803లో ఆంగ్లేయులు స్వాధీనం చేసుకున్నారు. ఏడువేల మంది భిల్లు తెగ గిరిజనులతో దీనికి సమీపంలోనే ప్రభుత్వం మీద తిరుగుబాటు జరిగింది. తరువాత దేశంలో ఉద్యమాలు పెరిగి పోవడంతో ఈ కోటనే ఆంగ్లేయులు జైలుగా మార్చారు. జవాహర్‌లాల్ నెహ్రూను ఇక్కడే నిర్బంధించారు. ఆయన ఇక్కడే 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకం రాశారు. ఇవన్నీ ఇందిరకు రాసిన లేఖలు.

మియాన్‌వాలి కేంద్ర కారాగారం

1929లో ఢిల్లీలోని జాతీయ అసెంబ్లీలో బాంబులు వేసిన తరువాత భగత్‌సింగ్, బటుకేశ్వర్ దత్‌లను, ఇతర అనుచరులను బంధించిన జైలు ఇదే. ప్రస్తుతం పాకిస్తాన్‌లోని పంజాబ్ భాగంలో ఉంది. ఇక్కడ చూపుతున్న జాతి వివక్షకు నిరసనగా వారు 116 రోజుల పాటు నిరాహార దీక్ష చేయవలసి వచ్చింది.

హిజ్లీ నిర్బంధ శిబిరం

1950 ఖరగ్‌పూర్‌లో ఐఐటీ సంస్థను స్థాపించిన భవనం ఒకనాడు భారత విప్లవవీరులను బంధించిన కారాగారమే. అదే హిజ్లీ నిర్బంధ శిబిరం. 1930లో దీనిని ఏర్పాటు చేశారు. 1931లో ఇద్దరు జైలు అధికారులు కాల్పులు జరపడంతో సంతోష్ కుమార్ మిత్రా, తారకేశ్వర్ సేన్ గుప్తా అనే ఇద్దరు స్వాతంత్ర్య సమర యోధులు చనిపోయారు. ఈ చర్యకు దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమయింది. రవీంద్రనాథ్ టాగూర్, సుభాశ్‌చంద్ర బోస్ కూడా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. తరువాత ఆ మృతవీరుల భౌతిక కాయాలను తీసుకురావడానికి బోస్ స్వయంగా వెళ్లారు. ఈ విషాదమే బోస్ తీవ్రంగా కదిలించిందని చెబుతారు. 1942లో దీనిని మూసివేశారు.

యరవాడ కేంద్ర కారాగారం

ఇది మహారాష్ట్రలోనే అతి పెద్ద కేంద్ర కారాగారం. 1871లో నిర్మించారు. పూనా నగర శివార్లలోనే కోడిగుడ్డ ఆకృతిలో కట్టారు. అందుకే అండాసెల్ అంటారు. అత్యంత ప్రమాదకర వ్యక్తులుగా భావించిన ఉద్యమకారులను ఇక్కడకు తరలించేవారు. తిలక్, బోస్, గాంధీజీ, నెహ్రూ ఇక్కడ కొద్దికాలం ఉండవలసి వచ్చింది. గాంధీజీ, డాక్టర్ అంబేద్కర్ మధ్య 1932 నాటి పూనా ఒప్పందం ఈ జైలులోనే జరిగింది.

ఋషివాణిని రాజనీతిని మేళవిం

జాతి అంటే భౌగోళిక ఆకారమనీ, నదులు, పర్వతాలు, పొలాలతో కూడినదనీ ఇతర దేశాలు భావిస్తాయి. కానీ భారతీయ మహర్షులు, మనీషులు జాతిని ఒక సజీవమైన ఆత్మగా అర్చించారు. తపస్సు ద్వారా, దర్శనం ద్వారా, చింతన ద్వారా వెలువడిన ఈ మంత్రం రాజకీయాల, వైజ్ఞానిక ఆవిష్కరణల కోలాహలంలో మానవునికి వినిపించలేదు. ఈ సత్యాన్ని రాజకీయ వేదికపై సింహగర్జనగా వెలువరించిన దివ్య విభూతి యోగి అరవిందులు.

భారతదేశంలోని యువకులు బ్రిటిష పాలనలో నౌకరీల కోసం పాకులాడుతున్న సమయంలో, బాల్యంలో 14 ఏండ్లు ఇంగ్లండులో విద్యాభ్యాసం చేసిన ఒక భారతీయ యువకుడు 8 దశాబ్దాల క్రితం తన భార్యకు రాసిన ఒక లేఖలో తన మూడు లక్ష్యాలను గురించి ఇలా పేర్కొన్నాడు: 'నాకు మూడు 'పిచ్చి'లు ఉన్నాయి. మొదటిది : పరమేశ్వరుడు ప్రసాదించిన సద్గుణములు, ప్రతిభ, జ్ఞానం, వైభవం– అన్నీ ఆయనవే... రెండవది: నేను భగవత్ సాక్షాత్కారాన్ని తప్పక పొందుతాను... మూడవది : నా దేశం నా తల్లి. తల్లిగా నేను దేశాన్ని ఆరాధిస్తాను. మాతృభూమి వక్షస్థలంపై కూర్చొన్న దానవుడు ఆమె రక్తం పీల్చుతూ ఉంటే కుమారుని కర్తవ్యం ఏమిటి? అతడు విశ్రాంతిగా భుజించగలడా? తన తల్లి రక్షణకై పరుగెత్తడా? పతనం చెందిన ఈ జాతిని ఉద్ధరించే సామర్థ్యం నాకున్నదని తెలుసు. ఆ శక్తి జ్ఞానశక్తి... పరమేశ్వరుడు ఈ జీవన కార్యాన్ని పూర్తి చేయడం కోసమే నన్ను భూమిపైకి పంపాడు.'

ఈ లక్ష్యాలు మూడూ ఫ్రెంచి విప్లవంలోని మూడు సిద్ధాంతాలకు ప్రతిరూపాలు. మొదటిదానిలో సమానత్వం ఇమిడి ఉంది. అంతా భగవానునిదే అయినప్పుడు, కనీస అవసరాలకు మించి ఖర్చుచేసే హక్కు ఎవరికీ లేనప్పుడు సమాజంలో కృత్రిమమైన వర్గాలు ఏర్పడవు. దేశంలో అందరి వికాసం సాధ్యపడుతుంది. రెండవ లక్ష్యంలో సోదరత్వం ఇమిడి ఉంది. మన అందరిలోను, నిఖిల విశ్వంలోను ఉన్న ఒకే సత్తాను గుర్తించడం సోదరభావనకు ప్రాతిపదిక. మూడవ లక్ష్యంలో స్వాతంత్ర్య భావన



ఉన్నది. ఒక దేశం బానిసత్వంలో ఉన్నంత వరకు దాని సంస్కృతి, దానిలోని పౌరులు పూర్తి వికాసాన్ని పొందలేరు.

అరవింద యోగి జీవనం ఈ మూడు మంత్రాలకు సజీవమైన మూర్తి. బరోడాలో ఉన్నత పదవిలో ఉన్నప్పుడు ఆయన ఎంతో నిరాడంబరంగా ఉండేవారు; తన జీతాన్ని తన కోసం వినియోగించుకోకుండా కష్టాలలో ఉన్నవారి కోసం ఉపయోగించారు. కటిక నేల మీద, ఇటుక తలగడగా చేసుకుని పడుకునేవారు. ధనవంతుడై కూడా దారిద్ర్య వ్రతాన్ని పాలించారు. సమానత్వాన్ని తేవడం కోసం స్వర్గం నుండి దిగివచ్చిన విప్లవ దేవత ఆయన.

అరవిందుడు భారతదేశం తిరిగి రాగానే ఇక్కడ ఆర్థిక, సామాజిక, ధార్మికాది సమస్యలను అధ్యయనం చేశారు. దేశంలో 'అతి' ఎక్కువగా ఉన్నదని గ్రహించారు. ఒక ప్రక్క మహారాజులు పాలు, నేతులలో మునిగి చనిపోతున్నారు; మరోప్రక్క ఎండు రొట్టెల కోసం ఎంగిలాకుల కోసం ఎముకల పోగులు ఒకరి పీకలు మరొకరు నులుముతున్నారు. సాధన సంపత్తికి కొదువ లేదు. అయితే వాసనలు, కోరికలు పంపిణీలోని సమస్థితిని దెబ్బతీశాయి. కనుక మనం కోరికలను తగ్గించుకోవడం అవసరం. అరవిందుని ఈ మంత్రాన్ని ఆచరిస్తే, దేశం ఆర్థిక విప్లవాన్ని సాధించి ఉండేది.

జాతి ఆత్మకు మేలుకొలుపు

రాజకీయ విప్లవానికి ఆయన జన్మదాత. 'వందే మాతరం' మంత్రంతో జాతి ఆత్మను మేలుకొలిపిన మొదటి రాజకీయవేత్త. దేశానికి నిజమైన పరిభాషను ఇచ్చిన, జాతి కీలకాన్ని తెలిపిన మొదటి జాతీయ నాయకుడు ఆయన. భారతీయ మహర్షుల శాశ్వత వాణి మొదటిసారిగా అరవిందుని ముఖతః రాజకీయ రంగం నుండి వెలువడింది. ప్రాచీన భారతంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు రాజనీతిలో నెలకొల్పిన ఆదర్శాల పరంపర ఆధునికయుగంలో తిరిగి కొనసాగింది. మహాభారత యుద్ధంలో ప్రవచించిన భగవద్గీత భారత రాజకీయాలలో తిరిగి ధ్వనించ సాగింది. 'వందేమాతరం' పత్రిక సంపాదకుడుగా అరవిందులు రాజకీయాలలో ప్రవేశించినప్పుడు ఆయన రచనలలో ప్రజలకు ఒక మంత్రశక్తి ప్రభావం అనుభూతమయింది. ఆయన వ్యాసాలు రాజకీయాలనే చర్చించినా వాటి వెనుక సంస్కృతి ఆత్మ దర్శనమిచ్చేది. లాల్–బాల్–పాల్‌ల యుగంలో 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు'ంటూ ఉద్ఘోష రూపంలో ప్రభవించిన విప్లవం అరవిందుని ఛత్రఛాయలో

చిన యోగి

ఫలించసాగింది. 'ఏ విధంగా అయినా సరే ఆ హక్కును పొంది తీరతాం' అనే ఉద్దోష దేశమంతటా ప్రతిధ్వనించసాగింది.

'జాతీయవాదం నేటి యుగధర్మం'

అరవిందులు జాతీయవాదానికి ఒక కొత్త వ్యాఖ్యానాన్ని ఇచ్చారు. జాతీయవాదం ఒక కొత్త శక్తి రూపంలో, ఒక కొత్త ధర్మంగా, భగవానుని శక్తి అవతారంగా పృథ్విపై దిగివస్తోందని ఆయన బోధించారు. ఆయన దృష్టిలో రాజనీతి అంటే ఏవో జిత్తులు, ఎత్తుగడలు కాదు; భగవంతుణ్ణి సముదాయంలో ప్రతిష్ఠించే మంత్రం. నాలుగేండ్ల రాజకీయ జీవితంలో ఆయన రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందాలనే తీవ్ర ఆకాంక్షను దేశమంతటిలో వ్యాపింపజేశారు; మరో కొత్త విప్లవం కోసమై సన్నద్ధులయ్యారు.

విప్లవం, పరివర్తన, వీటితో అరవిందుని జీవితంలోని కణకణమూ నిర్మితమయింది. ఒక భారతీయ యువకుడు పరాయి దేశంలో నాలుగు పర భాషలలో ప్రథమ స్థానాన్ని గడించి ప్రపంచంలో నాటి ఒక గొప్ప జాతి మేధాశక్తిని సిద్ధం చేశాడు; భారత్ శ్రేష్ఠత్వాన్ని నిరూపించాడు; భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత దేశ పరిస్థితులను గురించి ఆధునిక యుగంలో ఏ రాజకీయ వేత్త సంపాదించని పరిజ్ఞానాన్ని సంపాదించాడు. అంతేకాదు ఆయన ఈ భూఖండ సంస్కృతిని రూపుదిద్దిన మహర్షుల వాణిలోని మర్మాన్ని గ్రహించారు.

నాటి రాజకీయ నాయకులు పలువురి లక్ష్యం ప్రభుత్వాధికారం భారతీయుల చేతుల్లోకి రావడం మాత్రమే. నాడు దేశం అనే దేవత పిలుపుని ప్రజలు స్పష్టంగా గుర్తించలేకపోయారు. స్వాతంత్ర్య కాంక్ష రాష్ట్రాత్మ పిలుపు కావాలి. అరవిందుడు మన స్వాతంత్ర్య విప్లవంలో విప్లవాన్ని కాంక్షించాడు. మన విప్లవం పిలుపు కావాలి. దానికోసమై సంఘర్షణ దేవత చరణాలకు ఆరాధన కావాలి. మన విప్లవం పునాదులు బలహీనంగా ఉన్నాయి. ఆయన రోగగ్రస్థమైన మన విప్లవంలో మన సహజ సమృద్ధిని, మన ఆధ్యాత్మికతను పూరించి, దానికొక కొత్త జీవనాన్ని ప్రసాదించారు.

భారతీయ స్వాతంత్ర్య విప్లవ మహాసేనాని అయిన అట్టి దివ్యవిభూతి మరే దేశ చరిత్రలోనూ కానరాడు. దాస్య శృంఖలాలను తెంచివేయడానికి ఆయనలోని ఆవేదన, తపన, ఉన్మాదం, ఉద్వేగం, వీటితోపాటు ఆయనలోని గాంభీర్యం ప్రపంచ

అరవిందుడు మన స్వాతంత్ర్య విప్లవంలో విప్లవాన్ని కాంక్షించాడు. మన విప్లవం పిలుపు కావాలి. దానికోసమై సంఘర్షణ దేవత చరణాలకు ఆరాధన కావాలి. మన విప్లవం పునాదులు బలహీనంగా ఉన్నాయి. ఆయన రోగగ్రస్థమైన మన విప్లవంలో మన సహజ సమృద్ధిని, మన ఆధ్యాత్మికతను పూరించి, దానికొక కొత్త జీవనాన్ని ప్రసాదించారు.

చరిత్రలోనే కానరాదు. వాస్తవానికి ఆయన ఏ రంగంలో ఎక్కువ సంవత్సరాలు గడిపి, అగ్రగామి అయ్యారో ఆ రంగంలో ప్రవేశించింది దేశ స్వాతంత్ర్యం కోసమే. దేశాన్ని స్వాతంత్ర్యం చేయడానికి ఒక అలౌకిక శక్తిని సంపాదించే లక్ష్యంతో ఆయన యోగమార్గాన్ని స్వీకరించారు.

అరవిందులు మూలతః విప్లవవాది. విప్లవానికి ఆధారం పవిత్రత. అరవిందులు రాజకీయ రంగంలో సహజసిద్ధమైన ప్రవృత్తిని, త్యాగభావన శ్రేష్ఠతను నింపి దానికి అతి నిర్మలమైన రూపాన్ని ఇవ్వడానికి కృషిచేశారు.

ద్వారకాప్రసాద్ గుప్త,
(జాగృతి, 14.8.1972)

ఇందూరు, కామారెడ్డి జిల్లాల్లో కుటుంబ సమ్మేళనాలు

ఇందూరు

కామారెడ్డి

ఇందూరు: జీవితంలో ఎలా ఉండాలో, సత్యం కోసం ఇలా జీవించాలో, మనిషి జీవితం పరమార్థమేమిటో తెలుపుతూ కేదారాశ్రమ(పలుగుట్ట) స్వామీజీ మంగి రాములు మహారాజ్ అన్నారు. ఇందూరు, కామారెడ్డి జిల్లాల కుటుంబ ప్రబోధన్ ఆధ్వర్యంలో ఆగష్టు 2న జరిగిన ఇందూరు జిల్లా కుటుంబాల సమ్మేళ నంలో స్వామిజీ పాల్గొని ఆశీఃప్రసంగం చేశారు. ఇందూరు విభాగ్ కార్యవాహ రాజులవార్ దిగంబర్ ఐదు విషయాలపట్ల అవగాహన కల్పించారు.

ముఖ్యవక్తగా పాల్గొన్న తెలంగాణ ప్రాంత కుటుంబ ప్రబోధన్ సంయోజక్ పట్లోళ్ల మురళీధర్‌రెడ్డి కుటుంబాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ నేటి కాలంలో కుటుంబ విలువలను పరిరక్షించుకోవడం కోసం కుటుంబ పెద్దలు అనుసరించ వలసిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ కాపర్తి గురుచరణం, ప్రాంత గ్రామవికాస్ సంయోజక్ వేంపల్లి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లాలో జరిగిన మరో కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ బొడ్డు శంకర్, విభాగ్ సహ కార్యవాహ పాపయ్యగారి గోవర్ధన్ రెడ్డి, విభాగ్ కుటుంబ ప్రబోధన్ సంయోజక్ ఎండల శ్రీనివాస్, జిల్లా కుటుంబ ప్రబోధన్ సంయోజక్ చౌకిరాజేంద్ర, సహసంయోజక్ బల్‌రాంతోపాటు ఆరువందల మంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే రెండేళ్లలో రూ. లక్ష కోట్ల విలువైన రహదారి ప్రాజెక్టులను మంజూరు చేస్తామని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన రూ. 27 వేల కోట్ల విలువ గల ఆరు కీలక ప్రాజెక్టులకు ఆయన వెంటనే ఆమోదం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి రూ. 2,800 కోట్ల విలువైన కొత్త రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 2,100 కోట్లతో పూర్తయిన రెండు రహదారులను జాతికి అంకితం చేశారు. ఆగస్టు 2న మంగళగిరిలోని సీ కన్వెన్షన్ వేదికగా ఈ కార్యక్రమాలు జరిగాయి.

'ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. అలా చేసి చూపుతాం. రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆకాంక్షించిన ప్రగతి, వికాసం సాకారమవుతోంది. అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దూరదృష్టితో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనల జాబితా విస్తృతమైనది. ప్రతి ప్రాజెక్టునూ ఆమోదిస్తాం. వాటిని మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం' అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు పూర్తయితే, అవి అమెరికా రోడ్లతో సమానంగా నిలుస్తాయని అన్నారు. రహదారులు, ఓడరేవులు ఉన్న రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, జలమార్గ రవాణా ఖర్చు బస్సు, రైలు కంటే తక్కువని అన్నారు. ఈ రంగాలను ఆంధ్రప్రదేశ్ బలోపేతం చేసుకోవాలని సలహా ఇచ్చారు. భవిష్యత్తు ఇథనాల్ మరియు హైడ్రోజన్‌లదేనని, డీజిల్, పెట్రోల్ వినియోగం తగ్గించి, కాలుష్య రహిత ఇంధనాల వాడకం పెంచితే దేశం అభివృద్ధిలో పోటీపడగలదని గడ్కరీ అభిప్రాయపడ్డారు. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ మిషన్ అమలైతే, రైతులకు లక్షల్లో ఆదాయం వస్తుందని, విశాఖ పట్నంలో ఒక ప్రైవేటు కంపెనీకి హైడ్రోజన్ ప్రాజెక్టు అప్పగించినట్లు తెలిపారు.

'అందరికీ నమస్కారం' అని తెలుగులో ప్రసంగం ప్రారంభిస్తూ, తాను ఎలక్ట్రికల్ కారును ప్రారంభించిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు. 'విద్యుత్' వాహనాన్ని ప్రారంభించిన నాడు 'అది మధ్యలో ఆగిపోతే పరిస్థితి ఏమిట'ని ఒక విలేకరి సందేహం వెలిబుచ్చారు. కానీ ఇప్పుడు కార్లతోపాటు ఎలక్ట్రిక్ బస్సులు కూడా రయ్‌రయ్‌మంటూ తిరుగుతున్నాయి' అన్నారు. రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాయకుడు శంకర్ మహదేవన్ పాడిన పాటతో రూపొందించిన ఓ సంక్లిప్త వీడియోను సమావేశంలో మంత్రి ప్రదర్శించారు.

గడ్కరీ మాట తప్పరు:చంద్రబాబు

నితిన్ గడ్కరీ మాట అంటే మాటే అని, చెప్పారంటే చేసి చూపిస్తారనిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కితాబిచ్చారు. ఏపీని కూడా మహారాష్ట్ర లాగా చూడాలని గడ్కరుకి విజ్ఞప్తి చేశారు. కేంద్రం ఇచ్చే కొత్త రహదారి ప్రాజెక్టులకు ఎలాంటి భూసేకరణ సమస్య రాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. "మేం ఏది అడిగినా గడ్కరీ ఎప్పుడూ లేదని చెప్పలేదు. పోలవరం ప్రాజెక్టుకు ఆక్సిజన్ ఇచ్చింది ఆయనే. అమరావతికి 189 కిలోమీటర్ల ఔటర్‌రింగ్ రోడ్డు ఇచ్చారు. గతంలో రహదారులు నరక ప్రాయంగా ఉండేవి. ఇప్పుడు వాటిని బాగుచేస్తున్నాం. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో రాష్ట్రంలో మరో 20 పోర్టులు రాబోతున్నాయి. మరో 9 ఎయిర్‌పోర్టులు సిద్ధం కావాల్సిఉంది" అని చంద్రబాబు వివరించారు. ఉదయం సంక్షేమం కింద రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ డబ్బు జమచేసి, సాయంత్రం అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులను తెచ్చే రహదారి ప్రాజెక్టుల కార్యక్రమంలో పాల్గొన్న ఈ రోజును జీవితంలో మరచిపోలేనని చెప్పారు. నితిన్ గడ్కరీని ఆయన శాలువాతో సత్కరించారు.

కూల్చివేతల... నిర్మాణాలు

గత ప్రభుత్వం కూల్చివేతలతో మొదలైతే కూటమి ప్రభుత్వం రహదారులను, వ్యవస్థలను పునరుద్ధరిస్తూ ముందుకు వెళుతోందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి, ఐక్యతకు కూటమి ప్రభుత్వం పునాదులేస్తోందన్నారు. "కూటమి ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు బలంగా పనిచేయాలి. అప్పుడే రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం బలంగా ఉంటుంది. ఇప్పుడిప్పుడే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు, కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయి. అవి రాష్ట్ర భవిష్యత్‌ను, ఐదు కోట్ల ప్రజల సంక్షేమాన్ని కాపాడతాయి. కూటమి ఐక్యతను దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయి. చాలా జాగ్రత్తగా ఉండాలి.

నితిన్ గడ్కరీ

గా మోదీ కల సాకారం

కూటమిని దెబ్బతీసే కుట్రలను ఐక్యంగా ఎదుర్కొనాలి" అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ స్ఫూర్తితో 'అడవితల్లి బాట' పేరుతో గిరిజన గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తే ఓట్లు వస్తాయా? అన్న కోణంలో తమకు ఆలోచన లేదని, అడవి ప్రాంతాల్లో డోలిమోతలు ఉండకూడదన్నదే తమ ఉద్దేశమని ఆయన చెప్పారు. తాను కోరిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 50 కోట్లు ఇచ్చారని, వాటికి ఉపాధి హామీ కింద వచ్చిన 500 కోట్లు కలిపి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు.

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, అమరావతి ఓఆర్ఆర్‌కు 140 మీటర్ల వెడల్పుతో అనుమతి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుబట్టారని తెలిపారు. జాతీయ రహదారుల సంస్థ అధికారులు మాత్రం దేశంలో 120 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పుతో ఎక్కడా ఓఆర్ఆర్‌కు అనుమతులు ఇవ్వలేదని చెప్పారన్నారు. కానీ, ముఖ్యమంత్రి పట్టుదల, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఆయనకున్న తపనను చూసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెంటనే మంజూరు చేశారని తెలిపారు. 'ఇది కేవలం ఒక అనుమతి మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల ప్రధాని నరేంద్ర మోదీకి గల ప్రత్యేక శ్రద్ధకు, దార్శనికతకు నిదర్శనం. జాతీయ రహదారుల అభివృద్ధికి, వాటి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రగతికి బంగారు బాటలు వేస్తోంది. ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న చంద్రబాబు గారి సంకల్పానికి కేంద్రం సంపూర్ణ మద్దతు ఇస్తోంది. గత ఐదేళ్లలో స్తంభించిన అమరావతి నిర్మాణ పనులకు ఇప్పుడు కేంద్రం అండగా నిలవడంతో రెట్టింపు వేగంతో ముందుకు వెళ్తాం. ఈ 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వంతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు' అని అన్నారు.

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చేలా కూటమి నాయకత్వం అహర్నిశలు కృషిచేస్తుంటే, ఇంకోవైపు 'మా మనుషులను పంపించి మీ ఎమ్మెల్యేలను హత్య చేయిస్తాం' అనే వికృత నాయకత్వం ఉందని తీవ్రంగా మండిపడ్డారు. ఒకవైపు విధ్వంసం, మరోవైపు అభివృద్ధి. తమకు ఏం కావాలో ప్రజలు ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టంగా నిరూపించారు. 'కేంద్ర ప్రభుత్వ 'ఆయుష్మాన్ భారత్' వంటి పథకాల ద్వారా రాష్ట్రంలోని పేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తోంది. మంగళగిరిలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేసి, రాష్ట్ర వైద్య రంగానికి కేంద్రం పెద్దపీట వేసింది. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు కూడా సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తోంది. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచితే, ఇప్పుడు కేంద్రం ఆర్థికంగా ఆదుకుంటూ అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. మేము ప్రజల ఆరోగ్యం, రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచిస్తుంటే, ప్రతిపక్షం మాత్రం కుట్రలు, విధ్వంసకర రాజకీయాలకే పరిమితమైంది' అన్నారు.

6 ప్రాజెక్టులు.. రూ.27 వేల కోట్లు!

ముఖ్యమంత్రి చంద్రబాబు కోరిన వెంటనే 6 కీలక హైవే ప్రాజెక్టులను మంజూరు చేస్తూ కేంద్ర నితిన్ గడ్కరీ వేదికపైనే ప్రజల సమక్షంలో ప్రకటన చేశారు. అందులో భాగంగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని 6 వరుసలుగా విస్తరిస్తారు. అందుకోసం రూ. 6,700 కోట్లు ఖర్చు చేస్తారు. అలాగే విజయవాడ– మచిలీపట్నం రహదారిని రూ. 2600 కోట్లతో 6 వరుసలుగా, వినుకొండ–గుంటూరు రహదారిని రూ.2605 కోట్లతో నాలుగు వరుసలుగా చేస్తారు.. గుంటూరు – నిజాం పట్నం రోడ్డును రూ. 2 వేల కోట్లతో నాలుగు వరునలుగా, రూ.4,200 కోట్లతో బుగ్గకయిప–గిద్దలూరు రహదారిని నాలుగు వరుసలుగా, ఆకివీడు–దిగమర్రు రోడ్డును రూ.25ఏఏ కోట్లతో నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తారు. పెడన–లక్ష్మీపురం రోడ్డును రూ. 4200 కోట్లతో నాలుగు వరుసలుగా, ముద్దునూరు–కడప రోడ్డును రూ 1182 కోట్లతో నాలుగు వరుసలకు విస్తరిస్తారు. ఇవి కాకుండా హైదరాబాద్–విజయవాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవేను కూడా మంజూరు చేశారు. ఏడాదిలో మరో రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల ప్రాజెక్టుల మంజూరుకు గడ్కరీ అంగీకారం తెలిపారు. ఆయన సానుకూల ప్రకటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సాయం

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఆర్థిక సహాయ కార్యక్రమం ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేల సాయానికి రాష్ట్రప్రభుత్వం రూ.14 వేలు కలిపి ఏటా రూ.20 వేల నగదును జమ చేస్తుంది. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ కింద 6 రకాల పథకాల అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తామని కూటమి పార్టీలు పేర్కొన్నాయి. ఇందులో అన్నదాత సుఖీభవ కూడా ఒకటి. ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పువీరాయపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకంలో తొలివిడతగా 46.86 లక్షల మంది రైతులకు సుమారు రూ.3,174.42 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్‌ను మహిళా రైతులు నాగలక్ష్మి, షేక్ మున్నాలకు అందజేశారు.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

కాళేశ్వరంపై ఘోష్ నివేదిక

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించి జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ జులై 31 నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందచేసింది. దాదాపు 700 పేజీల నివేదిక రెండు ప్రతులను సీల్డ్ కవర్‌లో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందచేయగా, ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందచేశారు. ఆ తరువాత నాలుగు రోజులకు (ఆగస్టు 4) రాష్ట్ర మంత్రివర్గం ఆ నివేదికను ఆమోదించింది. త్వరలో శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించి, దీనిపై

క్షుణ్ణంగా చర్చిస్తామని, అన్ని రాజకీయ పక్షాలను సంప్రదించిన తరువాత అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది మార్చిలో కమిషన్ ఏర్పాటు చేయగా, అది జూన్‌లో విచారణ ప్రారంభించింది. దాదాపు 13 నెలల పాటు సాగిన విచారణలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సహా 115 మందిని ప్రశ్నించింది. చంద్రశేఖర రావు మినహా అందరిని బహిరంగంగానే విచారించింది. కమిషన్ విచారణ గడువును ప్రభుత్వం ఏడుసార్లు పొడిగించగా, చివరి దఫా గడువు ముగింపు నాడు (జులై 31) కమిషన్ నివేదికను అందచేసింది.

నివేదికలోని ముఖ్యాంశాలను బట్టి, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదిత ప్రాంతాల నుంచి మరోచోటికి తరలించిందని పేర్కొన్నట్టు తెలిసింది. బ్యారేజీలకు సంబంధించి భూభౌతిక, సాంకేతిక పరీక్షలను సక్రమంగా నిర్వహించలేదని,డిజైన్లలోని లోపాలు, ఆపరేషన్ మెయింట్ నెన్స్ లోపాలు,నాణ్యతా లోపాలు బ్యారేజీల వైఫల్యానికి కారణాలుగా పేర్కొన్నట్లు సమాచారం. దేశంలోని బ్యారేజీలను నీటిని మళ్లింపునకు ఉపయోగిస్తే, కాళేశ్వరంలో నీటిని నిల్వ చేయడం కూడా ఈ పరిస్థితికి కారణమని కమిషన్ భావించిందని అంటున్నారు.

కాగా.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీల నిర్మాణానికి ముందే ఒక నిర్ణయానికి వచ్చిన అప్పటి ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని సాకుగా చూపిందని అధికార పక్షం కాంగ్రెస్ ఆరోపించింది. పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసిందని అంటున్నారు. పీసీఘోష్ నివేదికను అధ్యయనానికి నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయ కార్యదర్శితో ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. 'విచారణలో నా పాత్ర ముగిసింది. ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాల మేరకు నివేదికను సిద్ధం చేశాం' అని జస్టిస్ ఘోష్ నివేదిక అందచేసిన అనంతరం విలేకరుల ఇష్టాగోష్ఠిలో అన్నారు.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

అందరూ 17 ఏళ్ల తర్వాత

2008 మాలేగావ్ పేలుడు కేసు నుంచి సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఏడుగురు నిందితులకు విముక్తి లభించింది. ఈ మేరకు జులై 31న ముంబైలో ప్రత్యేక జాతీయ దర్యాప్తు ఏజెన్సీ -ఎన్ఐఏ - కోర్టు తీర్పునిచ్చింది. నిందితులందరూ సంశయ లబ్ధికి అర్హులని, వారికి వ్యతిరేకంగా ఎలాంటి సహేతుకమైన, హేతుబద్ధమైన ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. ఏ మతమూ హింసను సమర్థించదు. కేవలం తెలివిడి, నైతిక రుజువు ప్రాతిపదికగా కోర్టు ఏ ఒక్కర్నీ దోషిగా నిర్ధారించదు. అందుకు తగిన ఆధారం ఉండాలి. దర్యాప్తులోనూ, ప్రాసిక్యూషన్‌లోనూ సాంకేతికపరమైన అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయని ప్రత్యేక జడ్జీ జస్టిస్ ఏకే లహోటీ వేలెత్తి చూపారు. ప్రాసిక్యూషన్ వాదించినట్టుగా పేలుడుకు ఉపయోగించిన మోటార్ బైక్ ఠాకూర్ పేరిట రిజిస్టర్ అయ్యిందనేందుకు ఎలాంటి ఆధారాలు లేవు. అలాగే బైక్‌కు అమర్చిన బాంబు ద్వారానే పేలుడు జరిగిందనేందుకు ఎలాంటి రుజువులు లేవని జడ్జి తెలిపారు. ఈ సందర్భంగా సాధ్వీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ జడ్జిని ఉద్దేశించి మాట్లాడుతూ నేను సన్యాసిని కాబట్టే ఇంకా ప్రాణాలతో ఉన్నాను. ఒక కుట్రతో వారు భగ్వా-కాషాయంను అప్రతిష్ట పాల్జేశారు. నేడు భగ్వా గెలిచింది. హిందుత్వ విజయం సాధించింది. దీనికంతటికీ కారణమైన వారిని దేవుడు శిక్షిస్తాడు అని అన్నారు.

నిర్దోషులే.. మాలేగావ్ పేలుడుపై తీర్పు

పేలుడు నుంచి తీర్పు దాకా..

సెప్టెంబర్ 29, 2008:

మహారాష్ట్ర, నాసిక్ జిల్లాలోని మాలేగావ్ పట్టణంలో బిక్కూ చౌక్ సమీపంలో ఒక మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలుడు. ఆరుగురు మృతి, 101 మందికి గాయాలు.

సెప్టెంబర్ 30, 2008:

మాలేగావ్‌లోని ఆజాద్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు.

అక్టోబరు 21, 2008:

కేసు దర్యాప్తు చేపట్టిన మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక బృందం–ఏటీఎస్.

అక్టోబరు 23, 2008:

సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, మరో ముగ్గురు అరెస్టు.

నవంబరు, 2008:

లెఫ్ట్‌నెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ అరెస్టు.

జనవరి 20, 2009:

సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, లెఫ్ట్‌నెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా అరెస్టయిన 11 నిందితులపై ప్రత్యేక కోర్టులో ఏటీఎస్ చార్జ్ షీట్ నమోదు. నిందితులపై మహారాష్ట్ర సంస్థాగత నేరాల నియంత్రణ యాక్ట్ – ఎంసీవోసీఏ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక యాక్ట్ – యూఏపీఏ, ఇండియన్ పీనల్ కోడ్ – ఐపీసీలో కఠినమైన సెక్షన్ల కింద అభియోగాలు నమోదు.

వెదుకుతున్న నిందితులుగా మరో ఇద్దరు వ్యక్తులు రాంజీ అలియాస్ రామచంద్ర కాల్‌సంగ్ర, సందీప్ దాంగే పేర్ల ప్రస్తావన.

జూలై, 2009:

నిందితులకు ఎంసీవోసీఏ వర్తించదన్న ప్రత్యేక కోర్టు. కేసు విచారణను నాసిక్‌లోని కోర్టులో చేపట్టాలని ఆదేశం.

ఆగస్టు, 2009:

ప్రత్యేక కోర్టు ఆదేశాన్ని సవాల్ చేస్తూ బాంబే హైకోర్టుకు మహారాష్ట్ర ప్రభుత్వం.

జూలై, 2010:

ప్రత్యేక కోర్టు ఆదేశాన్ని తోసిపుచ్చిన బాంబే హైకోర్టు. నిందితులకు ఎంసీవోసీఏ వర్తిస్తుందన్న హై కోర్టు.

ఆగస్టు, 2010:

హైకోర్టు ఆదేశాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు పురోహిత్, ప్రజ్ఞాసింగ్ ఠాకూర్.

ఫిబ్రవరి 1, 2011:

ప్రవీణ్ ముతాలిక్ అనే వ్యక్తి అరెస్టు. 12కు చేరుకున్న నిందితుల సంఖ్య.

ఏప్రిల్ 13, 2011:

కేసును చేపట్టిన జాతీయ దర్యాప్తు ఏజెన్సీ – ఎన్ఐఏ.

ఫిబ్రవరి, డిసెంబర్, 2012:

లోకేశ్ శర్మ, ధన్‌సింగ్ చౌదరి అనే ఇద్దరు వ్యక్తులు అరెస్టు. 14కు చేరుకున్న నిందితుల సంఖ్య.

ఏప్రిల్, 2015:

నిందితులకు ఎంసీవోసీఏ వర్తింపు అంశంపై సుప్రీంకోర్టు నుంచి ప్రత్యేక కోర్టుకు తిరిగివచ్చిన కేసు.

ఫిబ్రవరి, 2016:

కేసుకు ఎంసీవోసీఏ వర్తిస్తుందా లేదా అనే అంశంపై అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని తీసుకున్నట్టు ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ వెల్లడి.

మే 13, 2016:

ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ చార్జ్ షీటు నమోదు. కేసు నుంచి ఎంసీవోసీఏ తొలగింపు. ఏడుగురు నిందితులకు క్లీన్‌చిట్.

ఏప్రిల్ 25, 2017:

ప్రజ్ఞా ఠాకూర్‌కు బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు. పురోహిత్‌కు బెయిల్ నిరాకరణ.

సెప్టెంబర్ 21, 2017:

పురోహిత్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు. సంవత్సరాంతానికి అరెస్టయిన నిందితులందరికీ బెయిల్ మంజూరు.

డిసెంబర్ 27, 2017:

కేసు నుంచి నిందితులు కాల్‌సంగ్ర, శ్యామ్ సాహూ, ప్రవీణ్ ముతాలిక్‌కు విముక్తి.

అక్టోబర్ 30, 2018:

ఏడుగురు నిందితులు ఠాకూర్, పురోహిత్, రమేశ్ ఉపాధ్యాయ, సమీర్ కులకర్ణి, అజయ్ రహీర్‌కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ త్రివేదిలపై అభియోగాలు నమోదు.

డిసెంబర్ 3, 2018:

కేసులో మొదటి సాక్షిని ప్రశ్నించడంతో విచారణ మొదలు.

సెప్టెంబర్ 14, 2023:

323 మంది ప్రాసిక్యూషన్ సాక్షులను ప్రశ్నించిన తర్వాత ఆధారాల సేకరణ నిలిపివేతకు ప్రాసిక్యూషన్ నిర్ణయం.

జూలై 23, 2024:

డిఫెన్స్ తరఫున ఎనిమిది మంది సాక్షుల విచారణ పూర్తి.

ఆగస్టు 12, 2024:

ప్రత్యేక కోర్టులో నిందితుల తుది స్టేట్‌మెంట్లు నమోదు. తుది వాదనలకు కేసు వాయిదా.

ఏప్రిల్ 19, 2025:

ప్రత్యేక కోర్టులో ముగిసిన వాదనలు. తీర్పునకు సన్నాహాలు.

జూలై 31, 2025:

ఏడుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ప్రత్యేక ఎన్ఐఏ జడ్జీ ఏకే లహోటి తీర్పు.

– జాగృతి డెస్క్



ఉరికంబం నుంచి

భారతదేశాన్ని రెండు శతాబ్దాలకు పైగా పాలించినా, ఇంగ్లిష్ వారి ఆధిపత్యానికి ఎప్పుడూ సవాళ్లే. 19వ శతాబ్దం మధ్యకాలం నుండే ఆ పరిపాలనపై తిరుగుబాటు జ్వాలలు రేగటం కన్పిస్తుంది. అహింసాయుత పోరాటంతోనే స్వాతంత్ర్యం రాదని, సాయుధ పోరాటమే మార్గమని ఎందరో యువకులు ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడారు. చంద్రశేఖర ఆజాద్, రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లాఖాన్, భగవతీ చరణ్‌వోహ్రా, భగత్‌సింగ్, రాజ్‌గురు, బటుకేశ్వర్‌దత్ వంటి ఎందరో క్రియాశీలక పాత్రను పోషించి తమ ప్రాణాలను అర్పించారు. వారిలో రామప్రసాద్ బిస్మిల్ అతని మిత్రులది ప్రత్యేక స్థానం.

బిస్మిల్ ఇలా అంటారు.

"చింతలేదు మా గురించి మాకు, బాధ పడతాం భారతమాత విపత్తులు తలుచుకున్నప్పుడల్లా

దేశ స్వాతంత్ర్య ఘడియలు ఎప్పుడు చూచేది మేమిక/జాతి దుస్థితి మాటిమాటికి కలతపెడుతున్నది మమ్ముల/మా మనుగడలను మట్టిలో కలిపేందుకే ఇక ఎదురుచూస్తాం."

పండిత్ రామ్‌ప్రసాద్ బిస్మిల్ (బిస్మిల్-కలం పేరు) వంటి విప్లవవీరుల త్యాగం మరువరానిది. ఈ రోజు విప్లవ వీరుల త్యాగాలను స్మరించుకునే వారు తగ్గినా, కాలం మీద వారి ప్రభావం తగ్గదు. స్వతంత్ర భారతం, ఈ నేలలోని ప్రతీ రేణువు పండిత్ రాంప్రసాద్ బిస్మిల్‌కు, అతని తోటి విప్లవ కారులకు ఎప్పటికి రుణపడి ఉంటుంది.

ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసింది. ఆ అంతిమ క్షణాలకు ముందు రాసిన కవిత సారాంశం. **'ప్రభూ నీ చిత్తం నెరవేరాలి నువ్వు అద్వితీయుడివి / (భరతమాత) నీ కన్నీళ్లు నేను కూడా భరించలేను / నా చివరిశ్వాసవరకు నా చివరి రక్తపుబొట్టు వరకు నేను నిన్ను / తలచుకుని నీ సేవలో మునిగి పోయేలా నాకు వరం ప్రసాదించు'**. ఎందుకు ఉరిశిక్ష పడింది? సరిగ్గా వందేళ్ల నాటి కాకోరి రైలు దోపిడీ కేసుతోనే.

కాకోరి (ఉత్తరప్రదేశ్) లక్నోకు 10 మైళ్ల దూరంలో ఉంది. ఆ ప్రాంతంలో రైల్వేలకు వచ్చిన మొత్తం ఆదాయాన్ని లక్నో స్టేషన్‌లో జమ చేసేవారు. కాబట్టి లక్నో ముందు గల కాకోరి పట్టణంలో రాంప్రసాద్ బిస్మిల్, 10 మంది విప్లవ కార్యకర్తల బృందానికి నాయకుడుగా ఆగస్టు 9, 1925న ఆ రైలును దోపిడీ చేశారు. వీరంతా హిందూస్థాన్ రిపబ్లికన్ అసోషియేషన్ (హెచ్‌ఆర్ఎ) సభ్యులు. సాయుధ తిరుగుబాటుతో భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుండి విముక్తి చేయడానికి అంకితమైన దేశభక్తి సంస్థ. కానీ ఈ కేసులో పట్టుబడ్డ వారు అష్ఫఖుల్లా ఖాన్, రాజేంద్రనాద్ లాహిరి, చంద్రశేఖర్ ఆజాద్, మన్మథ్‌నాథ్ గుప్త, శచీంద్రనాథ్ బక్షి, మురారీలాల్, కేశవ చక్రవర్తి, బన్వారీలాల్, ముకుందీలాల్. వీరిలో ముగ్గురికి మరణశిక్ష, ఒకరికి జీవిత ఖైదు విధించారు. ఈ నలుగురిని రక్షించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. అయితే బ్రిటిష్ వైశ్రాయి వీరి పిటిషన్‌ను తిరస్కరించగా, డిసెంబరు 19,1927లో ఉరి తీశారు. ముగ్గురు సహచరులు ఇలా పాడుతూ ఉరికంబం వైపు నడక సాగించారు.

దిల్ సే నికలేగీ న మర్ కర్ భీ వతన్‌కి ఉల్ఫతే / మేరీ మిట్టీ సే భీ ఖుశ్‌బూ- ఎ-వతన్ ఆయేగీ

(మరణించిన తరువాత కూడా హృదయం నుండి దేశప్రేమ బయటకు పోదు, నా మట్టి కూడా దేశపు సువాసనతో గుబాళిస్తూనే ఉంటుంది). ఈ విప్లవ వీరులు రాసిన లేఖలు వారి జ్ఞాపకాలుగా మిగిలాయి (వాటి అనువాదాలు వచ్చాయి). రామ్‌ప్రసాద్ బిస్మిల్ సెప్టెంబరు 13, 1925న మీరట్‌లో అనాథ శరణాలయంలో సమావేశం కావాలంటూ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు, జిల్లా సంఘ కార్యకర్తలకు రాశాడు.

ప్రియ మిత్రమా,

మేము క్షేమము, మా పితామహుని శ్రాద్ధకర్మ ఈ నెల 13వ తేదీన (ఆదివారం) జరగనున్నట్లు మీకు బహుశ తెలిసే ఉంటుంది. మీరు తప్పక హాజరు కావాలి. నిర్ణయించిన సమయానికి వచ్చి మమ్ములను కృతార్థులను చేయవలసినదిగా ప్రార్థన.

ఇట్లు

మీ రుద్ర

(రుద్ర, మహేంత్, ఆనంద్, ప్రకాశ్, పరమ హంస్- రామ్‌ప్రసాద్ బిస్మిల్ మారుపేర్లు).

గమనిక: దయచేసి ఈ నెల 11వ తేదీన ఢిల్లీకి బయలుదేరండి. అక్కడ నుండి మీకు సులువుగా బండి దొరుకుతుంది. కౌన్సిల్ నిర్ణయం ప్రకారం పెద్ద నగరాల్లోని పోస్టు ఆఫీసులు దోచుకోవాలి. అయితే అది జరక్కముందే సెప్టెంబరు 26 రాత్రి కలకత్తా, ఢిల్లీల మధ్య సుమారు 36 మంది అరెస్టు అయ్యారు.

కాకోరి కేసులో రామ్‌ప్రసాద్ బిస్మిల్‌కు మరణ దండన విధించినప్పుడు భగత్‌సింగ్ ఇలా రాశాడు.

"చూడడానికి కూడా చాలా అందంగా ఉండే వాడు. ఎంతో యోగ్యుడు. బాగా ఎరిగినవారు అనేదే మిటంటే మరో ప్రాంతంలో లేదా మరో దేశంలో పుట్టి ఉంటే ఆయన సైన్యాధిపతి అయి ఉండేవాడని. ఈ ఆ కుట్రకంతటికి నాయకుడుగా భావించబడ్డాడు. ఎక్కువగా చదువుకున్నవారు కాకపోయినా, పండిట్ జగత్ నారాయణ (క్రిమినల్ లాయర్) లాంటి వాడిని కూడా తికమక పెట్టేవాడు. చీఫ్ కోర్టులో తన అపీల్ తానే రాసుకున్నాడు. ఇది చూసిన జడ్జీలు, ఎంతో తెలివితేటలు, యోగ్యత గలవారు తప్ప ఇతరులు ఇది రాయలేరని అనవలసి వచ్చింది".

రామ్‌ప్రసాద్‌ను ఉరి తీయడానికి ఒకరోజు ముందు (డిసెంబరు 18, 1927)న తల్లి చివరిచూపు కోసం వెళ్లింది. ఆమెని చూశాక ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. కానీ ఆ మాతృమూర్తి ఉరికొయ్యకు


బిస్మిల్

వేలాడబోతున్న కొడుక్కి ధైర్యం చెప్పింది. హరిశ్చంద్రుడిని, దధీచిని గుర్తు చేసుకొమ్మన్నది. దానికి సమాధానంగా, "నేను మృత్యువుకు భయపడను, విచారం, పశ్చాత్తాపం నాలో లేవు, ఎందుకంటే నేను ఏ పాపం చేయలేదు కనుక. కాని అగ్నికి సమీపంలో ఉన్నప్పుడు వెన్న కరుగుతుంది. తప్పదు నీకు నాకు మధ్య బంధమే అలాంటిది. చూడగానే నీళ్లు తిరిగాయి" అన్నారు రామ్‌ప్రసాద్.

చివరి కోరిక ఏమిటని అడగ్గా, 'బ్రిటిష్

సామ్రాజ్యం పతనం' నా ఆఖరి కోరికని చెప్పాడు. 1928 జనవరిలో భగత్‌సింగ్ కాకోరీ మృత వీరుల గురించి 'కీర్తి' అనే పత్రికకు విద్రోహి అనే పేరుతో వ్యాసం రాశాడు దానిలో బిస్మిల్ రాసిన లేఖను ఉటంకించాడు.

'నేను చాలా సంతోషంగా ఉన్నాను. 19వ తేదీ ఉదయం ఏమి జరగబోతుందో దానికి తయారుగా ఉన్నాను. దేవుడు తగినంత శక్తినిస్తాడు. ప్రజలకు సేవ చేయడానికి త్వరలోనే మళ్లీ జన్మిస్తాననే నమ్మకం నాకుంది. అందరికి నా నమస్కారాలు తెలుపు. దయచేసి మరో పనికూడా చెయ్యి. పండిట్ జగత్ నారాయణ (బిస్మిల్‌కు ఉరిశిక్ష పడటానికి కారకుడు)కు నా ఆఖరి నమస్కారం తెలియచేయి. మన రక్తంతో తడిసిన రూపాయలతో ఆయనకు సుఖనిద్ర వచ్చుగాక. వృద్ధుడయిన ఆయనకు దేవుడు సద్బుద్ధినిచ్చుగాక'.

బిస్మిల్ రాసిన 'నా జీవన మేఘామాల' అనే వ్యాసం గోరక్‌పూర్ నుండి వెలువడే 'స్వదేశీ' పత్రికలో

ఉత్తరాలు

అష్ఫఖుల్లా ఖాన్

అచ్చయింది, దానిలోని ముఖ్య విషయాలు.

బిస్మిల్‌ను ఉరి తీయడానికి 19వ తేదీ (డిసెంబర్ 1927) ఉదయం ఆరుగంటల ముప్పయి నిమిషాల సమయం నిర్ణయమైంది. అందులో విచారించాల్సిందేమీ లేదు. దేవుని దయతో నేను మాటిమాటికి జన్మనెత్తుతూ ఉంటాను. దీనిలో నా ఉద్దేశం ప్రపంచంలో పూర్తి స్వాతంత్ర్యం నెలకొని ఉండటానికి ప్రకృతి సంపదలపై అందరికీ సమాన హక్కు ఉండటానికి ఎవరూ ఇతరులపై పెత్తనం చేయ కుండా ఉండటానికి అన్నిచోట్ల ప్రజలు పంచాయితీ రాజ్యం ఏర్పాటు చేసుకోవడానికి పాటు పడటమే... కోర్టులో మరణ దండన నిందితులు తరుపున అపీలు చేశారు. అయితే దీనికన్నా ముందే గవర్నర్‌కు అర్జీ పంపారు. కానీ జడ్జీలు వీటిని పట్టించుకోలేదు, పైగా 'రామ్‌ప్రసాద్ చాలా ప్రమాదకరమైన విప్లవవాది అని, విడుదల అయితే మళ్లీ అదే పని చేస్తాడని' అన్నారు.

పండిట్ మదన్‌మోహన్ మాలవ్యా కొందరు పెద్దలను తీసుకుని వైస్రాయిని కలిశారు. కానీ ప్రయోజనం లేదు. ఉరికి తేదీ ఖరారైంది. ఆ టెలిగ్రాంను రామ్‌ప్రసాద్‌కు చదివి వినిపించారు, అధికారులు. దానికి సమాధానంగా ఇలా అన్నాడు. 'సరే, మీ పని మీరు చేయండి!' శ్రేయోభిలాషుల ఒత్తిడితో క్షమాభిక్ష కోరుతూ చక్రవర్తికి, ప్రీవీ కౌన్సిల్‌కు, వైస్రాయికి ఒక టెలిగ్రాం పంపాడు. ఫలితం, ముందు అనుకున్నదే. అప్పీలు కొట్టివేశారు.

కాకోరీ విచారణ ఒకటిన్నర సంవత్సరం జరిగింది. ప్రభుత్వం తరుపున 300 మంది సాక్షులు హాజరయ్యారు. 'ఈ రోజు ప్రాణాలు అర్పిస్తున్నప్పుడు అవి వృథా అయ్యాయనే నిరాశ నాకు కలగలేదు. త్యాగాలు ఎప్పుడూ వృథా పోవు. మా వంటి వారి చల్లని విశ్వాసాల పరిణామం గానే లార్డ్ బుర్కిన్ హెడ్ బుర్రలో భారతీయుల సంకెళ్లను మరింత బిగించాలనే ఆలోచన రావడం, దానివల్ల రాయల్ కమిషన్‌ను పంపడం, దాన్ని బహిష్కరించేందుకు హిందువులు, ముస్లిమ్‌లలో మళ్లీ ఐకమత్యం ఏర్పడుతూ ఉండటం, ఇవన్నీ జరిగాయేమో? ఎవరు చెప్పగలరు? దేవుని దయవలన వీళ్లకు త్వరగా సద్బుద్ధి కలిగి అందరూ ఒక్కటయితే బాగుంటుంది.' బిస్మిల్ ఇలా రాశాడు.

"నొప్పి తెలిసిన వారినడుగు - ఆపదల తీపేమిటో! / ప్రాణాలర్పించే వారినడుగు - ఆత్మాహుతి వలన సుఖమేమిటో!

నిరీక్షించే కళ్లనడుగు - దర్శినాభిలాష ఎట్టిదో!

కాలి నశించే మిడతనడుగు - తాపమంటే ఏమిటో!

కాకోరీ కుట్ర కేసులో రామ్‌ప్రసాద్ బిస్మిల్ ముఖ్య అనుచరుడు రాజేంద్రనాథ్ లాహిరీ. ఈయన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ. విద్యార్థి. ఆయనకూ 'ఉరి' ఖాయమైంది. క్షమాభిక్షనూ తిరస్కరించారు. శిక్ష అమలుకు ముందు తన అన్నకు ఉత్తరం రాశాడు. ఆ లేఖ–

ప్రియమైన అన్నయ్యకు!

నా క్షమాభిక్ష పత్రాన్ని వైస్రాయ్ తిరస్కరించాడని సూపరింటెండ్ ఈ రోజు చెప్పాడు. జైలు నియమాల ప్రకారం నన్ను ఒక వారం రోజుల్లో ఉరి తీస్తారు. నీవు నాకోసం బాధపడనవసరం లేదు. ఎందుకంటే నేను నా పాత శరీరాన్ని వదిలి ఒక కొత్త జన్మ ఎత్తబోతున్నాను. నన్ను కలుసుకోవడానికి మీరు ఇక్కడకు రానవసరం లేదు. ఎందుచేతనంటే కొద్దిరోజుల క్రితమే మీరు నన్ను కలిసి వెళ్లారు. నేను లక్నోలో ఉన్నప్పుడు అక్క రెండుసార్లు వచ్చి కలుసుకుంది. అందరికీ నా నమస్కారాలు తెలపండి. పిల్లలకు నా ప్రేమాశీస్సులు.

మీ ప్రియమైన తమ్ముడు
రాజేంద్రనాథ్ లాహిరి

భగత్‌సింగ్‌ను లాహిరి బాగా ప్రభావితం చేశాడు. తన చివరి తమ్మునికి రాజేంద్ర అని పేరు పెట్టాడు. 1928 జనవరిలో 'కీర్తి' పత్రికలో 'విద్రోహి' పేరుతో రాసిన వ్యాసంలో, 'ఆయన (లాహిరి) బెనారస్ హిందూ యూనివర్శిటీలో ఎమ్.ఎ. విద్యార్థి. 1925లో కలకత్తా దగ్గర దక్షిణేశ్వర్‌లో బాంబులు తయారు చేసే కార్ఖానా పట్టుబడింది. అందులో ఈయన కూడా ఉన్నాడు. అప్పుడు ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అక్కడి నుండే ఈయన్ని లక్నోకు తీసుకువచ్చి కాకోరీ కేసులో ఉరిశిక్ష వేశారు. ఈయనను బారాబంకీ, గోండా జైళ్లలో ఉంచారు. ఈయన ఎదురుగా నిలిచిన మృత్యువును చూసి కూడా భయపడే వాడు కాదు. ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడు.'

లాహిరి అక్టోబరు 6, 1925 వ్రాసిన ఉత్తరంలో– 'నేను ఆరు నెలల కాలం బరాబంకీ, గోండాలలోని దట్టమైన చీకటికొట్లలో ఉన్న తరువాత వైస్రాయ్ నా (క్షమాభిక్ష) అర్జీని తిరస్కరించాడు. నన్ను ఒక

వారంలో ఉరి తీస్తారని ఈ రోజు నాకు చెప్పారు. ఇప్పుడు నాకోసం ఎన్నో ప్రయత్నాలు చేసిన మిత్రులకు (ఇక్కడ వారి పేర్లున్నాయి) కృతజ్ఞతలు తెలపడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. మీరు నా ఆఖరి నమస్కారాన్ని స్వీకరించండి. మాకు చావడం, వ్రతకడమనేది పాత బట్టలు మార్చుకోవడానికి మించి ఏమీ కాదు (ఇక్కడ జైలు అధికారులు కొన్ని మాటలు కొట్టి వేసినందువలన చదవడం ఎంతమాత్రం వీలు కావడం లేదు). మృత్యువు సమీపిస్తున్నది. నవ్వుతూ, నవ్వుతూ ఎంతో కోరికతో ఆపేక్షతో దాన్ని గాఢంగా ఆలింగనం చేసుకొంటాను. జైలు నిబంధనల ప్రకారం ఇంతకు మించి ఏమీ రాయలేను, మీకు నా నమస్కారాలు. దేశంలోని సానుభూతి పరులందరికి నా నమస్కారములు. వందేమాతరం.

మీ

రాజేంద్రనాథ్ లాహిరి

డిసెంబర్ 14న మిత్రునికి మరో ఉత్తరం రాశాడు.

"ప్రీవీ కౌన్సిల్ నా అప్లికేషన్ త్రోసిపుచ్చినట్లు నిన్ననే నాకు తెలిసింది. మీరందరు మమ్మల్ని రక్షించడానికి చాలా ప్రయత్నించారు. కానీ దేశపు బలిపీఠం మీద మా ప్రాణాలు బలి ఇవ్వడమే ఇప్పుడు జరగవలసిన పని అని నాకు అనిపిస్తుంది. మృత్యువు అంటే ఏమిటి? అది జీవితానికి రెండవ పార్శ్వమే తప్ప మరేమీకాదు. అలాంటప్పుడు భయపడాల్సిన పని ఏమిటి? ప్రాతఃకాలమున సూర్యుడు ఉదయించడం ఎంత సహజమైన సంఘటనో, ఇదీ అంతే సహజమైంది. చరిత్ర తారుమారు అవుతుంది అనే మా మాట నిజమైతే మా త్యాగం వృధా పోదని నేను భావిస్తాను.

నమస్కారం, అందరికి ఇదే నా ఆఖరి నమస్కారం.

మీ

రాజేంద్రనాథ్ లాహిరి

లాహిరిని రెండురోజులు ముందే ఉరి తీశారు. తన త్యాగం వృధా పోదనే లాహిరి నమ్మకం.

లాహిరికి అష్ఫఖుల్లా కుడి భుజం వంటివాడని ప్రభుత్వం నిర్ధారించింది. అష్ఫఖుల్లా ఆచారపరుడైన ముస్లిం, అయినా రామ్‌ప్రసాద్ లాంటి ఆచారపరుడైన ఆర్య సామాజీకునికి విప్లవంలో కుడిభుజం కాగలిగాడు. అందుకే దేశంలోని ఇతర హిందూ ముస్లింలు స్వాతంత్ర్యం కోసం తమ చిన్న చిన్న స్వార్థాలను మరచిపోలేరా అని ప్రశ్నించేవాడు. అష్ఫఖుల్లా స్వాతంత్ర్య సమరంలో ఉరి కంబం ఎక్కిన మొట్టమొదటి ముస్లిం.

లోకమంతా శత్రువయినా రండి, ఎదిరిద్దాం! పోరాడదాం! జీవించేది కొద్ది ఘడియలే! ప్రియసోదరా ఇక తెల్లవారినప్పటి దీపాన్ని, ఆరిపోబోతున్నాను. నా చుట్టూ గాలిలో వ్యాపించి ఉంటుంది. చింతనా విద్యుత్తు నశ్వరమో ఈ పిడికెడు మట్టి ఉన్ననేమి? లేకున్ననేమి? మరి సెలవు. దేశ సౌభాగ్యమా, సంతోషంగా ఉండు, ఇక ప్రయాణం సాగిస్తాం! ధైర్యంగా ఉండు, నమస్తే!

భగత్‌సింగ్

సోర్సు : జ్ఞాపకం చేసుకోండి ఎప్పుడైనా (అమరవీరుల ఉత్తరాలు)
పేజీ నెం. 22 టు 32, తొలిపలుకులు అనువాదం జె.లక్ష్మీరెడ్డి పేజీ.-132

డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

అన్నాద్భవంతి

సరళమైన, సహజమైన, ఇంకా- మూర్ఖుడైన మానవుడిని సైతం అసాధారణ, దైవికవ్యక్తిగా మార్చగల సామర్థ్యం భగవద్గీతకు ఉంది. వేల సంవత్సరాల క్రితం రాసిన ఈ పురాణభాగంలో నేటి జీవితానికి సంబంధించిన జ్ఞానం ఉంది. కృష్ణార్జునల మధ్య సంగ్రామభూమిలో జరిగిన తాత్విక సంభాషణకు శ్లోక రూపమిది. అయినా, 1890లలో ప్రారంభమైన ఆధునిక పర్యావరణశాస్త్రం లేదా పర్యావరణశాస్త్రాలు చెప్పే విషయాలు ఇందులో ఉన్నాయి.

దేవాన్భావయతానేన తే దేవా భావయంతు వః
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ 11

మీ యజ్ఞముల చేత దేవతలు ప్రీతి చెందుతారు. దేవతల, మనుషుల పరస్పర సహకారం వలన అందరికీ గొప్ప శ్రేయస్సు/సౌభాగ్యం కలుగుతుంది.

అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః 14

సమస్త జీవులు ఆహారం మీద ఆధారపడి జీవిస్తాయి. వర్షముల వలన ఆహారం ఉత్పన్నమవుతుంది. యజ్ఞాలు చేయటం వలన వానలు కురుస్తాయి. నిర్దేశించిన కర్తవ్యాల (విహితకర్మలు) ఆచరణ చేత యజ్ఞం జనిస్తుంది.

భూతాని...

శాస్త్రీయ వ్యాఖ్య

యజ్ఞం (సంస్కృతం: **यज्ञ** "ఆరాధన, ప్రార్థన, సమర్పణ, నైవేద్యం, అగ్ని వేడుక") అనేది పురాతన కాలం నుండి వస్తున్న హిందూ ఆచారం. దీనిలో మనిషి దేవతల మధ్య అగ్నిదేవుడు మాధ్యమంగా పనిచేస్తాడు. యజ్ఞం అగ్ని ముందు నిర్వహిస్తారు. రుషులు వేదమంత్రాలను జపిస్తారు. మానవులు భూమిపై తమ శ్రేయస్సును, మరణం తరువాత స్వర్గానికి సురక్షితమైన ప్రయాణాన్ని నిర్ధారించగల సాధనమే యజ్ఞం. వేద ప్రపంచంలో వైవాహిక విభేదాల నుండి పాము కాటు వరకు అన్ని మానవ సమస్యలకు యజ్ఞం రామబాణంగా ఉండేది. గీత ప్రకారం, యజ్ఞం అంటే ఒక ఆత్మను పరమాత్మలో కలవడం. యజ్ఞాన్నీ కేంద్ర బిందువు కలుషిత వాతావరణాన్ని నయం చేయడం. తద్వారా ఇది మానవులకు మేలు చేస్తుంది. యజ్ఞమే మొత్తం విశ్వాన్ని కలిపి ఉంచుతుందని రుగ్వేదం, యజుర్వేదం, అథర్వవేదాలు చెబుతున్నాయి. యజ్ఞం లోతైన సార్వత్రిక ప్రాముఖ్యం కలిగి ఉంటుంది. మొత్తం విశ్వమే యజ్ఞాలతో మెరుగు పడుతుంది. యజ్ఞంలో పాల్గొనే శిష్యులు కూడా గురుకృప ద్వారా యజ్ఞ ప్రయోజనం పొందుతారు.

పర్యావరణ కాలుష్యాన్ని పరిష్కరించడానికి యజ్ఞం ఉత్తమమార్గంగా ఛాందోగ్యోపనిషత్తు వర్ణించింది. యజ్ఞం మలినాలను తొలగిస్తుందనీ, కాలుష్యాన్ని నివారిస్తుందని, పర్యావరణాన్ని స్వచ్ఛపరుస్తుందని చెబుతారు. నెయ్యి, చక్కెర మిశ్రమాన్ని దగ్ధం చేయడం ఉత్పన్నమయ్యే పొగ కొన్ని వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మక్రిములను చంపుతుందని ప్రయోగాలు నిరూపించాయి. ఈ ఆవిరులు వాతావరణాన్ని శుద్ధి చేయగలవని, మేఘాలు ఏర్పడటానికి సహాయపడతాయని, క్లౌడ్ కండెన్సేషన్ నూక్లియే Cloud Condensation Nuclei] (CNNs)గా పనిచేయడం ద్వారా మంచి వర్షపాతాన్ని కలిగిస్తాయని కనుగొన్నారు. అందువల్ల యజ్ఞాలు నీటి చక్రాన్ని గణనీయంగా ప్రభావితం చేసి వర్షాన్నిస్తాయి. కలప, హవన-సామగ్రి సరైన ఎంపిక ద్వారా వివిధ శారీరక మానసిక వ్యాధులు, మానసిక రుగ్మతలకు నివారణగా కూడా యజ్ఞాన్ని ఉపయోగించవచ్చు. యజ్ఞం సాంకేతికత ద్వారా ఒకరి ఆలోచనలు, మాటలు చర్యలను మార్చగలరని, తద్వారా అతని లేదా ఆమె జీవితంలోని అన్ని అంశాలను ఆధ్యాత్మికం చేయగలరని కూడా నమ్ముతారు.

విజ్ఞానశాస్త్రంలో, జీవావరణ శాస్త్రం [Ecology] (గ్రీకు 'ఒయికోస్' అంటే ఇల్లు ; 'లోగోస్' అంటే నేర్చుకోవడం) అనేది జీవులు వాటి చుట్టూ ఉన్న పర్యావరణంతో ఎలా సంఘర్షిస్తాయన్న అంశం గురించిన అధ్యయనం. మరో మాటలో చెప్పాలంటే, జనాభాల జీవితాల గురించి తెలుసుకోవడం పర్యావరణ శాస్త్రంగా మారుతుంది. ఒక పర్యావరణ శాస్త్రవేత్త జీవులు, వాటి ఆవాసాలు/నివాస స్థలాల మధ్య సంబంధాన్ని అధ్యయనం చేస్తారు. జీవావరణ శాస్త్రం, బయోనామిక్స్, లేదా పర్యావరణ జీవశాస్త్రం అనేవి జీవావరణ శాస్త్రానికి పర్యాయపదాలు. పర్యావరణ శాస్త్రం ఒక కొత్త శాస్త్రం, జీవశాస్త్రంలో ఒక ముఖ్యమైన శాఖగా పరిగణిస్తారు. ఇది 20వ శతాబ్దం రెండవ భాగంలో ప్రాముఖ్యంలోకి వచ్చింది. 1890లలో అమెరికన్ వృక్షశాస్త్రజ్ఞుల బృందంతో పర్యావరణ శాస్త్రం ప్రారంభమైంది. అనుసరణ, సహజ ఎంపికకు సంబంధించిన పరిణామాత్మక భావనలు ఆధునిక పర్యావరణ సిద్ధాంతానికి మూలస్తంభాలు. పర్యావరణశాస్త్రం ఆహార ఉత్పత్తికి, స్వచ్ఛమైన గాలి, నీటిని నిర్వహించడానికీ మారుతున్న వాతావరణంలో ప్రజలు ప్రకృతి మధ్య పరస్పర ఆధారపడటం, జీవవైవిధ్యాన్ని కొనసాగించడం గురించి ముఖ్యమైన జ్ఞానాన్ని అందిస్తుంది. జీవుల యొక్క జీవ, అజీవ కారకాల వంపిణీని పర్యావరణంపై వాటి ప్రభావాన్ని అర్థం చేసుకోవడం జీవావరణశాస్త్ర ప్రధాన లక్ష్యం.

పారిశ్రామిక విప్లవం 1760-1840 మధ్య కాలంలో విస్తరించిందని, అదే సమయంలో జీవావరణ శాస్త్రం, పర్యావరణ సమస్యలపై దృష్టి 1890లలో ప్రారంభమైందని గమనించాలి. పెరుగుతున్న జనాభా అవసరాలు పర్యావరణం మానవులపై దాని ప్రభావాన్ని నిర్లక్ష్యం చేస్తూ సౌకర్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారించాయి. మనిషి కోసం పెరిగిపోతున్న ఈ సౌకర్యాల అన్వేషణ పర్యావరణ కాలుష్యానికి దారితీసింది. మానవులతో సంబంధం ఉన్న జీవ, అజీవ కారకాలపై ప్రభావం చూపింది.

ఆధునిక కాలంలో, ఆస్తికులు యజ్ఞాలు లేదా యాగాలు వర్షాన్ని ఉత్పత్తి చేస్తాయని నిరూపించాలను కుంటున్నారు. యజ్ఞాలు విషవాయువులను ఉత్పత్తి చేస్తాయని, పర్యావరణాన్ని కూడా కలుషితం చేస్తాయని నిరూపించడానికి నాస్తికులు కృషి చేస్తున్నారు. సహజ వనరులను విచక్షణారహితంగా దోపిడీ చేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా తగ్గిన వర్షపాతం, ప్రపంచ వ్యాప్తంగా ఊహించని కరవులు/వరదలకు మూల కారణం. దేవుళ్లను సంతోషపెట్టడానికి యజ్ఞాలు అని పిలుస్తున్న తంతును నిర్వహిస్తే సరిపోదు. వర్షాలకు అటవీ విస్తీర్ణం నిరంతర నీటి చక్రం వంటి ముందస్తు అవసరాలు కూడా చాలా అవసరం. ఈ కారకాలు లేకుండా, యజ్ఞాలు నిరుపయోగమవుతాయి. మహాభారత కాలంలో పర్యావరణ శాస్త్రాల వాటి ప్రాముఖ్యంను బాగా అర్థం చేసుకున్నారని, కురుక్షేత్ర యుద్ధానికి ముందు కృష్ణుడు గీత ద్వారా అర్జునుడికి చెప్పిన నత్యాలలో దీనిని కీలకంగా భావించాడని గమనించాలి.

డాక్టర్ చీనేపల్లి రవిశంకర
శాస్త్రవేత్త-D (రిటైర్డ్)
సెంట్రల్ సిల్క్ బోర్డ్, బెంగళూరు



కథ

"ఎవరా పక్కన కనబడుతున్నదీ – వంటింట్లో?'' అనుమానంగా అడిగాడు వేదాద్రి.

"క్రింది ఫ్లోర్ వాళ్లమ్మాయి, పరీక్ష."

"ఎందుకు వచ్చింది?"

"నేను ఫిల్టర్ కాఫీ బాగా పెడతానని వాళ్ల ఫీలింగ్. మనవైపు వాళ్లే అయినా, మొదటినుంచీ ఈ వైపునే స్థిరపడిపోయారుట. అందుకే వాళ్లకి టీ తప్ప కాఫీ అంతబాగా కుదరదు. నిన్ననే వాళ్ల అమ్మ, నేను ఫిల్టర్ కాఫీ ఎలా పెడతానో వివరంగా చెప్పించుకుని వెళ్లింది. పెడుతున్నప్పుడు స్వయంగా చూస్తాననీ, నేర్చుకుంటాననీ ఈ పిల్ల అంటుంటే, ఈ పూట నేనే పిల్చాను."

"అనుకున్నాను ఇలాంటిదే ఏదో ఉందని. అమ్మా! ఎన్నిసార్లు చెప్పాను నీకు ఎవరితోనూ పరిచయాలు పెట్టుకోవద్దని."

మౌనంగా ఉండిపోయింది విద్యాధరి.

"వాడెక్కడ?"

భద్రి గురించి అడుగుతున్నాడని తెలుసు. రెండు క్షణాల గ్యాప్ తరవాత నెమ్మదిగా చెప్పింది,

"అక్కడే ఉన్నాడు – వంటింట్లో. కాఫీ కలపటం చూస్తున్నాడు."

"అక్కడకదొక బ్రహ్మవిద్య– నువ్వు నేర్పుతున్నావు– ఆమె నేర్చుకుంటోంది– వీడు చూస్తున్నాడు!

బాగుందమ్మా, చాలా బాగుంది. అసలే వీడొక క్రాక్. తెలిసో, తెలియకో ఆ అమ్మాయితో ఏమైనా మిస్ బిహేవ్ చేస్తే మన ప్రాణాల మీదకు వస్తుంది!"

"అదేం మాటరా? ఈ పిచ్చి సన్యాసికి మిస్ బిహేవ్ చేయటం ఏం తెలుస్తుంది?" కోపంగా అడిగింది విద్యాధరి.

"పిచ్చి సన్యాసి అని వాడి వయసుకి తెలియదు కదా." చిరాగ్గా చెప్పాడు వేదాద్రి.

విద్యాధరికి మండింది, "చాల్లే, ఊరుకో. తమ్ముడి గురించి ఇలాగేనా మాట్లాడేది?" అంటూ అరిచింది, పరీక్ష అక్కడే ఉందన్న విషయం కూడా మర్చిపోతూ.

"అమ్మా, నీకు అర్థం కావటం లేదు. ఆఖరిసారి చెప్తున్నాను. ఇరుగు పొరుగులతో పరిచయాలు మానుకో."

వీడియో కాల్ ఆగిపోయింది. ప్రయోజకుడైన పెద్దకొడుకు, కనిపిస్తూ మాట్లాడాడన్న సంతోషం కరిగిపోగా గాయపడ్డ మనసుతో కూర్చుండిపోయింది విద్యాధరి.

అతడు ప్రతిసారీ వీడియో కాల్ మాత్రమే చేస్తాడు. 'అది తనని ప్రత్యక్షంగా చూడటం కోసం కాక, వీడియో అయితే ఇంటినీ, తనున్న పరిసరాలనీ శల్య పరీక్ష చేయవచ్చు అనేనా?' అనిపిస్తోంది ఆమెకీమధ్య.

విద్యాధరి మొహంలో మారిపోయిన రంగులు, గొంతులో జారిపోయిన ఉత్సాహం గమనించింది పరీక్ష.

తల్లీకొడుకుల సంభాషణ ప్రతి మాటా వినబడక పోయినా, వినబడినంత మేర సారాంశం ఊహించుకోగలిగింది.

'కారణం తెలియక పోయినా, తాము ఇక్కడికి రావటం అతడికి ఇష్టం లేదు' అనుకుంది. ముఖం చిన్నబుచ్చుకుని, "వెళ్తున్నాను ఆంటీ" అనేసి, సమాధానం కోసం ఎదురు చూడకుండా బయటికి నడిచింది.

"ఎందుకు? ఎందుకు?" అంటూ తల్లి ముఖంలోకి వెర్రి చూపులు చూస్తున్న భద్రిని దగ్గరకు తీసుకుని కళ్ల నీళ్లు పెట్టుకుంది విద్యాధరి.

* * *

మూడు నెలలు కావస్తోంది విద్యాధరి, చిన్నకొడుకుతో ఆ ఫ్లాట్ లోకి వచ్చి.

బ్యాంక్ ఉద్యోగంలో ఉన్న పెద్దకొడుకు వేదాద్రి ఆగమేఘాలమీద కొన్నాడు ఆ సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్.

మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి ముంబై వచ్చిన వేదాద్రికి అకస్మాత్తుగా గౌహతికి బదిలీ అయింది.

"ఇప్పుడు మిమ్మల్ని తీసుకుని ఆ రాష్ట్రానికి వెళ్తే, అక్కడి వాతావరణానికి అడ్జస్ట్ కావటం కష్టం. నేను ఎలాగో అలా ప్రయత్నించి, ఒక ఏడాది తిరగ్గానే మళ్లీ ముంబైలోనే ఏ సబర్బ్‌కో వేయించుకుంటాను. అంతదాకా నువ్వూ, తమ్ముడూ ఇక్కడే ఉంటే బాగుంటుంది." అని చెప్పాడు తల్లితో.

యాభయ్యవ పడిలో ఉన్న తల్లినీ, మానసిక ఆరోగ్యం సరిలేని తమ్ముడినీ ఉంచటానికి ఇల్లు అద్దెకి దొరకటం అంత తేలిక కాదు. అందుకే, కొద్దిగా ఇబ్బంది అయినా బ్యాంక్‌లోన్ తీసుకుని ఈ పాత ఫ్లాట్ కొన్నాడు. తల్లినీ, తమ్ముడినీ అక్కడికి తరలించాడు.

"నీకు ముంబై సంగతి అంతగా తెలియదు. ఇన్నాళ్లు నేనున్నాను గనుక సరిపోయింది. ఇప్పుడు నువ్వొక్కదానివే, మతిలేని తమ్ముడితో... ఎంతో జాగ్రత్తగా ఉండాలి.



తొలి అడుగులు

పి.వి.ఆర్. శివకుమార్

ఎవరితోనూ పరిచయాలు చేసుకోవద్దు. ఇది మన బెదురుపల్లి కాదు– అక్కడిలాగా ఇక్కడ 'ఇరుగు పొరుగు' అంటూ చుట్టుపక్కల అందరితో అక్కరలేని కబుర్లూ, సహాయాలూ మొదలుపెట్టకు.

ఇక్కడ అందరూ ఆర్థికంగానే కనిపిస్తున్నారు.

ముంబైలో కోట్ల జనాభా 'ఎవరికెవరం' అన్నట్టే ఉంటారు తప్ప, ఎవరి విషయంలోనూ మరొకరు తల దూర్చరు. కానీ, మనం మెతకగా కనబడితే నిలువునా ముంచెయ్యటానికి వెనుదీయనివాళ్లూ ఉంటారు. అందుకే, నీకేం కావాలన్నా, నాకు ఫోన్ చేస్తే చాలు. నేనే చూసుకుంటాను–అక్కడినుంచే! వీడికి అసలే అయోమయం. ఆ సంగతి ఎంత తక్కువ మందికి తెలిస్తే, అంత క్షేమం." సవాలక్ష జాగ్రత్తలు చెప్పి, గౌహతి వెళ్లిపోయాడు వేదాద్రి.

తమ ఫ్లోర్‌లోనే ఆరు కుటుంబాలు ఉన్నాయి. వేదాద్రి చెప్పినట్టు ఎవరింట్లో ఎవరున్నారో తెలియదు. తెల్లవారక ముందే లేచి, ఎవరి పనుల మీద వాళ్లు వెళ్లిపోతూ ఉంటారు. ఏ వేళల్లో వస్తారో గమనించే తీరిక, ఆసక్తి కూడా ఎవరికి ఉన్నట్టు కనిపించదు. ఏ లిఫ్ట్‌లోనో కనిపిస్తే, 'హలో' అనేసి మొహం తిప్పుకునే వాళ్లు కొద్దిమంది. అదీ లేనివాళ్లు ఎక్కువ మంది.

తనకి వచ్చిన కొద్దిపాటి హిందీ పరిజ్ఞానంతోనైనా, ఎవరితోనూ మాట్లాడటానికి లేదు. ఎవరైనా పొరబాటున చిరునవ్వుతో చూసినా, ప్రతిగా నవ్వబోయేసరికి వేదాద్రి కళ్లముందు నిలబడి హూంకరిస్తాడు. నోరు మూగబోతుంది.

ఒకరోజు సాయంత్రం అనుకోకుండా పరిచయం అయింది పరీక్ష.

ఆ సాయంత్రం, కాంపౌండ్‌లో ఉన్న చిన్న గార్డెన్‌లో కొడుకుతో కలిసి కూర్చుని ఉంది విద్యాధరి.

అప్పటిదాకా బెంచ్ మీదే కూర్చున్న భద్రి, ఉన్నట్టుండి నేల మీదకు దిగిపోయి, అక్కడి మట్టిని ముద్దగా చేసి, పక్కనున్న పూల మొక్కమీదికి విసిరేశాడు. 'తప్పు భద్రీ! మట్టితో ఆడకు' అంటూ కొడుకుని లేవదీసింది విద్యాధరి.

"పువ్వులని కుడుతోంది పురుగు. అందుకే దాన్ని కొడుతున్నా." అన్నాడు భద్రి.

అటుకేసి చూసింది విద్యాధరి. పూలమీద వాలిన తుమ్మెదలు ఎగిరిపోతూ కనిపించాయి.

"మీరు తెలుగు వాళ్లా ఆంటీ?"

సంభ్రమంగా వినిపించిన గొంతు! అటు తిరిగిన విద్యాధరికి నవ్వుతూ నిలబడ్డ పరీక్ష కనిపించింది,

"మేమూ తెలుగువాళ్లమే. సెకండ్‌ఫ్లోర్‌లో ఉంటాం. మీరు?" చొరవగా అడిగింది.

జవాబు చెప్పకుండా ఉండలేకపోయింది విద్యాధరి.

"మేము నాలుగోఫ్లోర్‌లో ఉంటాం." ఫ్లాట్ నంబర్ చెప్పింది.

"మా నాన్నగారు శంకర్రావు. కాంట్రాక్ట్ పనులు చేస్తూ ఉంటారు. అక్కకి పెళ్లయింది. అక్క, బావ కళ్యాణ్‌లో ఉంటారు." గడగడ చెప్పింది పరీక్ష.

"తీరినప్పుడు అమ్మని తీసుకుని మా ఇంటికి రా"

ఆమె కలుపుగోలు మాట తీరుకి లొంగిపోయిన విద్యాధరి ఆ మాట అనకుండా ఉండలేకపోయింది. ఎడారిలో తిరుగుతున్న వ్యక్తికి ఒయాసిస్ కనిపించినట్టు అనిపించి, ఆ నిమిషంలో పెద్ద కొడుకు గుర్తుకి రాలేదు.

నెమ్మదిగా రెండిళ్ల మధ్య రాకపోకలు మొదలయ్యాయి. ఈ విషయం వేదాద్రికి తెలియకుండా జాగ్రత్త పడింది విద్యాధరి. అయితే అనుకోకుండా ఈ రోజు అతడు సాయంత్రం వేళ విడియో కాల్ చేయటం, ఆ సమయంలో వంటింట్లో ఉన్న పరీక్ష అతడి కంట పడింది.

తల్లి అన్న గౌరవం కూడా లేకుండా దురుసుగా వేదాద్రి విధించిన ఆంక్ష కంటే, విషయం పరీక్షకి అర్థమై, ఆమె మొహం చిన్నబుచ్చుకు వెళ్లిపోవటం విద్యాధరికి మరింత అవమానకరంగా తోచింది.

దానికి తోడు భద్రి గురించి అతడన్న మాటలు మనసుని మరీ మెలిపెట్టాయి.

'ఇంత మేధకుడు అయినా, వీడికి వయసు తెలుస్తుందా? చెప్పుకోలేని బాధతో ఇకముందు మరింత నలిగిపోనున్నాడా?'

ఈ సంఘటనతో, ఆలోచనలతో ఆమె మనసు అతలాకుతలమైంది. నిస్త్రాణగా వెళ్లి మంచంపై కూలిపోయింది.

* * *

మర్నాడు పొద్దునే తను స్వయంగా కాచిన కాఫీ ఫ్లాస్క్‌ నిండుగా పోసి, పరీక్షను పిలిచింది స్నేహమయి.

"ఈ కాఫీ తీసుకెళ్లి ఆంటీకి ఇచ్చిరా. తాగిచూసి ఎలా ఉందో చెప్పమను."

"నేను వెళ్లను" ముభావంగా చెప్పింది పరీక్ష.

"ఏమయిందే? ఎందుకు వెళ్లవు?" విస్మయంగా అడిగింది స్నేహమయి.

విద్యాధరి ఇంట్లో నిన్న తను విన్న ఫోన్ సంభాషణ గురించి తల్లికి చెప్పలేదు పరీక్ష– ఆమె బాధపడుతుందని. ఇప్పుడు వెళ్లనని మొండికేస్తే, కారణం చెప్పాల్సి వస్తుంది.

అందుకే, "సరే. ఇచ్చి వస్తాను." అనేసి ఫ్లాస్క్ తీసుకుని బలవంతాన బయల్దేరింది.

కాలింగ్ బెల్ చప్పుడుకి ఎప్పటిలాగే విద్యాధరి రాలేదు, భద్రి వచ్చాడు. ఆమె వంక అభావంగా

చూశాడు.

"ఆంటీని పిలు" అంది పరీక్ష.

"నిద్దరపోతోంది" చెప్పాడు.

"ఇంకానా?" ఆశ్చర్యంగా అడిగింది పరీక్ష. అప్పుడు ఎనిమిది కావస్తోంది.

"ఇంకానూ." అన్నాడు భద్రి. పరీక్షకి ఏమనాలో తోచలేదు.

చేతిలోని ఫ్లాస్క్ అతడికి అందించింది.

"కాఫీ... మా అమ్మ పెట్టింది. తాగి చూసి, కుదిరిందో లేదో చెప్పమంది. నువ్వు కూడా తాగు."

"తాగుతాను." భద్రి ఫ్లాస్క్ అందుకుని, తల ఊపాడు.

వెనక్కి తిరిగి వచ్చేసింది పరీక్ష.

మధ్యాహ్నం భోజనాలు అయ్యాక, అలవాటు ప్రకారం కునుకు తీసి లేచిన స్నేహమయి, నాలుగు దాటుతుండగా పై అంతస్తుకి బయల్దేరింది. బెల్ విని వచ్చి భద్రి తలుపు తీశాడు.

"అమ్మ ఏం చేస్తోంది?" అని అడుగుతూనే లోపలికి వెళ్లింది.

"నిద్దరపోతోంది." చెప్పాడు భద్రి.

"ఇప్పుడేం నిద్ర? మీ అమ్మ మధ్యాహ్నం పడుకోదుగా?"

"పడుకోదు."

"మరి? నిద్రపోతోందన్నావు?"

"రాత్రి నిద్దర పోయింది. పొద్దున లేవలేదుగా."

"పొద్దుటినుంచీ లేవలేదా? పొద్దుటి నుంచీ మీరు టిఫిన్, భోజనాలు ఏమీ చేయలేదా?" అయోమయంగా అడిగింది.

"ఎలా? అమ్మ ఇంకా లేవలేదుగా!" చెప్పాడు భద్రి.

బిత్తరపోయింది స్నేహమయి. గబగబా పడక గదిలోకి వెళ్లింది.

నిస్తేజంగా పడుకుని ఉంది విద్యాధరి. ఆమె పక్కనే కప్పులో చల్లారిపోయిన కాఫీ!

"నేనే పెట్టాను. లేచినప్పుడు తాగుతుంది." చెప్పాడు భద్రి.

విద్యాధరి నుదుటిమీద చేయి వేసింది స్నేహమయి. విద్యాధరిలో కదలిక లేదు.

"విద్యా... విద్య గారూ" పిలిచింది. జవాబు లేదు.

కంగారుగా బయటకు నడిచిందామె. రెండేసి మెట్లు చొప్పున దిగుతూ ఇంటికి పరుగెత్తింది. పరీక్షకి విషయం చెప్పి, మళ్లీ విద్యాధరి దగ్గరకి పరుగెత్తింది. పరీక్ష వెంటనే అంబులెన్స్‌కి ఫోన్ చేసింది. ఆంబులెన్స్ రావటంతోనే విద్యాధరిని అంబులెన్స్‌లోకి చేర్చారు.

విషయం అర్థంకాని పరిస్థితిలో భద్రి, "ఎందుకు? ఎక్కడికి?" అంటున్నాడు. వాడికి ఎవరూ జవాబు చెప్పలేదు. తమతో పాటు హాస్పిటల్‌కి తీసుకు వెళ్లారు.

అప్పటికే తండ్రికి ఫోన్లో విషయం చెప్పింది పరీక్ష. శంకర్రావు పావుగంటలో హాస్పిటల్ చేరుకున్నాడు. అడ్మిషన్ ఫీజు, మందుల సంగతి చూసుకున్నాడు.

అరగంటలో ప్రాథమిక పరీక్ష పూర్తి చేసి చెప్పాడు డాక్టర్,

"ఆమెకు బీపీ పెరిగింది. మెదడు మీద తీవ్రమైన ఒత్తిడి పడింది. అది తట్టుకోలేక నిద్రలోనే కోమాలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అయితే, వివిధ రిపోర్ట్స్‌లు అనుకూలంగానే ఉన్నాయి గనుక, ప్రాణానికి ప్రమాదం ఉండక పోవచ్చు. ఐసీయూలో ఉంచి, గమనిస్తుండాలి.

అయినా, పేషంట్ ఉదయం నిద్ర లేవకపోతే, అప్పుడే ఎందుకు తీసుకు రాలేదు?"

స్నేహమయి, పరీక్ష ముఖాముఖాలు చూసుకున్నారు.

"ఆమె మా నైబర్. ఉదయం నుంచీ లేవలేదన్న విషయం మధ్యాహ్నమే మాకు తెలిసింది. తెలిసిన వెంటనే తీసుకు వచ్చాం." చెప్పారు.

"ఆమెతో ఎవరూ ఉండరా? ఈ అబ్బాయి ఎవరు?"

"ఆమె కొడుకే. తనతోనే ఉంటాడు. కానీ, అతడికేం అర్థం కాదు. పెద్ద కొడుకు గౌహతిలో ఉంటాడు."

"అతడిని వెంటనే పిలిపించండి." చెప్పాడు డాక్టర్. తల ఊపారు వాళ్లు.

వేదాద్రి నంబర్ వాళ్లకి తెలియదు. విద్యాధరి ఫోన్ లాక్‌లో ఉంది. భద్రిని అడిగే విఫల ప్రయత్నం చేసింది పరీక్ష.

"అమ్మకి తెలుస్తుంది. ఇదే, ఈ ఫోన్‌లోనే మాట్లాడుతుంది. చెయ్యండి" అంటూ ఆందోళనగా చూడటం తప్ప మరేం చెప్పలేకపోయాడు భద్రి. తల్లికి ఏదో అయిందని అతడికి తెలిసినట్టే ఉంది. కానీ, అందుకు తనేం చేయాలో తెలిసినట్టు లేదు. వార్త వేదాద్రికి ఎలా చేరవేయాలో అర్థం కాక శంకర్రావు, స్నేహమయి బుర్రలు పగలకొట్టుకుంటున్నారు.

అంతలోనే, విద్యాధరి ఫోన్ మోగింది. వేదాద్రి చేస్తున్న విడియో కాల్!

చటుక్కున ఆన్సర్ చేసింది పరీక్ష. ఫోన్లో పరిచయం లేని మనిషిని చూస్తూనే, వేదాద్రి ముఖం జేవురించింది.

"ఎవరు మీరు? మా అమ్మ ఇంట్లో లేదా? లేక ఫోన్ తీసే తీరిక కూడా లేనంత బిజీ అయి పోయిందా? పరాయివాళ్ల ఫోన్ తీయించేదాకా వెళ్లిందా?" అరిచినట్టే అన్నాడు. మండిపోయింది

కంగారుగా బయటకు నడిచిందామె. రెండేసి మెట్లు చొప్పున దిగుతూ ఇంటికి పరుగెత్తింది. పరీక్షకి విషయం చెప్పి, మళ్లీ విద్యాధరి దగ్గరకి పరుగెత్తింది. పరీక్ష వెంటనే అంబులెన్స్‌కి ఫోన్ చేసింది. ఆంబులెన్స్ రావటంతోనే విద్యాధరిని అంబులెన్స్‌లోకి చేర్చారు. విషయం అర్థంకాని పరిస్థితిలో భద్రి, "ఎందుకు? ఎక్కడికి?" అంటున్నాడు. వాడికి ఎవరూ జవాబు చెప్పలేదు. తమతో పాటు హాస్పిటల్‌కి తీసుకు వెళ్లారు. అప్పటికే తండ్రికి ఫోన్లో విషయం చెప్పింది పరీక్ష. శంకర్రావు పావుగంటలో హాస్పిటల్ చేరుకున్నాడు. అడ్మిషన్ ఫీజు, మందుల సంగతి చూసుకున్నాడు.



పరీక్షకి.

"మిస్టర్. ఇది మీ ఇల్లు కాదు. హాస్పటల్. మీ అమ్మ ఐసీయూలో ఉన్నారు."

మరొక్క మాట మాట్లాడటానికి కూడా అసహ్యం వేసి, ఫోన్ తండ్రి చేతికి ఇచ్చేసింది.

"అమ్మకేమయింది?" కంగారుగా అడుగుతున్న వేదాద్రికి ఆమె తండ్రి జవాబు చెప్పాడు.

వేదాద్రి నిశ్చేష్టుడైపోయాడు.

"సార్, నేను వెంటనే బయలుదేరి వచ్చేస్తాను. దయచేసి, అంతదాకా మా అమ్మనీ, తమ్ముడినీ చూసుకోండి."

అతి కష్టం మీద చెప్పాడు. దుఃఖంతో అతడి స్వరం పూడుకుపోయింది.

* * *

వేదాద్రి ముంబై చేరుకునే సరికి మర్నాటి మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. నేరుగా హాస్పిటల్‌కి వెళ్లాడు. అక్కడే ఉన్నారు స్నేహమయి, పరీక్ష. వాళ్ల పక్కనే వెర్రి చూపులతో, దీనంగా మొహం పెట్టుకుని కూర్చున్న భద్రి, అన్నయ్యని చూస్తూనే భోరున ఏడ్చాడు. వేదాద్రి వాడిని దగ్గరకు తీసుకుని కౌగలించుకున్నాడు.

స్నేహమయి అతడిని సానుభూతిగా పలకరించి ధైర్యం చెప్పింది.

"మీ అమ్మకి ఏమి భయం లేదు బాబూ! డాక్టర్ చేతుల్లో పడింది గనుక, మనకింక భయం లేదు. నువ్వు వర్రీ అవ్వబోకు."

అపరిచితులైనా, ఆత్మీయంగా వ్యవహరిస్తున్న ఆమె తీరు చూసి, వేదాద్రి సిగ్గుతో చితికిపోయాడు. జవాబు చెప్పటానికి కూడా మొహం చెల్లలేదు. తమ్ముడిని దగ్గరకు తీసుకుని స్తబ్దుగా ఉండిపోయాడు.

వేదాద్రి వచ్చిన విషయం తెలియగానే శంకర్రావు హాస్పటల్‌కి చేరుకున్నాడు. అతడితో కలిసి డాక్టర్ దగ్గరకు వెళ్లాడు.

విద్యాధరికి అంతకుముందున్న ఆరోగ్య సమస్యల గురించి అడిగాడు డాక్టర్. మామూలు డయాబెటిస్, బీపీ తప్ప ఆమెకు మరేమీ అనారోగ్యాలు లేవని వివరించాడు వేదాద్రి.

"ఇప్పటి వరకు పేషంట్ పరిస్థితిలో మార్పు ఏమీ లేదు. అయితే, నెగటివ్ సింప్టమ్స్ కూడా లేవు కాబట్టి ఫరవాలేదు.

ఆమెకు ఇంకేమీ కంప్లెయింట్స్ కూడా లేవు అంటున్నారు గనుక, మానసిక విశ్రాంతితో తొందరగానే కోమా నుంచి బయట పడే అవకాశం ఉంది." చెప్పాడు ఆయన.

వేదాద్రి కళ్లలోకి వెలుగు వచ్చింది.

"థాంక్యూ డాక్టర్" అన్నాడు.

"నాకంటే ముందు మీ నైబర్స్‌కి థాంక్స్ చెప్పండి. కొన్ని గంటల తరవాత అయినా గమనించి,వాళ్లే మీ అమ్మగారిని హాస్పటల్‌కి తీసుకు వచ్చారు."

వేదాద్రి ముంబై చేరుకునే సరికి మర్నాటి మధ్యాహ్నం పన్నెండు గంటలయింది. నేరుగా హాస్పిటల్‌కి వెళ్లాడు. అక్కడే ఉన్నారు స్నేహ మయి, పరీక్ష. వాళ్ల పక్కనే వెర్రి చూపులతో, దీనంగా మొహం పెట్టుకుని కూర్చున్న భద్రి, అన్నయ్యని చూస్తూనే భోరున ఏడ్చాడు. వేదాద్రి వాడిని దగ్గరకు తీసుకుని కౌగలించుకున్నాడు. స్నేహమయి అతడిని సానుభూతిగా పలకరించి ధైర్యం చెప్పింది. "మీ అమ్మకి ఏమి భయం లేదు బాబూ! డాక్టర్ చేతుల్లో పడింది గనుక, మనకింక భయం లేదు. నువ్వు వర్రీ అవ్వబోకు."

"వాళ్లకి రుణపడిఉంటాను," అన్నాడు వేదాద్రి.

"ఒక్క మాట చెబుతాను. మీ అమ్మగారు వయసు మీరుతున్న మనిషి. మీ తమ్ముడు మెంటల్లీ ఛాలెంజ్డ్. వాళ్లు ఒక్కరే ఉండవలసిన పరిస్థితుల్లో, ఇరుగు పొరుగు ఎవరైనా వాళ్ల మంచిచెడ్డలు విచారిస్తూ ఉండటం అవసరం.

మీరు అటువంటి ఏర్పాటు ఏదైనా చేసుకోవటం మంచిది."

మౌనంగా తల ఊపాడు వేదాద్రి– తేలుకుట్టిన దొంగలా!

'ఈ డాక్టర్‌కి తన ఆలోచనలు తెలుసా? ఈ శంకరరావుగారి కుటుంబాన్నే దూరం పెట్టమంటూ, తను తల్లిని పోరుతూ వచ్చాడు. అదే జరిగి ఉండి, వాళ్లు నిన్న తమ ఇంటికి వచ్చి ఉండకపోతే ఏం జరిగేది?!"

ఊహా మాత్రానికే భయం వెన్నులో జరజర పాకగా, వణికిపోయాడు వేదాద్రి.

ఇరుగు పొరుగు సంబంధాలు ప్రాణవాయువు కన్నా ముఖ్యం అనిపించింది ఆ క్షణం.

* * *

మూడు నెలల తరవాత...

తల్లిని ఇంటికి తీసుకు వచ్చిన వేదాద్రి, ఆమెనూ, తమ్ముడినీ తీసుకుని తమ బిల్డింగ్ లో ఉన్న పదహారు ఫ్లాట్లకీ స్వయంగా తిరిగాడు. మిఠాయి పంచుతూ, అన్ని కుటుంబాలవారిని కలిశాడు.

'ఫ్లాట్ తీసుకున్నప్పుడు, డ్యూటీలో చేరాల్సిన హడావిడిలో మీ ఎవరిని కలియ కుండానే వెళ్లి పోయాను. అందుకే ఇప్పుడు కలుద్దామని వచ్చాను. ఇక్కడ అమ్మా, తమ్ముడే ఉంటారు. మీరు కాస్త కనిపెడుతూ ఉండాలి.' అని చెప్పాడు.

"నన్ను కనిపెట్టుకోవటానికేమీ లేదమ్మా, నాకేమీ సమస్యలు లేవు. మీకే నా నుంచి ఏ సాయం కావలసి వచ్చినా సంకోచం లేకుండా అడగండి. వీలున్నప్పుడు మా ఫ్లాట్‌కి వస్తుండండి. కబుర్లు చెప్పుకుంటే కాలక్షేపం."

చిరునవ్వుతో చెప్పింది తేలిక పడిన మనసు తెచ్చిపెట్టిన ఆరోగ్యంతో విద్యాధరి.

కొత్త ఉత్సాహంతో, ప్రశాంతమైన మనసుతో వెనక్కి బయలుదేరాడు వేదాద్రి.

గురజాడ వారు ప్రత్యక్షమై, 'అడ్డుగోడలు పగుల గొట్టుకు, పొరుగువారితో కలిసిపోవోయ్' అని చెప్తున్నట్టు తోచిందతడికి!

పచ్చేవారం కథ..

కిరాయిబంధం

– కటుకోజ్వల మనోహరాచారి



జీవితంలో ఎదురయ్యే ప్రతి సంఘటన, ప్రతి పనిలో ఆనందాన్ని వెదుక్కోవడం గురించి వేల సంవత్సరాల పూర్వమే లోకానికి చాటి చెప్పాడు. సుఖదుఃఖాలను సమంగా స్వీకరించే వారే స్థితప్రజ్ఞులంటూ ఆచరించి చూపాడు. రాజసూయ యాగంలో ప్రథమ తాంబూలంతో అగ్రపీఠ గౌరవం దక్కడాన్ని, తాను నిర్మించిన ద్వారకాపురి తన కళ్ల ముందే సముద్రంలో కుంగి పోవడాన్ని సమానంగా పరిగణించాడు. ఆ స్థిత ప్రజ్ఞత్వం, వర్ణించ అలవికాని వ్యక్తిత్వమే గోపాలుడిని (గోపబాలుడిని) గోవిందుడిని చేశాయి. అందుకే 'కృష్ణం వందే జగద్గురుం'.

కృష్ణం వందే జగద్గురుమ్..!

'వస్తూని కోటి శస్యంతు పావనాని మహీతలే
నతాని తత్తులాం యాంతి కృష్ణ నామానుకీర్తనే'

(భూమిమీద గల కోట్లాది పవిత్ర వస్తువులన్నింటినీ కలిపినా అవి శ్రీకృష్ణనామ సంకీర్తనకు సాటిరావు) అని కూర్మపురాణం పేర్కొంటోంది. 'శ్రీకృష్ణుడి పేరు పలకడం వల్ల ప్రేమ కలుగుతుంది. ఆ ప్రేమే ఆయనను నీ వద్దకు తెస్తుంది' అని ఉపదేశామృతం గ్రంథం చెబుతోంది. అధరం మధురం... వదనం మధురం.. నయనం మధురం, హసితం మధురం.. హృదయం మధురం... గమనం మధురం... మధురాధిపతే అఖిలం మధురం' అని వల్లభాచార్యులు (మధురాష్టకమ్) కీర్తించారు. 'అన్నిటికిది పరమౌషధము, వెన్నుని నామమే విమలౌషధం' (శ్రీకృష్ణ నామామృతపానమే భవరోగమును రూపుమాపే దివ్యౌషధం) అని అన్నమాచార్యగానం చేశారు.

మానవ సంబంధాలు నెరపడంలో కృష్ణుడిది ప్రత్యేకత శైలిగా ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు.. మిత్రధర్మం, గురుభక్తి గురించి ఈ తరం ఆయన నుంచి నేర్చుకోవాలంటారు. తాను పెరిగిన పరిసరాల్లో తెలియని వారు, ఆయన ప్రేమాభిమానాలను పొందనివారు లేరంటారు. వయోలింగభేదం లేకుండా అందరిని ఆకర్షించి అందరివాడయ్యాడు. ఉత్తమ సంస్కారం, శక్తియుక్తులతో జనావళిని ప్రభావితం చేశాడు. ప్రేమమైత్రీ భావాలను పెంపు చేశాడు. బాల్య స్నేహితుడు కుచేలుడిని సమాదరించడమే కాక, అర్జునుడిని బంధువు కన్నా స్నేహితుడిగానే మన్నించాడు.

అధికారం, హోదాల కోసం వెంపర్లాడలేదు. కోరి వచ్చిన అవకాశాలను మృదువుగా తిరస్కరించాడు. ఒక మాటలో పాలకుడి ఎంపికలో నిర్ణయాత్మక శక్తిగా ఉండాలనుకున్నాడు. ద్వారాకాధీశుడు అయి కూడా గోకులం వచ్చి గోవులు కాశాడు. భారత ఖండంలో కృషి (వ్యవసాయం) ప్రధానమైనది. అందుకే గోవంశాభివృద్ధిని కాంక్షించాడు. వాటిని పాలించి, రక్షించాడు. ఆదర్శవంతమైన గ్రామ వైభవాన్ని వృద్ధి చేశాడు. వనమాల, నెమలి పింఛం ధరించి, వెదురుతో మురళి తయారు చేసి... స్థానికంగా(పల్లెల్లో) దొరికే వస్తువులను వినియోగిం చాలని నేర్పారు.

అధర్మం పెరిగి, ధర్మం నశించేటప్పుడు తనను తాను సృష్టించుకుంటానని (ధర్మ సంస్థాపనార్థాయ/ సంభవామి యుగేయుగే') చాటిచెప్పి, లోకకల్యాణం కోసం అత్యాచారులను శిక్షించవలసిందే అనే సంకల్పంతో బంధువులు, స్నేహితులు, వృద్ధులు, గురువులు అనే వ్యత్యాసం చూపలేదు.. వ్యక్తిగతంగా ఎంత నచ్చీలుచైనా లోక ధర్మరక్షణకు ముందుకు రాని వారిని కురుక్షేత్రంలో కడతేర్చడంలో వెనుకాడలేదు జన్మతః కుసంస్కారులై ఎలాంటి ధర్మాలను పాటించని వారిని అంతమొందించి యుగధర్మ సృష్టి చేశాడు. అత్యాచార, అక్రమవర్తనులు, ప్రజా కంటకులను అంతం చేసి సుఖశాంతులు కలుగ చేశాడు. ప్రజలను చక్కగా పాలించే సమర్థుడైన ఒక రాజు పాలనలో దేశాన్ని ఉంచే సంకల్పంతో యుధిష్ఠిరుడితో రాజసూయం చేయించి ఏకఛత్రాధి పత్యాన్ని ఇచ్చాడు. కురుక్షేత్రంలో నైరాశ్యంలో కూరుకుపోయిన పార్థుడికి చేసిన గీతోపదేశం మానవులను తట్టి లేపే ధర్మఘంట.

దుష్టులకు ప్రళయకాళరుద్రుడు. సజ్జనులకు ఆశ్రయస్థాపకుడు. మహాయశస్వి, కార్యకుశలుడు. ఆయన రాజనీతి, తత్సంబంధిత బుద్ధి కుశలత, శత్రునిర్మూలన వ్యూహం అద్భుతమైనవి. వ్యూహం ప్రకారం శత్రువులను నిష్కంటకం చేస్తూ వచ్చాడు. కంసజరాసంధుల వధ అందుకు ఒక ఉదాహరణ. వారిద్దరి అండతో చెలరేగిపోతున్న దుర్యోధనుడిని కట్టడి చేయడానికి ఒకరిని సంహరించి, మరొకరిని సంహరింప చేశాడు.

శ్రీకృష్ణుడు శ్రావణ బహుళ అష్టమినాడు జన్మించినందున 'జన్మాష్టమి' అని, నామకరణా నంతరం 'కృష్ణాష్టమి', బాల్యం గోకులం గడపడం వలన 'గోకులాష్టమి' అని, ఆయన జన్మదినం కనుక 'శ్రీకృష్ణ జయంతి' అని, లోకానికి శ్రీకరం కనుక 'శ్రీజయంతి' అని వ్యవహారంలోకి వచ్చింది. అష్టమి నాటి రాత్రి రోహిణీ నక్షత్రంలో అవతరించినందున, ఆ తిథినాడు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం పూజాదికాలు నిర్వహిస్తారు.

దేశవ్యాప్తంగా అన్ని వైష్ణవ ఆలయాలలో కృష్ణాష్టమి వేడుకలు వైభవోపేతంగా జరుగుతాయి. ఉత్తరప్రదేశ్ మథురలో, బృందా వనంలో, ఒడిశాలోని పూరి జగన్నాథ స్వామి, కేరళలోని గురువాయూర్‌లోని గురువా యూరప్పన్, చెన్నైలోని పార్థసారథి స్వామి, తిరువాయూరులోని రాజగోపాల ఆలయాలలో, కర్ణాటకలోని ఉడిపి శ్రీకృష్ణాలయం తదితర ప్రముఖ ఆలయాలు ప్రత్యేక అలంకరణలతో కనువిందు చేస్తాయి. దేశవిదేశాలలోని 'ఇస్కాన్' మందిరాలు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాయి. తిరుమలలో శ్రీనివాసుడి పక్కనే కొలువై ఉన్న కృష్ణస్వామికి అర్చన చేస్తారు. ఆ రోజు సాయంత్రం శ్రీవారు ప్రత్యేకంగా కొలువుతీరడాన్ని 'గోకులాష్టమి ఆస్థానం' అంటారు. జగదానందకారకుడు, జగన్నాటక సూత్రధారి, రాధామానసచోరుడు, సత్యా విధేయుడు... ఇలా ఎన్నిపేర్లతో పిలిచినా 'చేతవెన్న ముద్ద చెంగల్వపూదండ...' అని బాలకృష్ణ రూపాన్నే భక్తకోటి ఇష్టపడుతుంది.

డా॥ ఆరవేల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

భారత మహిళా చదరంగ కోటలోకి దివ్యా దేశ్‌ముఖ్ రూపంలో ఓ యువరాణి వచ్చి చేరింది. జార్జియా వేదికగా ముగిసిన 2025 ఫిడే మహిళా ప్రపంచకప్ ను కేవలం 19 సంవత్సరాల వయసులోనే గెలుచుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది.

దివ్యాతి 'దివ్యం' భారత మహిళా చదరంగం!

మేధో క్రీడ చదరంగంలో భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. పురుషులు, మహిళలు అన్న తేడాలేకుండా రెండు విభాగాలలోనూ భారత క్రీడాకారులు విశ్వవిజేతలుగా రాణిస్తూ, దేశానికే గర్వకారణంగా నిలుస్తున్నారు.

చదరంగ ఒలింపియాడ్‌లో టీమ్, వ్యక్తిగత విభాగాలలో బంగారు పతకాలతో పాటు ఫిడే పురుషుల ప్రపంచ టైటిల్ సైతం భారత్ వశమయ్యాయి. అంతేకాదు.. మహిళల విభాగంలో జార్జియాలోని బటుమీ వేదికగా ముగిసిన 2025-ప్రపంచకప్ టైటిల్ సమరంలో సైతం ఇద్దరు భారత క్రీడాకారిణులే తలపడటం ఇదే మొదటిసారి.

చదరంగ శిఖరానికి పసికూన చెక్...

ప్రపంచ మహిళా చదరంగంలోని మేటి గ్రాండ్ మాస్టర్లంతా తలపడిన ఈ మహాసమరం ఫైనల్స్‌కు భారత మహిళా చదరంగ శిఖరం, 38 ఏళ్ల గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, 19 సంవత్సరాల ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్యా దేశ్‌ముఖ్ చేరి సంచలనం సృష్టించారు.

హోరాహోరీగా సాగిన సమరంలో అపార అనుభవం కలిగిన కోనేరు హంపిని 1.5- 0.5 పాయింట్ల తేడాతో ఖంగుతినిపించి తొలిసారిగా ప్రపంచకప్‌ను అందుకోడం ద్వారా పసికూన దివ్య పలు అరుదైన రికార్డులు నమోదు చేసింది.

ఎవరీ దివ్య దేశ్ ముఖ్...!

భారత మహిళా చదరంగం అనగానే గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి రమేశ్ మాత్రమే గుర్తుకు వస్తారు. అయితే... ప్రపంచకప్ విజయంతో సరికొత్త గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ ఈ దిగ్గజాల సరసన నిలిచింది. నాగపూర్‌లోని ఓ వైద్యకుటుంబంలో జన్మించిన దివ్య తనతండ్రి ప్రేరణతో చదరంగ క్రీడలో ప్రవేశించి సబ్-జూనియర్, జూనియర్ స్థాయిల్లో నిలకడగా రాణిస్తూ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించ గిలిగింది.

2020లో ఆన్‌లైన్ ఒలింపియాడ్‌లో బంగారు పతకం, 2021 సీజన్లో మహిళా గ్రాండ్ మాస్టర్ టైటిల్ కైవసం చేసుకొన్న దివ్య 2022లో జరిగిన భారత మహిళా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, చదరంగ ఒలింపియాడ్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాలు అందుకొంది. అటంతటితో సరిపెట్టుకోకుండా 2023 ఆసియా కాంటినెంటల్ టైటిల్‌తో పాటు 2024లో జరిగిన ప్రపంచ అండర్ -20 టైటిల్‌ను గెలుచుకోడం ద్వారా మహిళా చదరంగ గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించింది.

భారత 88వ గ్రాండ్ మాస్టర్ గా దివ్య....

2025 ఫిడే మహిళా ప్రపంచకప్ విజేతగా నిలవడం ద్వారా దివ్య పలు అరుదైన రికార్డులు తనపేరుతో లిఖించుకొంది. గ్రాండ్మాస్టర్ హోదా లేకుండా కేవలం ఇంటర్నేషనల్ మాస్టర్‌గా ప్రపంచకప్‌తో పాటు రూ. 43 లక్షలను ప్రైజ్ మనీగా అందుకొంది. అంతేకాదు..ప్రపంచకప్ విజయం ద్వారా ఎలాంటి నార్మ్‌లు లేకుండా గ్రాండ్ మాస్టర్ హోదాను సంపాదించింది. భారత చదరంగ చరిత్రలో గ్రాండ్ మాస్టర్ హోదా సాధించిన 88వ ప్లేయర్ గా రికార్డుల్లో చేరింది. అంతేకాదు..ఆ హోదా సాధించిన భారత నాలుగో మహిళగా నిలిచింది. దివ్య కంటే ముందుగా గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించిన భారత మహిళల్లో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలి ఉన్నారు.

హంపి, హారిక, వైశాలి త్రయంతో ఇప్పటికే అత్యంత పటిష్టంగా తయారైన భారత మహిళా చదరంగ జట్టు..నవతరం గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ రాకతో మరింత బలపడినట్లయింది.

నలుగురు దిగ్గజ గ్రాండ్‌మాస్టర్లతో కూడిన భారత మహిళా చదరంగానికి రానున్న కాలం 'స్వర్ణ' యుగం అనడంలో ఏ మాత్రం అతిశయోక్తికాదు.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్
కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు
1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-
3) ఒంగోలు గిత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-

Visit Youtube Link:
• Agriculture Implements at low cost - Rythu Nestham
• Low Cost agriculture machines to farmers - HMTV
Contact Number : 9849140465

అనితరసాధ్యం.. ఆపరేషన్

ఏప్రిల్ 22న పచ్చగా ఉన్న జమ్ము కాశ్మీర్ లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా కాల్పులు చేపట్టి మన దేశ పౌరులను పొట్టనపెట్టు కున్నారు. శ్వేతసౌధంలాగా వెలిగిపోతున్న కశ్మీర్‌లో నెత్తుటి ఏర్లను పారించారు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిం చింది. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవా దులు మొత్తం పాకిస్తాన్ ప్రేరేపిత ముష్కర మూకలని భారత ప్రభుత్వానికి ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద తండాలను నేలమట్టం చేసింది. అయినప్పటికీ పెహల్గామ్ దాడుల్లో పాల్గొన్న వారు సురక్షితంగా ఉండడం భారత భద్రతా దళాలకు, భారతీయులకు ఏమాత్రం సంతృప్తిని ఇవ్వలేదు.

అప్పటినుంచి అదును కోసం ఎదురుచూస్తున్న భారత భద్రతా దళాలు జూలై 28న ఆపరేషన్ మహదేవ్ చేపట్టాయి. పెహల్గామ్ దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. దాడులకు సూత్రధారి సులేమాన్ అలియాస్ హషీమ్ మూసాను మన జవాన్లు మట్టుబెట్టారు. హషీమ్ మూసా గతంలో పాక్ ఆర్మీలో పని చేశాడు. మిగిలిన ఇద్దరు టెర్రరిస్టులను యాసిర్, అబు హమ్జాగా గుర్తించారు. ఆపరేషన్ మహదేవ్‌లో చీనార్ కార్ప్స్, 24 రాష్ట్రీయ రైఫిల్స్, నాలుగు ప్రత్యేక పారామిలటరీ బలగాలు పాల్గొన్నాయి. రెండు వారాలుగా ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టాయి. దాచిగాం నేషనల్ పార్క్ పరిసర ప్రాంతంలో ఉగ్ర వాదులు సంచరిస్తున్నట్టు భద్రత దళాలకు తెలిసింది. అక్కడ ఉన్న సంచారజాతులవారు కూడా ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందించారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు అడవిలో దట్టమైన చెట్ల కింద తవ్విన ఒక గుహలో తలదాచుకున్నట్టు పక్కా సమాచారంతో భద్రతా దళాలు వారిని చుట్టుముట్టి ఒక్కసారిగా మట్టు పెట్టాయి.

అమిత్ షా

ఆ పేరు ఎందుకు పెట్టారంటే..

దాచిగాం సమీపంలో మహదేవ్ అనే పర్వతం ఉంటుంది. అందువల్లే ఈ ఆపరేషన్‌కు మహదేవ్ అని పేరు పెట్టారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం జబర్వన్, మహదేవ్ పర్వతాల మధ్య ఉంది. అందువల్లే ఈ ఆపరేషన్‌కు ఆ పేరు పెట్టారు. ఇక్కడ మహదేవ్ పర్వతంలో శివుడు నడయాడాడని.. అందువల్లే ఈ పర్వతం మహిమాన్వితమైనదని స్థానికులు చెబుతుంటారు. ఇక్కడి దట్టమైన అడవిలో శివుడు తపస్సు చేశాడని.. దానికి సంబంధించిన ఆనవాళ్లు కూడా ఉన్నాయని అంటారు.

ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలను నార్తర్న్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ అభినందించారు. దళాలు వేగంగా స్పందించి చర్యలు తీసుకొన్నాయని ఆయన పేర్కొన్నారు.

రెండుసార్లు సంకేతం..!

ఆపరేషన్ మహదేవ్ గురించి విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం.. ఉగ్రవాదులు ఉపయోగించిన చైనీస్ ఉపగ్రహ ఫోన్ నుంచి జూలై 26న వచ్చిన సిగ్నళ్లతో ఆర్మీ, జమ్ముకశ్మీర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అప్పటికి 17 రోజుల క్రితం అదే తరహా సిగ్నల్ వచ్చి ఉండడంతో అది ఉగ్రవాదు లకు సంబంధించిందేనని భావించి వేట కొనసాగిం చారు. ఆ సిగ్నల్ ఆధారంగా డ్రోన్ల సాయంతో వారిని అన్వేషిస్తూ శ్రీనగర్ శివార్లలో ఉన్న దాచిగాం అడవులు, జబర్వాన్ పర్వతశ్రేణిలో మహదేవ్‌పీక్ సమీపంలోని ముల్నార్ పీక్ వద్దకు చేరుకున్నారు.

ఆపరేషన్ ఆరంభం

జూలై 28 తెల్లవారుజామున 2 గంటలకు మహదేవ్ పర్వతంపైన దట్టమైన అడవిలో చైనీస్ ఆల్రా రేడియో కమ్యూనికేషన్ యాక్టివ్‌గా ఉన్నట్లు ఆర్మీ గుర్తించింది. ఈసారి ఉగ్రవాదులు దాక్కున్న ప్రదేశాన్ని గుర్తించడంలో చైనీస్ శాటిలైట్ ఫోన్ సిగ్నల్ కీలక పాత్ర పోషించింది. నిషేధిత టీ82 అల్ట్రాసెట్ శాటిలైట్ ఫోన్ అనుకోకుండా యాక్టివేట్ కావడంతో వారి ఆచూకీ బయటపడింది. ఈ ఫోన్ చైనాకు చెందిన హువావే నెట్‌వర్క్‌పై పనిచేస్తుంది. గత వారం చివర్లో ఫోన్ యాక్టివేట్ కావడంతో ఢిల్లీలోని యూనిట్లు సిగ్నల్‌ను గుర్తించాయి. దీంతో భారత బలగాలు వెంటనే చర్యలు ప్రారంభించాయి. భారతదేశం ఈ శాటిలైట్ ఫోన్‌లను 15 ఏళ్ల క్రితమే నిషేధించింది. 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత హువావే, జెడ్‌టీయీ ఉత్పత్తులపై పూర్తి నిషేధం విధించింది. ఈ ఫోన్‌లు చైనాకు చెందిన టియాం టాంగ్-1 శాటిలైట్ నెట్‌వర్క్ ద్వారా పనిచేస్తాయి. ఉగ్రవాదుల పెహల్గామ్ దాడికి ముందు రెక్కీ కోసం కూడా ఈ ఫోన్‌లనే ఉపయోగించారు. ఉగ్రవాదుల సిగ్నల్స్‌ను పట్టుకోవడానికి మన ఇంటెలిజెన్స్, ఆర్మీ.. దేశీయంగా తయారుచేసిన పరికరాలనే ఉపయో గించాయి. అప్పట్నుంచీ ఉగ్రవాదుల సిగ్నల్స్‌ను వెతుకుతూ.. మన ఆర్మీ, ఇంటెలిజెన్స్, సీఆర్పీఎఫ్ అధికారులు ఉత్తకాళ్లతో పలు పర్వతాలను అధిరో హించారు. బైసరన్ లోయలో మూడు శాటిలైట్ ఫోన్ సిగ్నళ్లను గుర్తించారు. వీటితోనే ఉగ్రవాదుల చివరి కదలికలు బయటపడ్డాయి. భారత బలగాలు శత్రువులను వేటాడటమే కాకుండా, వారి టెక్నాలజీని వారికే ఉచ్చుగా మార్చాయి. టీ82ను సాధారణంగా

మహాదేవ్..!

లష్కరే తాయిబా ఉగ్రవాదులే ఎన్క్రిప్టెడ్ మెసేజ్‌ల కోసం ఉపయోగిస్తుంటారు. వెంటనే బలగాలు అప్రమత్తం అయ్యాయి. ఉదయం 8 గంటలకు డ్రోన్ ఎగురవేశారు. డ్రోన్ పంపిన విజువల్స్ ఆధారంగా 9.30 కల్లా టెర్రరిస్టులు ఉంటున్న ప్రాంతాన్ని గుర్తించారు. దట్టమైన అడవిలో ఓ గొయ్యి తవ్వి దానిపై టెంట్‌వేసుకొని టెర్రరిస్టులు దాక్కున్నట్లు గుర్తించారు. ఉదయం 10 గంటల సమయంలో.. ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్ ఉగ్రవాద నిర్మూలన దళం, 4 పారా స్పెషల్ ఫోర్స్‌తో కలిసి మహాదేవ్ శిఖరంపైకి ఎక్కడం ప్రారంభిం చారు. అరగంటలోపే ఉగ్రవాదులు ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. 11 గంటల సమయంలో వారిపై కాల్పులు ప్రారంభించి మట్టుబెట్టారు. 11.45 గంటలకల్లా ఆపరేషన్ మహాదేవ్ ముగిసింది. ఘటనా స్థలం నుంచి 2 కి.మీ. చుట్టు పక్కలా కూంబింగ్ చేపట్టారు. 12.45 గంటలకు మృతదేహాలను గుర్తిం చారు. ఫొటోలు తీసుకున్నారు. మొత్తం 3 గంటల్లోనే 'ఆపరేషన్ మహాదేవ్'ను విజయవంతం చేశారు. ఈ ఆపరేషన్‌లో టెక్నాలజీ వినియోగం అత్యుత్తమంగా పనిచేసిందని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. దేశ భద్రత కోసం ఇది మరో విజయ గాథగా నిలిచింది.

వారి దగ్గర పాక్ చాక్లెట్లు కూడా ఉన్నాయి: అమిత్ షా

పెహల్గామ్ ఉగ్రదాడి సూత్రధారి సులేమాన్‌ను, అతడి ఇద్దరు సహచరులను మట్టుబెట్టిన మన భద్రతా దళాలు అసలు వారి ఉనికిని ఎలా పసిగట్టాయి? వారి దాకా ఎలా చేరుకున్నాయి? అంటే.. ఆ వివరాలన్నిం టినీ కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా లోక్‌సభలో వెల్లడించారు. అమాయక ప్రాణాలను బలిగొన్న పెహల్గామ్ ఉగ్రదాడి జరిగిన రోజు రాత్రి నుంచే ఆపరేషన్ మహాదేవ్ ప్రారంభమైందని, ఆ దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదుల గుర్తింపును ధ్రువీకరించుకోవడానికి, వారిని వేటాడడానికి కొన్ని నెలల సమయం పట్టిందని ఆయన తెలిపారు.

ఉగ్రవాదులు పాక్ నుంచే వచ్చారా అని కాంగ్రెస్ నేత చిదంబరం అడుగుతున్నారని.. టెర్రరిస్టులు పాకిస్తాన్ నుంచే వచ్చారనడానికి ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఉగ్రవాదులను మట్టుపెట్టిన చోటు నుంచి ఆయుధాలతో పాటుగా పాకిస్తాన్‌లో తయారైన చాక్లెట్లను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అమాయక పౌరులపై దాడి చేస్తే ప్రతిస్పందన చాలా తీవ్రంగా ఉంటుందని అమిత్ షా హెచ్చరించారు.

– ఆనంద్, 74060 74050
హిందూపురం

ఘనత

ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల హృదయాలను గెలుచుకొని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో తిరుగులేని జైత్రయాత్రను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. దీనికి నిదర్శనం అన్నట్టుగా ప్రపంచ నేతలకు ఉద్దేశించిన డెమొక్రటిక్ లీడర్ అప్రూవల్ రేటింగ్‌ల జాబితాలో 75 శాతం రేటింగ్‌తో అగ్రస్థానంలో నిలిచారు. ఈ మేరకు అమెరికా బిజినెస్ ఇంటెలిజెన్స్ కంపెనీ మార్నింగ్ కన్సల్ట్ ఇటీవల విడుదల చేసిన సర్వే ఫలితాలు వెల్లడించాయి. మోదీ తర్వాత 59 శాతం రేటింగ్‌తో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జాయి మ్యూంగ్ నిలిచారు. అయితే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కేవలం 44 శాతం రేటింగ్‌తో జాబితాలో ఎనిమిదవ స్థానంతో సరిపెట్టుకున్నారు. ప్రధాని మోదీకి దేశవిదేశాల్లో ఉన్న ప్రజాదరణను ది మార్నింగ్ కన్సల్ట్ సర్వే ఫలితాలు మరింత బలపరచాయి.

జాబితాలో తొలి 10 స్థానాల నేతలు

ప్రధాని నరేంద్ర మోదీ జాబితాలో మొదటి స్థానంలో నిలిచారు. సర్వేలో పాల్గొన్నవారిలో 75 శాతం మంది మోదీని ఒక ప్రజాస్వామ్య నేతగా ఆమోదించారు. ఏడు శాతం మంది ఎటూ తేల్చుకోలేకపోయారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జాయి మ్యూంగ్ 59శాతం రేటింగ్‌తో జాబితాలో రెండవ స్థానంలో నిలిచారు. సర్వేలో పాల్గొన్నవారిలో 59 శాతం మంది ఆయనకు పట్టం కట్టారు. 29 శాతం వ్యతిరేకించారు. 13శాతం మంది ఎటూ తేల్చుకోలేకపోయారు. అర్జెంటీనా అధ్యక్షుడు



జావియర్ మిలీ జాబితాలో మూడవ స్థానాన్ని దక్కించుకున్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో 57 శాతం మంది ఆయనకు అనుకూలంగా, 37 శాతం మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఆరు శాతం మంది తటస్థంగా ఉండిపోయారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే నాల్గవ స్థానంలో నిలిచారు. ఆయనకు అనుకూలంగా 56 శాతం మంది, వ్యతిరేకంగా 31 శాతం మంది ఓటు వేశారు. 13 శాతం మంది ఒక కచ్చితమైన అభిప్రాయానికి చేరుకోలేకపోయారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ ఐదవ స్థానాన్ని దక్కించుకున్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో 54 శాతం మంది ఆయనకు అనుకూలంగా, 35 శాతం మంది ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. 11 శాతం మంది ఎటూ తేల్చుకోలేకపోయారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షైన్‌బామ్ పార్డో ఆరవ స్థానంలో నిలిచారు. ఆమెకు అనుకూలంగా 53 శాతం మంది, వ్యతిరేకంగా 40 శాతం మంది వ్యతిరేకించారు. స్విట్జర్లాండ్ అధ్యక్షురాలు కరిన్ కెల్లెర్– సుట్టెర్ ఏడవ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆమెకు అనుకూలంగా 48 శాతం మంది, వ్యతిరేకంగా 28 శాతం మంది ఓటు వేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ జాబితాలో ఎనిమిదవ స్థానానికి పరిమితపోయారు. సర్వేలో పాల్గొన్నవారిలో 44 శాతం మంది ఆయనవైపు మొగ్గు చూపారు. 50 శాతం మంది వ్యతిరేకించారు. పోలాండ్ ప్రధాన మంత్రి డోనాల్డ్ టస్క్ తొమ్మిద స్థానాన్ని దక్కించుకున్నారు. ఆయనకు అనుకూలంగా 41 శాతం మంది, వ్యతిరేకంగా 49 శాతం మంది ఓటు వేశారు. ఇటలీ ప్రధానమంత్రి జియార్జియా మెలోని డెమొక్రటిక్ లీడర్ అప్రూవల్ రేటింగ్‌ల జాబితాలో 10వ స్థానంలో నిలిచారు. సర్వేలో పాల్గొన్నవారిలో ఆమెకు మద్దతుగా 40 శాతం మంది, వ్యతిరేకంగా 54 శాతం మంది నిలిచారు.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

భక్తాగ్రేసరులు

నామదేవుడు

మహారాష్ట్రలో నేటి నర్సి బామ్ని జిల్లా పర్భని గ్రామంలో 13వ శతాబ్దంలో జన్మించిన నామదేవుడు విఠోభా (పాండురంగ) భక్తుడు. ఆయననే సమస్తంగా భావించి ఆ విగ్రహం ముందు గంటల కొద్దీ కూర్చుని ఆధ్యాత్మిక అంశాలను చర్చిస్తూ, భజనలు చేసేవారు. ఇరవైయేళ్ల వయసులో అవంధ్య నాగనాథ్ అనే గ్రామంలో సంత్ జ్ఞానేశ్వరుడిని కలసి ఆయన వద్ద శిష్యరికం చేశారు. వందలాది అభంగాలు రాశారు. హిందూ ధర్మంలో దాదుపంత్ సంప్రదాయంలో ఐదుగురు గౌరవనీయ గురువులలో ఆయనను ఒకరిగా పరిగణిస్తారు. ఇతర సన్యాసులతో కలిసి దేశంలోని అన్ని ప్రాంతాలను సందర్శించి పంజాబ్ చేరుకున్నాడు. గురుగ్రంథ్ సాహిబ్‌ను సంకలనం చేసిన సిక్కుల ఐదవ గురువు అర్జున్ దేవ్ ఆయన రచనలను అందులో చేర్చారు. పండరీపురంలోని విఠల్ ఆలయ ప్రవేశ ద్వారం మొదటి మెట్టు నామ్‌దేవ్‌జీ పయరీగా ప్రసిద్ధి చెందింది.

కథ

అపాయంలో ఉపాయం



ఒక అడవిలో కొలనులో ఒక తాబేలు ఉండేది. ఒకరోజు సాయంత్రం అది నీటిలోంచి బయటకు వచ్చి, ఒడ్డున నెమ్మదిగా తిరగ సాగింది. ఇంతలో అక్కడకు వచ్చిందో నక్క. దాన్ని చూసి నీటిలోకి వెళ్లిపోవాలనుకుంది తాబేలు.

కానీ అంతలో నక్క దాన్ని చూడనే చూసింది. వెంటనే తాబేలు కాళ్లూ తలా కదలకుండా ఉండిపోయింది.

నక్క దాని దగ్గరకు వచ్చి పట్టుకుని చూసింది. పైన డొప్ప గట్టిగా తగిలింది.

తాబేలును తిరగేసి మూతిని దగ్గరగా పెట్టింది. ఇలా..నక్క తనని పరీక్షిస్తున్నంత సేపూ తాబేలు ఊపిరి బిగబట్టి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూర్చుంది. ఇంతలో దానికో ఉపాయం తట్టింది.

ధైర్యం చేసి తల కొంచెం బయటకు పెట్టి... 'అయ్యో నక్కబావా! నువ్వెన్ని తిప్పలు పడ్డా నా శరీరంలో పిసరంత మాంసమైనా తినలేవు' అంది.

'ఎందుకలా?' అన్నది అర్థం కాక నక్క ఆలోచనలో పడింది.

'నా శరీరం తీరే అంత నక్కబావా! నీటిలోంచి పైకి రాగానే గాలి తగిలి గట్టిపడిపోతాను. మళ్లీ

పద్యం

అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు
దినగ దినగ వేము తియ్య నుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ

భావం : పాడగా పాడగా రాగం వృద్ధి అవుతుంది. తినగా తినగా వేపాకు కూడా తియ్యగా ఉంటుంది. అలాగే దృఢ సంకల్పంతో పట్టుదల (సాధన)తో చేపట్టే పనులు నెరవేరతాయి.

శ్లోకం

ఐక్య స్నేహబలం శ్రేష్ఠం ఇతి ప్రాహుర్మనీషిణః
తస్మాత్ బలం సమాశ్రిత్య దేశకార్యపరోభవ

భావం : ఐకమత్యం,స్నేహం,బలం శ్రేష్ఠమైనవని పెద్దలు అంటారు. కనుక వాటిని సంపాదించుకొని మంచి పనుల్లో నిమగ్నం కావాలి.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

కొండగట్టు	సిద్ధిపేట
కొమురవెల్లి	నాగర్ కర్నూల్
ఐనవోలు	జగిత్యాల
సలేశ్వర్	మెదక్
ఏడుపాయల	వరంగల్ అర్బన్

జవాబులు : కొండగట్టు-జగిత్యాల, కొమురవెల్లి-సిద్ధిపేట, ఐనవోలు-వరంగల్ అర్బన్, సలేశ్వర్-నాగర్ కర్నూల్, ఏడుపాయల-మెదక్

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

అన్నా మణి (1918-2001)

భారతదేశానికి చెందిన వాతావరణ శాస్త్రవేత్త. భారత వాతావరణ విభాగంలో పని చేశారు. అనేక పరిశోధనా పత్రాలు ప్రచురించారు. వాతావరణ పరికరాల అభివృద్ధిపై విశేష కృషి చేయడంతో పాటు సౌరశక్తి, పవనశక్తి, ఓజోన్ పొరల పై అనేక పరిశోధనలు చేశారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ 1987లో కేఆర్ రామనాథన్ మెడల్‌తో ఈమెను సత్కరించింది.

నీళ్లు తగిలాయనుకో... వెంటనే మెత్తబడతాను. అందుకే నువ్వు నన్ను కాసేపు ఆ నీటిలో నానబెట్టు. ఆ తర్వాత కడుపారా తినొచ్చు' అని చెప్పింది తాబేలు.

అసలే జిత్తులమారి నక్క మహాతెలివైంది కదా! అందుకే తాబేలు మాటలు నమ్మీ నమ్మనట్టుగానే తల ఊపింది.

తాబేలును నీళ్లలో ఉంచి, అది పారిపోకుండా కాలితో నొక్కి పట్టింది. కాసేపయ్యాక, తాబేలు తెలివిగా 'నక్క బావా.. నేను పూర్తిగా నానాను. కానీ, నువ్వు కాలుపెట్టిన చోటే నానలేదు' అంది. దాంతో నక్క కాలును రవ్వంత పక్కకు జరుపుదామని కాస్త పైకి లేపింది. అందుకోసమే కాచుకుని ఉన్న తాబేలు బతుకుజీవుడా అనుకుంటూ చటుక్కున నీటిలోకి జారుకుంది. ★

జనరల్ నాలెడ్జ్

1. సూక్ష్మ దూరాలను కొలిచేందుకు ఉపయోగించే సాధనాన్ని ఏమంటారు?
2. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్.సి.ఐ) కేంద్ర కార్యాలయం ఎక్కడుంది?
3. వెనెజులా దేశ రాజధాని ఏది?

జవాబులు: 1. మైక్రోమీటర్ 2. న్యూఢిల్లీ 3. కారకస్

మెదడుకు మేత

మంచం కింద మామయ్యా:, ఊరికి పోదాం రావయ్య.. ఏమిటది?

జవాబు : దుప్పటి

మంచిమాట

నిన్ను నువ్వే కించపరుచుకుంటూ ఎదుటివారు నిన్ను గౌరవించాలనుకోవడం దురాశ..

వారఫలాలు

11-17 ఆగస్ట్ 2025

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

శుభకార్యాలపై కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఒక సంఘటన మీలో మార్పునకు కారణమవుతుంది. వ్యాపారులు కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. ఉద్యోగస్తులకు సంతోషకరమైన విషయాలు తెలుస్తాయి. పారిశ్రామికవేత్తలు ఇబ్బందుల నుంచి బయటపడతారు. రచయితలు, క్రీడాకారుల ఆలోచనలు ఫలిస్తాయి. 15,16 తేదీలలో అనుకోని ప్రయాణాలు. వృథా ఖర్చులు. శివస్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. ఆదాయం కొంత మెరుగుపడే సూచనలు. ఇంటి నిర్మాణాలలో ముందడుగు వేస్తారు. వ్యాపారులు పెట్టుబడులు సమకూర్చుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో అనుకూలత. పారిశ్రామికవేత్తలు సంస్థల విస్తరణలో విజయం పొందుతారు. క్రీడాకారులు, పరిశోధకుల కృషి ఫలిస్తుంది. 16,17 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

సంఘంలో పలుకుబడి పెంచుకుంటారు. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. వ్యతిరేక పరిస్థితులు సైతం అనుకూలమైనరీతిలో మలచుకుంటారు. మీ నిర్ణయాలపై కుటుంబసభ్యులు సంతోషిస్తారు. వ్యాపారులు ఆశించినంతగా లాభాలు గడిస్తారు. రచయితలు, క్రీడాకారులు లక్ష్యసాధనలో ముందుకు సాగుతారు. 11,12 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబ సమస్యలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

భూవివాదాలు కొలిక్కి వస్తాయి. సమాజసేవలో పాలుపంచుకుంటారు. కార్యక్రమాలు కొంత కష్టమైనా సకాలంలో పూర్తి చేస్తారు. నూతన విద్య, ఉద్యోగావకాశాలు. ఆహ్వానాలు అందుకుంటారు. వివాహయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు హోదాలు రాగలవు. రాజకీయవేత్తలు సత్తా చాటుకుంటారు. 13,14 తేదీల్లో బంధువులతో తగాదాలు. మానసిక అశాంతి. అనారోగ్యం. సూర్యస్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. కొన్ని కీలక నిర్ణయాలు. కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతారు. వాహనాలు కొనుగోలు చేస్తారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులు భాగస్వాములతో ఒప్పందాలు చేసుకుంటారు. ఉద్యోగులకు నూతనోత్సాహం. క్రీడాకారులకు కొత్త అవకాశాలు దక్కుతాయి. 15.16 తేదీల్లో వ్యయప్రయాసలు. అనారోగ్యం. శ్రమాధిక్యం. రాఘవేంద్ర స్తోత్రాలు పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ఆలయాలు సందర్శిస్తారు. గతంలో చేజారిన డాక్యుమెంట్లు తిరిగి లభ్యమవుతాయి. శుభకార్యాలపై బంధువులతో చర్చిస్తారు. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాల పూర్తి చేస్తారు. ఉద్యోగులకు ఒక సంతోషకర సమాచారం రాగలదు. రాజకీయవేత్తల ప్రయత్నాలు సఫలం. పరిశోధకులు, వైద్యుల ఆశయాలు నెరవేరతాయి. 16,17 తేదీలలో దూర ప్రయాణాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు. ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి. కీలక సమావేశాలకు హాజరవుతారు. ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. శుభకార్యాల రీత్యా ఖర్చులు ఎదురవుతాయి. దైవకార్యాలు చేపడతారు. రాజకీయవేత్తలకు సంతోషకరమైన సమా చారం అందుతుంది. కళాకారులు, రచయితల శ్రమ ఫలిస్తుంది. 13,14 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. విష్ణుధ్యానం చేయండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

తరచూ ప్రయాణాలు సంభవం. ఆదాయ, వ్యయాలు సమానస్థాయిలో ఉంటాయి. ఆరోగ్యం మెరుగుపడి ఉపశమనం. సోదరుల నుంచి పిలుపు. కొన్ని ఒప్పందాలలో ఆటంకాలు. వ్యాపారాలు క్రమేపీ వృద్ధి చెందుతాయి. ఉద్యోగాలలో కొన్ని మార్పులు. పారిశ్రామికవర్గాలకు కంపెనీల ఏర్పాటు విజయం. 11,12 తేదీల్లో కుటుంబంలో సమస్యలు. వివాదాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆదాయం మెరుగ్గా ఉండి కొన్ని అప్పులు తీరతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. భూములు, వాహనాలు కొనుగోలు యత్నాలు సానుకూలం. ఉద్యోగస్తులకు కీలక సందేశం అందుతుంది. రాజకీయవేత్తలు అనుకున్నది సాధిస్తారు. రచయితలు, క్రీడాకారులకు శుభవర్తమానాలు. 13,14 తేదీల్లో అనారోగ్యం. స్నేహితులతో విభేదాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

నిరుద్యోగులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్యపరంగా కొన్ని చికాకులు తప్పక పోవచ్చు. దూరపు బంధువులను కలుసుకుంటారు. వ్యాపారులు కొద్దిపాటి లాభాలతో సరిపెట్టుకోవాలి. ఉద్యోగులకు పనిభారం మరింత పెరుగుతుంది. కళాకారులకు ఒత్తిడులు ఎదురవుతాయి. 14,15 తేదీల్లో శుభ వార్తలు. ఆకస్మిక ధనలబ్ధి. ఆహ్వానాలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. చిరకాల ప్రత్యర్థులు స్నేహితులుగా మారతారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. విద్యార్థులకు ఉత్సాహ వంతంగా ఉంటుంది. వ్యాపారులకు మరింత లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఊహించని పోస్టులు రావచ్చు. కళాకారులు, రచయితల ఆశలు నెరవేరతాయి. 16,17 తేదీల్లో మానసిక అశాంతి. కుటుంబసభ్యులతో తగాదాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. ఆలోచనలు తక్షణం అమలు చేస్తారు. పరిచయాలు పెరుగుతాయి. పలుకుబడి పెరుగుతుంది. శుభకార్యాలపై కుటుంబంలో ప్రస్తావిస్తారు. కొన్ని నిర్ణయాలు అందర్నీ మెప్పిస్తాయి. వ్యాపారులు ఒడిదుడుకులు అధిగిస్తారు. ఉద్యోగులు విధులలో ముందడుగు వేస్తారు. కళాకారులు అవకాశాలు సొంతం చేసుకుంటారు. 12,13 తేదీల్లో మానసిక అశాంతి. అనారోగ్యం. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

పదరసం-526



ఆధారాలు

అడ్డం

1. మూడవ యుగం (3)
3. ధర్మరాజు నిర్వహించిన యాగం (4)
6. సత్యభామ ఈమె అంశ (3)
7. శిఖండి పూర్వజన్మలో... (2)
8. కృపుడు చెల్లాచెదరయ్యాడు (3)
11. అర్జునుడికి భగవాన్ బోధించినది (2)
13. యాదవ కులంలో...రోకలి (3)
15. గాంధారి సోదరుడు (3)
18. కృష్ణ స్పర్శతో వికృతరూపం పోయిన పడతి (2)
19. కృష్ణుడి జనన తిథి (3)
21. దేవకీ నందనుడి వర్ణం (3)
22 మహాభారతాన్ని ఇలానూ అంటారు (2)
24. కంసుడి సోదరి (3)
26. కృష్ణుడు ఈ దొంగట (2)
28. పాండురాజు పెద్దభార్య..అటు నుంచి (2)
29. బలరామకృష్ణుల సోదరుడు (3)

నిలువు

1. శ్రీకృష్ణుడి రాజధాని (3)
2. మురళి ధ్వనే...(3)
3. కర్ణుడి పెంపుడు తల్లి (2)
4. నిలువు 3కు భర్త (3)
5. భల్లూకపుత్రిక...కృష్ణ సతి (4)
9. ద్రౌపదికి మరో పేరు..నలుపు (2)
10. కృష్ణలీలలకు ఈ విశేషణం జోడిస్తారు (2)
12. కౌరవుల సంఖ్య..కింద నుంచి (2)
14. గోపన్న పెరిగిన ప్రాంతం..కిందనుంచి (3)
16. అటుకులు ఇచ్చిన చెలికాడు (4)
17. కృష్ణసతులు ఎందరు...? (2)
20. శ్రీకృష్ణుడి మెడలోని మాల (4)
23. కృష్ణుడి ముద్దు పేరట (3)
25 అడ్డం24 పతి పేరు తొలి రెండక్షరాలు(2)
27. సత్యభామ క్లుప్తంగా (2)

పదరసం - 525 సమాధానాలు





నవరసాలలో ఆబాల గోపాలాన్ని ఆకట్టుకునేది అద్భుతరసం. భక్తిరసంతో మేళవించి ఆ రసావిష్కరణ వెండితెరపై వెల్లివిరిస్తే.... థియేటర్లు దేవాలయాలుగా మారిపోవడం ఖాయం. 'మహావతార్ నరసింహా' చిత్రం ప్రదర్శితమౌతున్న థియేటర్లలో సరిగ్గా ఇదే జరుగుతోంది. జూలై 25న పాన్ ఇండియా చిత్రంగా వచ్చిన 'మహావతార్ నరసింహా' నామస్మరణను ఇవాళ దేశ వ్యాప్తంగా సినీ అభిమానులు చేస్తున్నారు. సినిమా చూస్తున్నంత సేపు కాళ్లకు చెప్పులను తీసేస్తున్నారు. భక్తిభావనతో కూర్చున్న చోటనే భజనలు చేస్తున్నారు. సినిమా పూర్తయిన తర్వాత ఆనందాశ్రువులతో చప్పట్లు చరుస్తున్నారు. భక్తిరసంలో ఓలలాడుతూ థియేటర్ల నుంచి బయటకు వస్తున్న పలు వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

'మహావతార్ నరసింహా'తో దేవాలయాలుగా థియేటర్లు!

యానిమేషన్ సినిమా అంటే హాలీవుడ్‌లోని సుప్రసిద్ధ నిర్మాణ సంస్థలు తెరకెక్కించినవే గుర్తొస్తాయి. భారతీయతకు దూరంగా, కొండకచో ఊహాతీతంగా తెరకెక్కే ఆ సినిమాలను కొన్ని దశాబ్దాలుగా పిల్లల నరనరాల్లో ఎక్కించేశారు. భారతీయ ఇతిహాసాలు, పురాణాలు అనేకం సినిమాలుగా వచ్చాయి. గొప్పగా ప్రేక్షకాదరణా పొందాయి. అయితే అందుబాటులో లేని సాంకేతిక కారణంగా వాటిని యానిమేషన్‌లో తీసి పిల్లలకు చూపించే ప్రయత్నం చాలా తక్కువగా జరిగింది. అప్పుడెప్పుడో వచ్చిన 'హనుమాన్' యానిమేషన్ సినిమా ఫర్వాలేదని పించుకుంది. గొప్ప విజయాన్ని అయితే అందుకోలేక పోయింది. ఆ తర్వాత మైథలాజికల్ యానిమేషన్ మూవీస్‌ను, సెమీ మైథలాజికల్స్‌ను మనవాళ్లు తీశారు. అవేవీ ప్రేక్షకులను పూర్తి స్థాయిలో థియేటర్లకు రప్పించలేకపోయాయి. ఇప్పుడు దర్శకుడు అశ్వినీ కుమార్ రూపొందించిన 'మహావతార్ నరసింహా' ఓ సరికొత్త రికార్డును సృష్టించింది. రూ. ఆరు కోట్లతో తీసిన ఈ యానిమేషన్ సినిమా పది రోజులలో దాదాపు రూ.ఎనభై కోట్ల గ్రాస్ వసూలు చేసింది. దేశంలో రూపుదిద్దుకున్న యానిమేషన్ చిత్రాలలో అత్యధిక వసూళ్ల సినిమాగా చరిత్ర సృష్టించింది.

2021లో అశ్విన్‌కుమార్ దర్శకత్వంలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్ ఈ సినిమాను ప్రారంభించారు. 2డి, 3డిలో రూపుదిద్దుకున్న దీనికి ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలిమ్స్ ప్రెజెంటర్‌గా వ్యవహరించింది. తెలుగులో గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ అధినేత అల్లు అరవింద్ జనం ముందుకు తీసుకొచ్చారు. సాధారణ ఓపెనింగ్స్‌తో మొదలైన ఈ సినిమా ఇవాళ మూడు నాలుగు రెట్లు అధిక థియేటర్లలో ప్రదర్శితమౌతోంది. కేవలం మౌత్ టాక్‌తో సూపర్ హిట్ దిశగా దూసుకు పోతోంది.

దశావతారాలలో నాలుగోది నరసింహావతారం. తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించడం కోసం మహావిష్ణువు నరసింహుడిగా అవతరిస్తాడు. భక్త ప్రహ్లాదుడి కథ అందరికీ తెలిసిందే. అసలు తెలుగు సినిమా ప్రారంభమే 'భక్త ప్రహ్లాద' చిత్రంతో జరిగింది. టాకీ పులిగా చెప్పుకునే హెచ్.ఎం. రెడ్డి దాన్ని నిర్మించిన ఆ సినిమా 1932లో విడుదలైంది. ఆ తర్వాత పదేళ్లకు (1942) మరోసారి 'భక్త ప్రహ్లాద' సినిమా తెలుగులో వచ్చింది. ఇక 1967లో విడుదలైన 'భక్త ప్రహ్లాద'ను ఎవరూ అంత తేలికగా మరచిపోలేరు. హిరణ్యకశిపుడిగా ఎస్వీ రంగారావు, ఆయన భార్యగా అంజలీదేవి, ప్రహ్లాదుడిగా రోజా రమణి, విష్ణుమూర్తిగా హరనాథ్, నారదుడిగా మంగళంపల్లి బాలమురళీ కృష్ణ అద్భుతంగా నటించారు. చిత్రపు నారాయణమూర్తి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు సాలూరి రాజేశ్వరరావు స్వరపర్చిన పాటలు ఇప్పటికీ సంగీత ప్రియులను అలరిస్తూనే ఉన్నాయి. అలాంటి భక్తిరస ప్రధాన చిత్రాన్ని ఈ తరానికి నచ్చేలా యానిమేషన్‌లో తెరకెక్కించి విజయం సాధించారు అశ్వినీకుమార్.

కశ్యపదితి దంపతులకు జన్మించిన హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు లోకకంటకులుగా మారడంతో ఈ సినిమా ప్రారంభమౌతుంది. త్రిలోకాలను తన అదుపులోకి తెచ్చుకున్న ఈ సోదరులలో ఒకడైన హిరణ్యాక్షుడు భూదేవిని సముద్ర గర్భంలోకి విసిరివేయడంతో ఆమెను రక్షించడానికి బ్రహ్మదేవుని నాశిక నుండి విష్ణువు వరాహమూర్తిగా ఉద్భవిస్తాడు. భూదేవిని రక్షించి, అసుర రాజును సంహరిస్తాడు. తన సోదరుడి మరణంతో అగ్రహోదగ్ధుడైన హిరణ్యకశిపుడు మరింత బలశాలి కావడం కోసం బ్రహ్మ నుండి వరాలు పొందడానికి తపస్సు చేస్తాడు. అదే సమయంలో ఆయన భార్య కయాదు గర్భంలోని ప్రహ్లాదుడు హరి నామస్మరణతో జన్మిస్తాడు. బ్రహ్మ ఇచ్చిన వరంతో విష్ణువును సైతం ధిక్కరించే హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడి హరినామస్మరణ చెవిలో జోరీగలాఅవుతుంది. సొంత కొడుకు అనే ఆలోచన కూడా లేకుండా విష్ణు ద్వేషంతో అతన్ని అంతం చేయడానికి హిరణ్య కశిపుడు ప్రయత్నించడం, 'నీ హరి ఎక్కడ' అని ప్రశ్నించి ఆయనను రప్పించుకొని హతుడవుతాడు. రెండు గంటల పదినిమిషాల నిడివి గల ఈ సినిమా ఆద్యంతంగా అద్భుతంగా సాగింది. మరీ ముఖ్యంగా చివరి ఇరవై నిమిషాలలో నరసింహుడి ఆగమనంతో రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ప్రేక్షకులంతా భక్తి భావనకు లోనవుతారు. అలా ఇందులోని పాత్రలను యానిమేషన్ ద్వారా గొప్పగా తీర్చిదిద్దింది అశ్వినీకుమార్ బృందం. పతాక సన్నివేశంలోని హిరణ్యకశిపుడి ధను ఏ సినిమాలోనూ చూసి ఉండం. సామ్ సి.ఎస్. తన నేపథ్య సంగీతం కారణంగా మరింత గొప్పగా ఈ సన్నివేశాలు ఎలివేట్ అయ్యాయి.

విశేషం ఏమంటే... దశావతారాలకు సంబంధించి అశ్విన్ కుమార్ బృందం వేసిన తొలి అడుగు మాత్రమే 'మహావతార్: నరసింహా'. దీనికి కొనసాగింపుగా మైథలాజికల్ సినిమాటిక్ యూనివర్స్‌ను వారు సృష్టించబోతున్నారు. మరో పన్నెండేళ్లపాటు ఈ సీరిస్‌లో వరుసగా సినిమాలు రాబోతున్నాయి. దీని తర్వాత మరో ఆరు సినిమాలకు సంబంధించిన పథక రచన జరిగింది. 2027లో 'మహావతార్: పరశురామ్'ను, 2029లో 'మహావతార్ : రఘునందన్', 2031లో 'మహావతార్ : ద్వారకాదీశ్', 2033లో 'మహావతార్:గోకులానంద్', 2035లో 'మహావతార్ :కల్కి-1', 2037లో 'మహావతార్:కల్కి-2' సినిమాలు రాబోతున్నాయి. అవన్నీ బాగుంటాయనే నమ్మకం కలుగుతోంది. ఇలాంటి సినిమాలను ఓటీటీలో చూద్దామనే భావన మనసులోకి రానీయకుండా థియేటర్లలో చూస్తేనే అసలైన రసానుభూతి కలుగుతుంది.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

నట్టింట గంగమ్మకు నీరాజనం

తరలింది తరలింది గంగా..
సాగరుల పాపములు కడుగంగా..
సద్గతులను వారికొసగంగా..
అల భగీరథునిచే ఇల పైన నిలుపంగా
తాను భాగీరథిగా... పుణ్యమొసగే నదిగా..
తరలింది..తరలింది.. గంగా...

అంటూ నట్టింటికి వచ్చిన గంగమ్మను చూసి భక్తి పారవశ్యంలో మునిగితేలాడు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చంద్రదీప్ నిషద్. తొలుత వాకిట తలుపు తట్టిన గంగమ్మకు పాలు, పుష్పాలను సమర్పించుకున్నాడు. ఆ తర్వాత నట్టింటికి చేరుకున్న సురగంగకు ప్రణమిల్లాడు. పవిత్రస్నానమాచరించాడు. "ఈ రోజు గంగామాత మా ఇంటిని పావనం చేసింది. మాతకు పూజలు చేశాను. భక్తి సాగరంలో ఓలలాడాను. జై గంగామాతా!!" అంటూ చంద్రదీప్ పోస్టు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వరద విపత్తులోనూ భక్తి భావనను ప్రదర్శించిన పోలీసును నెటిజన్లు అభినందనలతో ముంచెత్తారు. ప్రయాగరాజ్‌లో వరదలపై యూపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. పెద్ద ఎత్తున సహాయక బృందాలను మోహరించింది. నగరంలో నిత్యావసరాలను పంపిణీ చేసింది. బాధితుల కోసమని 100కు పైగా పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 41

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.400/-



వెల : ₹.200/-



వెల : ₹.150/-



వెల : ₹.499/-



వెల : ₹.140/-



వెల : ₹.250/-



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.499/-

వెల:₹.49/-



వెల :₹.450/-



వెల : ₹.499/-



వెల : ₹.125/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722.

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01